ఆదివారం

మన తెలంగాణ

హైదరాబాద్
సంపుటి 6
సంచిక: 232
11, ఆదివారం
ఫిబ్రవరి, 2018

www.manatelangana.news

అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad | పేజీలు: 12 + 16 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

Mana Telangana





చేప తక్కువ తిండి

- ప్రతి వ్యక్తి ఏడాదికి 13 కిలోల చేపలు తినాలి
- రాష్ట్రంలో తలసరి వినియోగం 6.21 కిలోలే
- ఇష్టమున్నా ముళ్ల భయంతో పలువురు వెనుకంజ
- తగినంతగా లభించకపోవడమూ కారణమే!
- తెలంగాణలో ఒక్కొక్కరికి సగటు లభ్యత 5.21కిలోలే
- ఉచిత పంపిణీ వల్ల ఉత్పత్తి స్వల్ప మాత్రమే పెరుగుదల
- జాతీయస్థాయి వినియోగం తలసరి 9 కిలోలు
- రాష్ట్ర మత్స్యశాఖ నివేదిక వెల్లడి

3


రాష్ట్రంలో చేపల ఉత్పత్తి

సంవత్సరం	చేపల ఉత్పత్తి (టన్నులలో)
2012–13	219628
2013–14	249633
2014–15	268362
2015–16	236752
2016–17	198921
2017–18 (సెప్టెంబర్ వరకు)	145126



కొత్త పట్టాదారు పాస్‌బుక్కుల ముద్రణకు కేబినెట్ ఆమోదం 6





కాళేశ్వరం, భగీరథలకు ఆర్థిక సంఘం బృందం

కితాబులు

- ఇతర రాష్ట్రాలకు ప్రేరణ ఇచ్చే ప్రాజెక్టులు
- కాళేశ్వరం కాలంతో పరుగులు పెడుతోంది
- భగీరథ స్వచ్ఛభారత్‌కు ఆలంబన : 15వ ఆర్థిక సంఘం అధికారుల బృందం ప్రశంసల వర్షం

మన తెలంగాణ / సంగారెడ్డి/ కరీంనగర్ : దక్షిణాది రాష్ట్రాలతో ప్రాంతీయ సమావేశం నిర్వహించడానికి వచ్చిన 15వ ఆర్థిక సంఘం అధికారుల బృందం శనివారం మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టులను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ రెండు ప్రాజెక్టుల ఆలోచన రావడమే గొప్ప విషయమని, దాని వెన్నంటే పనులు త్వరితగతిన జరుగుతుండడం అన్ని రాష్ట్రాలకు ప్రేరణ అని బృందం సభ్యులు ప్రశంసలు గుప్పించారని ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొనింది. కాళేశ్వరం ప్రాజెక్టు పనులు కాలంతో పరుగులు పెడుతూ ఉంటే మిషన్ భగీరథ మాత్రం స్వచ్ఛభారత్‌కు ఆలంబనగా నిలిచిందని ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా వ్యాఖ్యానించారని పేర్కొనింది. ఇంటింటికీ రక్షిత త్రాగునీరు అందించడం బృహత్తరమైన కార్యమని, ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా అధికారులు వేగంగా పనులు చేయడం అభినందించదగిన విషయమని ఆయన వ్యాఖ్యానించినట్లు ప్రకటన పేర్కొనింది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం పరిధిలోని కోమటిబండలో నెలకొల్పిన మిషన్ భగీరథ ప్రాజెక్టు పైలాన్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. స్వచ్ఛమైన త్రాగునీరు దొరకకపోవడం కూడా పౌష్టికాహార లోపమేనని, చాలా రాష్ట్రాల్లో ఇది కనిపిస్తుందని, కానీ మిషన్ తరువాయి 6లో





నలుగురు రాష్ట్ర మహిళల 6

సప్తదేశ సాహస బైక్ యాత్ర

భవన నిర్మాణ ఉత్పత్తుల ప్లాంట్

- దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో ఏర్పాటు
- సుమారు 10వేల ఉద్యోగావకాశాలు
- మంత్రి కెటిఆర్

3



ఆర్‌టిసి బస్సు, టిప్పర్ ఢీ

25 మందికి తీవ్ర గాయాలు, టిప్పర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

మనతెలంగాణ/పుల్‌కల్: నాందెడ్ ఆకోలా జాతీయ రహదారిపై ఆర్‌టిసి బస్సు, టిప్పర్ ఢీ కొని 25 మంది ప్రయాణికులతో పాటు డ్రైవర్‌కు తీవ్ర గాయలైన సంఘటన శనివారం సంగారెడ్డి జిల్లా, శివ్వంపేట సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం....నారాయణఖేడ్ డిపోకు చెందిన టిఎస్ 15 యు ఎ6098 నెంబర్ గల ఆర్‌టిసి బస్సు హైదారాబాద్ నుండి నారాయణఖేడ్ వెళ్తున్న క్రమంలో శివ్వంపేట వద్ద ఎదురుగా వస్తున్న టిఎస్ 15యుసి 1359 నెంబర్ గల టిప్పర్‌కు ఢీ కొట్టింది. బస్సులో ప్రయణిస్తున్న 65 మంది ప్రయాణికులలో 25 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే 108 అంబులెన్స్ ద్వారా సంగారెడ్డి ప్రభుత్వ



ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. టిప్పర్ డ్రైవర్ బస్వరాజ్ కుడి కాలు స్టీరింగ్‌లో ఇరుక్కుపోయింది. స్థానికులు బయటకు తరువాయి 6లో



పార్టీల గుర్తింపు రద్దు అధికారం ఇవ్వండి

సుప్రీంకోర్టును కోరిన కేంద్ర ఎన్నికల సంఘం 10



రూ.7లక్షల బంగారు ఆభరణాల చోరీ

హైదరాబాద్ ఆరాంఘర్ బస్టాప్‌లో మహిళ వద్ద నుంచి 20 తులాల బంగారం బ్యాగుతో పరారీ

మన తెలంగాణ / రాజేంద్రనగర్ : బంధువుల ఇంట్లో జరిగే శుభ కార్యానికి వెళ్తున్న ఓ మహిళ బ్యాగులోని సుమారు ఏడు లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. బస్సు ప్రయాణంలో ఒంటిపై ఆభరణాలు తరువాయి 6లో



కుంచెపోటు



అమ్మో...భవిష్యత్తులో అంతమంది రాజకీయ నాయకులు తయారవుతారేమోగా..!

అసైన్డ్ ఆర్డినెన్స్?

తిరిగి పేదలకు కేటాయింపుకి 2014 జూన్ 2 కటాఫ్ తేదీగా చట్టాన్ని సవరించాలని ప్రభుత్వం యోచన



మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలోని అసైన్డ్ భూములను పేదలకు తిరిగి కేటాయించడానికి వీలుగా ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టానికి సవరణలు చేస్తూ ఆర్డినెన్స్‌ను తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం 2007 జనవరి చివరి నాటికి అసైన్డ్ భూములను అనుభవిస్తున్నవారికి మాత్రమే తిరిగి కేటాయించే అవకాశం ఉంది. దీన్ని సవరించి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 2ను కటాఫ్ తేదీగా పెట్టేలా చట్టంలో సవరణలు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు వచ్చే నెల 12 నుంచి ప్రారంభం కానున్నందున ఈ లోగానే ఆర్డినెన్సును తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సచివాలయ వర్గాల సమాచారం. గతంలో ప్రభుత్వం అసైన్డ్ భూములను పేదలకు కేటాయించినా ఆ తర్వాతి కాలంలో క్రయ విక్రయాలు జరిగి చేతులు తరువాయి 6లో

మన తెలంగాణ

2 హైదరాబాద్
ఆదివారం
11, ఫిబ్రవరి 2018

www.manatelangana.news

కాంట్రాక్టు, ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణలో సమస్యలు : పల్లా



మన తెలంగాణ/హైదరాబాద్: కాంట్రాక్ట్, ఒప్పంద ఉద్యోగులను క్రమబద్ధీరణ విషయంలో కొన్ని న్యాయపరమైన సమస్యలు ఎదురవుతున్నాయని, ఈ విషయంలో ప్రభుత్వం నిబద్ధతతోనే ఉన్నదని టిఆర్ఎస్ ప్రభుత్వ విప్ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో తెలంగాణ ఇన్‌క్లూసివ్ ఎడ్యూకేషన్ రిసోర్స్ టీచర్స్ అసోసియేషన్(టిఐఇఆర్‌టిఎ) –2018 డైరీని శనివారం పల్లారాజేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు చేస్తున్న సేవలను ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఉద్యోగులకు కనీస వేతనాలను రూ.28 వేలను చెల్లించేలా విద్యాశాఖ మంత్రితోమాట్లాడుతానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజి ఎంపి గుండు సుధారాణి, ఎంఎల్‌సి శ్రీనివాస్‌రెడ్డి, టిఆర్ఎస్‌వి అధ్యక్షులు జల్ల శ్రీనివాస్‌యాదవ్, టిఐఇఆర్‌టిఎ రాష్ట్ర అధ్యక్షులు టి ప్రవీణ్‌కుమార్, వ్యవస్థాపక అధ్యక్షులు బి.మల్లేష్‌గౌడ్, గౌరవ అధ్యక్షులు బోయ శ్రీనివాస్, కార్యదర్శి విజయచారి, నాయకులు దామోదరచారి, షేక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

‘తప్పనిసరి తెలుగు’కు ఆర్డినెన్స్?

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో అన్ని రకాల విద్యాసంస్థల్లో ఒకటో తరగతి నుంచి 12వ తరగతి వరకు తెలుగును తప్పనిసరిగా బోధించే విధానానికి సంబంధించి త్వరలో ఆర్డినెన్స్ వెలువడనుంది.ఈ అంశంపై విద్యాశాఖ రూపొందించిన ముసాయిదా ఆర్డినెన్స్‌ను న్యాయశాఖ పరిశీలనకు పంపించారు. ఈ ఉముసాయిదా ఆర్డినెన్స్‌ను న్యాయశాఖ అవసరమైన మార్పులు చేర్పులు సూచిస్తే దానికి అనుగుణంగా సవరణలు జరుగుతాయి. ఆ తర్వాత మంత్రివర్గ ఆమోదంతో ఆర్డినెన్స్ వెలువడనుంది. ప్రభుత్వ ఆదేశం మేరకు గవర్నర్ ఆర్డినెన్స్ జారీ చేయనున్నారు. ఈ ఆర్డినెన్స్ వెలువడితే రానున్న విద్యా సంవత్సరం నుంచి స్టేట్ సిలబస్ అమలు చేస్తున్న స్కూళ్లతో పాటు సిబిఎస్‌ఇ, ఐసిఎస్‌ఇ, క్రేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్ సిలబస్‌ను అమలు చేస్తున్న స్కూళ్లలో కూడా ఒకటవ తరగతి నుంచి 12వ తరగతి వరకు తెలుగు తప్పని సబ్జెక్ట్‌గా అమలు కానుంది. అయితే ఈ విధానం అమలులోని ఆచరణాత్మక ఇబ్బందులను ఏ విధంగా అధిగమించాలన్నదానిపై ప్రభుత్వం పలు రకాల ఆలోచనలు చేస్తూ ఉంది.

మావోయిస్టు రమణన్న దంపతులు అరెస్టు



మన తెలంగాణ/హైదరాబాద్ : మావోయిస్టు నేత రమణన్నను మహారాష్ట్ర పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా బల్లార్షాలో భార్య పద్మతో సహా అరెస్టు చేసినట్లు గడ్చిరోలి పోలీసులు పేర్కొన్నారు. దండకారణ్య జోనల్ కమిటి సభ్యుడిగా కొనసాగుతున్న రమణన్న మావోయిస్టుల పత్రిక ‘జన్‌కార్’కు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారని, గడ మూడు దశాబ్దాలుగా మావోయిస్టు పార్టీలో అజ్ఞాత జీవితం గడుపుతున్నట్లు ఆ రాష్ట్ర పోలీసులు పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహారాష్ట్ర, ఛతీస్తస్‌గడ్ ప్రభుత్వాలు ఆయనపై రూ.25 లక్షలు, భార్య పద్మపై రూ.6 లక్షలు రివార్డు ప్రకటించాయి. రమణన్నకు రవి, సురేష్, టెక్ రమణ అనే మార్లు పేర్లు ఉన్నాయి. ప్రస్తుతం అతని వయస్సు 56 ఏళ్లు ఉంటుంది. జనగాం జిల్లా జీడికల్లు గ్రామానికి చెందిన రమణన్న హైదరాబాద్‌లో ఐటిఐ, పాలిటెక్నిక్ కోర్సుల్ని పూర్తి చేశారు. ఆ తరువాత 30 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నారు.

బిసి సమాఖ్య నూతన కార్యవర్గం



పాండురంగాచారి

మన తెలంగాణ/హైదరాబాద్ : వెనుకబడిన తరగతుల (బిసి) హక్కుల సాధన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులుగా ప్రొ. సారంగపాణి, ప్రధాన కార్యదర్శిగా రాయబండి ఎన్నికయ్యారు. సమాఖ్య గౌరవ సలహాదారులుగా బొమ్మగాని ప్రభాకర్, టి.వెంకట్రాములును ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో జరిగిన సమాఖ్య రాష్ట్ర సమావేశంలో 79 మందితో నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి పాండురంగాచారి ఒక ప్రకటనలో తెలిపారు. సమాఖ్య ఉపాధ్యక్షులుగా కళ్ళెం కృష్ణ, ఓ.ఓమయ్య, టి.శ్రీనివాస్, బి.రాములు యాదవ్, టి.నాగేష్, ప్రకాష్ చారి, కాలువ నర్సయ్య యాదవ్, ఎ.వీరాస్వామి, దర్శి సత్యనారాయణ, కార్యదర్శులుగా ఏశాల అశోక్, ఎస్.రాజమౌళి, సాయిలు, శ్రీనివాస్, ఉపేంద్రాచారి, ఎల్.శ్రవన్‌కుమార్, కె.విజేయుడు, పి.కుమార్, బాలకృష్ణ, రాకేష్‌లను సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన వివరించారు. కాగా సమాఖ్య హైదరాబాద్ జిల్లా కన్వీనర్‌గా రాకేష్‌సింగ్‌ను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

OFFICE OF THE SUPERINTENDING ENGINEER, HYDERABAD CIRCLE
T.S. MEDICAL SERVICES & INFRASTRUCTURE DEV. CORPORATION
In the premises of District Hospital, King Koti, Hyderabad-500 001. Ph: 24753405

Chit Tender Notice No:73/SE/TSMSIDC/Hyd.Cir/2017-18/1386. Dt: 10.02.2018

Tenders are invited through e-procurement platform for the works **(1)** Providing of 125KVA Diesel Generator Set under Buy-Back in the **Govt. General & Chest Hospital, Irramnuma, Hyderabad** for **Rs.16.00 Lakhs. (2)** Providing 250 KVA Transformer for HT installations and Rewiring of Ground Floor and First floor at **State T.B. Centre at Erragadda in Hyderabad** for **Rs.40.00 Lakhs.** The other details can be seen at website: **www.tender.telangana.gov.in**

Sd/- SUPERINTENDING ENGINEER

PARAS పృథ్వి ఎస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ & సెక్యూరిటైజేషన్ కంపెనీ లిమిటెడ్
[illegible] హైదరాబాద్-500084, [illegible] 040- 41413333, ఫ్యాక్స్: 040-41413301. ఇ-మెయిల్:co@paras.org.in/ వెబ్‌సైట్: www.paras.org.in

[illegible]

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 [illegible] రూల్ 9(1) క్రింద నోటీసు

[illegible] 31.01.2018 [illegible] రూ. 1,43,03,431/- [illegible] SARFAESI Act [illegible]

క్రమం	ఆస్తి వివరణ	రిజర్వు ధర	ఐయానా (EMD)
1.	తెలంగాణ, రంగారెడ్డి జిల్లా, [illegible] 4900 [illegible] ఉత్తరం : 30 అడుగుల వెడల్పు రోడ్ దక్షిణం : [illegible] తూర్పు : 40 అడుగుల వెడల్పు రోడ్ పడమర : ప్లాట్ నం. 26 మరియు ప్లాట్ నం. 27 (భాగము)	రూ. 2,02,00,000/-	రూ. 20,20,000/-

[illegible] 09.03.2018 [illegible] 11.00 [illegible] 3.00 [illegible] 15.03.2018 [illegible] 2.00 [illegible] 500084. [illegible] 15.03.2018 [illegible] 2.30 [illegible] రూ. 50,000/- [illegible]

[illegible]

1) [illegible]
2) [illegible] 25% [illegible]
3) [illegible] 75% [illegible]
4) [illegible]
5) [illegible] www.paras.org.in [illegible]
6) [illegible]
7) [illegible]
8) [illegible]

తేది: 08/02/2018 [illegible]
స్థలం: హైదరాబాద్ [illegible]

‘పెట్టుబడి’కి కసరత్తు

జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో పథకం అమలు

- రోజుకు 2లక్షల చెక్కుల ముద్రణ
- ఏప్రిల్ చివరిలోగా పూర్తి
- నోడల్ బ్యాంకుగా ఎస్‌బిఐ

మన తెలంగాణ/హైదరాబాద్: వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకాన్ని ప్రభుత్వం జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కసరత్తును ఇప్పటికే ప్రారంభించింది. వానాకాలం సీజన్‌కు సంబంధించి మే నెల మొదటి వారం నుంచే ఎకరాకు రూ. 4వేల చొప్పున చెక్కుల రూపంలో గ్రామ సభల్ని ఏర్పాటు చేసి రైతులకు పంపిణీ చేయనున్నారు. ఈ పథకానికి రైతు సమన్వయ సమితులను కూడా ప్రభుత్వం వినియోగించుకోనుంది. ఇటీవల భూ రికార్డుల ప్రక్షాళన తరువాత తేలిన ఖాతాల సంఖ్య ఆధారంగా 70 లక్షల చెక్కులను ముద్రించాల్సి ఉంది. చెక్కుల ముద్రణ బాధ్యతలను నోడల్ బ్యాంకుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అప్పగించారు. దీని పరిమితి రోజుకు 2లక్షల వరకు మాత్రమే చెక్కులను ముద్రించగలదు. ఇప్పుడు ముద్రణ ప్రక్రియ మొదలుపెడితేనే ఏప్రిల్ చివరి వరకు చెక్కులన్నీ అందుబాటులోకి వస్తాయి. అయితే ప్రభుత్వం చెక్కులపై పేరుతో పాటు పట్టాదారు యూనిక్ కోడ్ నెంబర్‌ను కూడా ముద్రించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే పూర్తిగా ఎన్ని చెక్కులు అవసరమో, పట్టాదారులకు సంబంధించిన కోడ్ నెంబర్లను ఇవ్వాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్‌ను వ్యవసాయ శాఖ కోరింది. ముందుగా భూప్రక్షాళనలో తేలిన వివరాల ఆధారంగా 1.42 కోట్ల ఎకరాలకు పెట్టుబడి ఇవ్వాలని ప్రతిపాదించగా, తరువాత 20లక్షల ఎకరాలు అసైన్డ్ భూమిని కూడా పెట్టుబడికి అర్హత కల్పించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ బడ్జెట్‌లో మొత్తం 1.62 కోట్ల ఎకరాలకు రూ. 6480 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అసైన్డ్ భూములకు పెట్టుబడి సొమ్ము అందించే విషయమై ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. అసైన్డ్ భూములకు సంబంధించి పత్రాలపై పేరు ఉండటమే కాకుండా, వారే భూమిని సాగు చేస్తూ ఉండాలి. అలా అయితేనే ఎకరాకు రూ.4 వేలు అందజేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక సాగుకు యోగ్యం కాని భూములను తేల్చే పనిలో వ్యవసాయ శాఖ నిమగ్నమైంది. ప్రభుత్వం నుంచి అందిన ఆదేశాలకను అగుణంగా వ్యవసాయ విస్తరణ అధికారు(ఎఇఒ)లు, రెవెన్యూ అధికారుల సహకారంతో రాళ్లు, రప్పలు, గుట్టలు ఉన్న భూములను గుర్తిస్తున్నారు. వీటి లెక్క తేల్చాక ఏయే భూములకు పెట్టుబడి సొమ్ము అందుతుందనే దానిపై స్పష్టత రానుంది.



వృత్తి, విద్యా కోర్సులన్నింటికీ ఇంటర్న్‌షిప్

- ప్రణాళికలు సిద్ధం చేస్తున్న ఉన్నత విద్యా మండలి

మన తెలంగాణ/హైదరాబాద్: ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ఉన్న ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం భవిష్యత్తులో అన్ని వృత్తి విద్యా కోర్సులకు తప్పనిసరి కానుంది. ఉన్నత విద్యలో తీసుకురానున్న సంస్కరణల్లో భాగంగా ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరిగా చేయాలని ఉన్నత విద్యామండలి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసుకున్న చాలామంది యువతకు తగిన నైపుణ్యాలు, మెళకువలు లేకపోవడంతో పరిశ్రమల్లో ఉద్యోగాలు పొందలేని పరిస్థితి నెలకొంటోంది. దీన్ని చక్కదిద్దడంలో భాగంగా ఇంటర్న్‌షిప్ దిశగా ఆలోచనలు జరుగుతున్నాయి. కోర్సులో భాగంగానే ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంను విద్యార్థులకు అందించినట్లయితే కోర్సు పూర్తిచేసుకుని బైటకు వచ్చేటప్పటికి సంబంధిత పరిశ్రమలు, కార్యాలయాల్లో పనిచేయడానికి తగిన అవకాశాలు ఉంటాయని భావిస్తోంది. అకడమిక్ నైపుణ్యాలతో పాటు పని అనుభవం ఉన్న వారికి బడా కార్పొరేట్ కంపెనీలు రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతుండడంతో ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశాలు ఉంటాయని ఉన్నత విద్యామండలి అభిప్రాయపడుతోంది. తరగతి గది చదువుతో పాటు ప్రాక్టికల్స్‌కు పెద్దపీట వేయాలని నిర్ణయించారు.

డమ్మీ రికార్డులకు చెల్లుచీటి

ఇంజినీరింగ్ విద్యార్థులు కోర్సులో భాగంగా ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో పేరున్న కళాశాలలు మాత్రమే విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ చేయిస్తుండగా, మిగతా వాటిల్లో డమ్మీ ఇంటర్న్‌షిప్‌లు కొనసాగుతున్నాయి. విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేసినట్లు రికార్డుల్లో ఉంటున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. ఇక నుంచి ఈ విధానంలో మార్పు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఏడాది సుమారు 15వేల మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కల్పించేందుకు ఉన్నత విద్యామండలి ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం పరిశ్రమలు, కళాశాలలతో సంప్రదింపులు జరుపుతోంది.

ప్రభుత్వ శాఖల్లోనూ అమలు..

ప్రభుత్వ విభాగాలలోనూ విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేసేలా ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐటి శాఖలో గత ఏడాది పలు వృత్తి విద్యా కళాశాలలకు చెందిన 45 మంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అందించారు. ఈ ఏడాది కూడా వివిధ శాఖల అధికారులు అ లాంటి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో ప్రభుత్వ విభాగాలలో ఎవరికైనా ఎరోనాటికల్, అగ్రికల్చర ల్, అటోమొబైల్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజి, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూని కేషన్స్, ఫ్యాషన్ టెక్నాలజీ, ఐటి, మైనింగ్, పెట్రోలియం, ఫార్మాస్యూటికల్, ప్రొడక్షన్ ఇంజినీరింగ్ విభాగాలలో ఏప్రిల్/మే 2018లో 23 నెలల ఇంటర్న్‌షిప్ అవసరమైతే తమకు తెలియజేయాలని ఐటి శాఖ కార్యదర్శి జయేష్ రంజన్ మిగతా శాఖలకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ ఏడాది వివిధ ప్రభుత్వ శాఖలలో కొంతమంది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించే అవకాశాలు ఉన్నాయి.

రైతు సమితుల ఏర్పాటు త్వరగా పూర్తయ్యేలా చూడండి

- కలెక్టర్లకు వ్యవసాయ ముఖ్య కార్యదర్శి పార్థసారథి లేఖ



మన తెలంగాణ/హైదరాబాద్: జిల్లా రైతు సమన్వయ సమితులను ఈ నెల 15వ తేదీ వరకు పూర్తయ్యేలా చూడాలని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సి. పార్థసారథి కోరారు. ఈ మేరకు ఆయన జిల్లా కలెక్టర్లకు లేఖ రాశారు. మండల రైతు సమితుల నుంచి మంత్రులు ఎంపిక చేసిన సభ్యులను కలెక్టర్లు ఆమోదించి, రాష్ట్ర వ్యవసాయ శాఖకు పంపాల్సి ఉంది. కనుక కలెక్టర్లు చొరవ తీసుకుని మంత్రులతో మాట్లాడి జిల్లా రైతు సమితుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని లేఖలో పేర్కొన్నారు. జిల్లా రైతు సమన్వయ సమితిలో 24 మంది సభ్యులు ఉండనున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు నాలుగు జిల్లాలకు సంబంధించిన జిల్లా రైతు సమితులు పూర్తయినట్లు తెలిసింది.

ఉపాధ్యాయ సంఘాల సమావేశం రసాభసా.. 15కు వాయిదా

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రభుత్వ స్కూళ్లలో సమస్యలు, అకడమిక్ క్యాలెండర్, రేషనలైజేషన్ తదితర సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ నిర్వహించిన సమావేశం రసాభసాగా మారి ఈ నెల 15కు వాయిదా పడింది. ఉపాధ్యాయులు పాఠశాలలకు సరిగ్గా హాజరు కావడం లేదంటూ పత్రికల్లో ప్రచురితమైన కథనాన్ని కమిషనర్ సమావేశంలో చూపించడంతో ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆగ్రహించి ఆయనతో వాగ్వాదానికి దిగారు. అధికారులపై పత్రికల్లో వచ్చిన కథనాలను సైతం చూపించాల్సి వస్తుందని నాయకులు వాదనకు దిగారు. ఎజెండాలోని అంశాలను పక్కనబెట్టి పత్రికల్లోని వార్తల అంశాన్ని చర్చకు తీసుకువచ్చి నిందించడం సరికాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై చర్చించేందుకు ఎక్కువ సమయం కావాలని అడగడంతో ఈ నెల 15న మధ్యాహ్నం 12 గంటలకు ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించాలని కమిషనర్ నిర్ణయించారు.

పిలిచి అవమానించడం సరికాదు

అకడమిక్ క్యాలెండర్, విద్యారంగ సమస్యలపై చర్చిద్దాం అని ఉపాధ్యా య సంఘాలను ఆహ్వానించి పత్రి కల్లో వచ్చిన కథనాలను చూపించి టీచర్లను బడిదొంగలుగా కమిషనర్ చిత్రీకరించే ప్రయత్నం చేసి అవ మానించారని ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమి తి(జాక్టో) పేర్కొంది. సమావేశంలోనే కమిషనర్ తానే ఉపాధ్యాయులపై తప్పుడు ప్రచారానికి దిగ డం సరికాదని తెలిపింది.

ఆంక్షలతో అతలాకుతలం!

- నిధులున్నా స్థానిక సంస్థలు పనులు చేయలేని దుస్థితి
- ఐదు నెలలుగా ఇదే పరిస్థితి
- ఖజానాలోనే మూలుగుతున్న రూ.362.97కోట్లు

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో దాదాపు మూడేళ్లుగా స్థానిక సంస్థలు నిధుల్లేక అతలాకుతలమవుతున్నాయి. జిల్లా, మండల పరిషత్తుల పరిస్థితి మరీ దయనీయం. ఇలాంటి పరిస్థితుల్లో రాకరాక నిధులొచ్చాయి. ఇక పనులు చేసుకోవచ్చని ఆశపడ్డ స్థానిక సంస్థల ఆశలను సర్కారు అడియాసలు చేసింది. వాటిని తీసుకోకుండా ఖజానాపై ఆంక్షలు విధించింది. క్వారీలు, గనులు, ఇసుక వంటి వాటికి సంబంధించి గనుల శాఖ నుంచి సీనరేజి పన్ను విడుదలవుతుంది. వీటితో పాటు రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి వసూలు చేసే రిజిస్ట్రేషన్ పన్ను కూడా కొంత స్థానిక సంస్థలకు వస్తుంది. దీనినే టిడి పన్ను అంటారు. ఈ పన్ను గత మూడేళ్లుగా విడుదల కావడం లేదు. ఎట్టకేలకు గతేడాది అక్టోబర్‌లో రాష్ట్రంలోని తొమ్మిది జిల్లా పరిషత్‌లకు రూ.362,97,48,595 వచ్చాయి. ప్రభుత్వం ఈ నిధులను 20శాతం జిల్లా పరిషత్‌లకు, 20శాతం మండల పరిషత్‌లకు, 60శాతం గ్రామ పంచాయతీలకు విడుదల చేసింది. నిధులు రావడంతో కొంత మేర అభివృద్ధి పనులు చేయాలని భావించారు. కొన్ని పనులకు అనుమతులు తీసుకుని వాటిని కాంట్రాక్టర్లకు అప్పగించేలోపే ట్రెజరీ నుంచి తీసుకోకుండా ఆంక్షలు విధించారు. దీంతో పనులు చేపట్టే ప్రక్రియ ఆగిపోయింది. పాత జిల్లాల వారీగా మహబూబ్‌నగర్ జిల్లాకు రూ.30,49,26,848, రంగారెడ్డి జిల్లాకు రూ.183,21,19,487, మెదక్ రూ. 53,38,60,540, నిజామాబాద్ రూ.11,64,60,540, ఆదిలాబాద్ రూ.9,57,01,191, కరీంనగర్‌కు రూ.18,14,46,520, వరంగల్‌కు రూ.10,34,26,825, నల్గొండ రూ.37,99,83,644, ఖమ్మం రూ.8,18,23,495 విడుదలయ్యాయి. వీటిలో సింహభాగం గ్రామ పంచాయతీలకు అంటే గ్రామస్థాయిలో అభివృద్ధికి కేటాయించే నిధులు. రాష్ట్ర వ్యాప్తంగా పరిశీలిస్తే గ్రామ పంచాయతీలకు రూ.217,80,23,629 వచ్చాయి. జిల్లా పరిషత్‌లకు రూ.75,58,62,483 మండల పరిషత్‌లకు రూ.75,58,62,483 వచ్చాయి. వీటిని ఉపయోగించుకునే వీల్లేక పనులు చేయలేకపోతుండడంతో గ్రామాభివృద్ధికి అవరోధం ఏర్పడింది.

అపోహలు వీడి అర్థం చేసుకోండి

- ప్రొఫెషనల్స్ తప్పుగా అర్థం చేసుకోవడం వల్లే 2014లో ఓడాం
- పిసిసి చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్: 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేంద్రం, రాష్ట్రంలో ఓడిపోవడానికి ప్రొఫెషనల్స్ తప్పుగా అర్థం చేసుకోవడం ముఖ్య కారణమని, అయితే నాటి ప్రభుత్వంపై వచ్చిన కుంభకోణం, అవినీతి ఆరోపణలన్నీ తప్పుడువని కోర్టులు తేల్చేశాయని టిపిసిసి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాబట్టి అపోహలను వీడాలని, లౌకికవాద, ఉదారమైన ఆలోచనలు కలిగిన, హక్కులను రక్షించే పార్టీ కాంగ్రెస్ అని అర్థం చేసుకోవాలన్నారు. ప్రధాని మోడీ, సిఎం కెసిఆర్ హయాంలో సాగుతున్న మానవహక్కులు, ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనలపై ప్రొఫెషనల్స్ మౌనంగా ఉండరాదని, అలా ఉంటే వారిని సమర్థించినట్లే అవుతుందన్నారు. ఆలిండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్(ఎఐపిసి) తెలంగాణ చాప్టర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎఐపిసి దక్షిణ భారత కో ఆర్డినేటర్ డాక్టర్ జె.గీతారెడ్డి, ప్రతిపక్ష నాయకులు కుందూరు జానారెడ్డి, తెలంగాణ చాప్టర్ చైర్మన్ డాక్టర్ దాసోజు శ్రవణ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మోడీ, కెసిఆర్‌లు చరిత్రను వక్రీకరిస్తున్నారని అన్నారు. దేశం కోసం 12 ఏళ్ళు జైళ్ళో మగ్గిన నెహ్రూ గురించి పార్లమెంటులో తప్పుడుగా మట్లాడారని, మంచి సంబంధాలు కలిగిన నెహ్రూ, పటేల్, బోస్‌ల మధ్య ఏదో తేడాలు ఉన్నాయనే భ్రమలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నిన్న మొన్న పుట్టిన, గతి తప్పిన కుర్రాడు కెటిఆర్ కూడా గాంధీ–నెహ్రూ కుటుంబం గురించి మాట్లాడుతున్నారని అన్నారు. తెలంగాణలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, శాసన సభను ప్రచార వేదికగా మార్చేశారని, అధికారంలో ఉన్నవారికి కార్య నిర్వహణ అంగం లొంగి పోయిందని, మీడియా వాస్తవాలు చెప్పడం లేదన్నారు. అటు మోడీ అధికారంలోకి వచ్చాక ఫలానది తొనద్దని హత్యలు చేసే వరకు వెళ్ళిందన్నారు. ఈ నేపథ్యంలో మోడీ, కెసిఆర్‌లు రాజ్యాంగ పదవుల్లో ఎందుకు ఉండకూడదో ప్రజలకు ప్రొఫెషనల్స్ వివరించాలన్నారు. సిఎం కెసిఆర్ మాటల మనిషే తప్ప చేతల మనిషి కాదని, హుస్సేన్ సాగర్‌ను ప్రక్షాళన చేసి, కొబ్బరినీళ్లలా మారుస్తానన్నాడని, ఎన్‌టిఆర్ స్టేడియంలో అంతర్జాతీయ స్థాయి కల్చరల్ సెంటర్ కడతానన్నాడని, స్కైవేలు, స్కై స్క్రాపర్‌లు అంటూ మాటలు చెప్పాడని, ఒక్కటైనా చేశాడా? అని ప్రశ్నించారు. నాటి కెసిఆర్ మాటల వీడియోలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలని సూచించారు. ప్రొఫెషనల్ కాంగ్రెస్ సభ్యులు కాంగ్రెస్ మ్యానిఫెస్టోకు సూచనలు, సలహాలు ఇవ్వాలని, రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తప్పకుండా వాటిని అమలు చేస్తామన్నారు. త్వరలో రాష్ట్రానికి రానున్న రాహుల్‌గాంధీతో ప్రొఫెషనల్ కాంగ్రెస్ సభ్యుల భేటీ ఏర్పాటు చేస్తానని తెలిపారు. జానారెడ్డి మాట్లాడుతూ తాను ఉపాధ్యయ వృత్తి నుండి సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని, అనుకున్నవి కొన్ని చేయగలిగానని, కొన్ని చేయలేదని చెప్పారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి పైలెట్‌గా పని చేసి రాజకీయాల్లోకి వచ్చాడని, యుద్ధ విమానాలు నడపడం సులువేకాని, రాజకీయాలు చాలా కష్టమని, అయినా ముందుకు సాగుతున్నారని అన్నారు. గీతారెడ్డి మాట్లాడుతూ 31 సంవత్సరాల క్రితం రాజీవ్‌గాంధీ కోరిక మేరకు వైద్య వృత్తిలో నిమగ్నమైన తాను రాజకీయాల్లోకి ప్రవేశించానని, ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నా నిలబడ్డానని చెప్పారు. ప్రొఫెషనల్ కాంగ్రెస్ సభ్యుల్లో కేరళ తరువాత తెలంగాణే రెండవ స్థానంలో ఉందని, చాప్టర్‌ల విషయంలో మొదటి స్థానంలో ఉన్నామన్నారు. దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కూడా ప్రొఫెషనల్స్ కీలక పాత్ర పోషించారని, ప్రొఫెసర్ జయశంకర్, అనేక మంది లాయర్‌లు, జర్నలిస్టులు క్రియాశీలకంగా వ్యవహరించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ చాప్టర్‌ల చైర్మన్లు కళ్యాణ్ బాలాజీ, సంతోష్, ఇర్ఫాన్ అజీజ్, అమేర్ జావెద్, డాక్టర్ సలూజా, నఫీసా అలీ తదితరులు పాల్గొన్నారు.



Dwaraka (Everyday NewsPapers)



కంది రైతులను ఆదుకోవాలి : కేంద్రానికి హరీశ్ లేఖ

మన తెలంగాణ/హైదరాబాద్: కంది రైతులను ఆదుకోవాలని మార్కెటింగ్ శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర పౌర సరఫరాల శాఖ మంత్రి రామ్ విలాస్ పాశ్వా న్‌కు శనివారం లేఖ రాశారు. ఈ సీజన్‌లో 2 లక్షల 84వేల మెట్రిక్ టన్నులకు పైగా కందుల దిగుబడి రానుందని, కేంద్రం కేవలం 75వేల మెట్రిక్ టన్నులు కొనేందుకు మాత్రమే అంగీకరించడం పట్ల తీవ్ర అసంతృప్తిని ప్రకటించారు. కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలని, కంది రైతులను ఆదుకునే చర్యలు చేప ట్టాలని కోరారు. కనీసం మరో లక్ష మెట్రిక్ టన్నుల కందులను ధరల స్థిరీకరణ నిధి పథకం కింద కొనుగోలు చేయాలన్నారు. కంది రైతులు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తున్నదని ఇదే పరిస్థితి కొనసాగితే పంట సాగుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. పప్పుధాన్యాల ఉత్పత్తి తగ్గిపోయి ద్రవ్యోల్బణం ఏర్పడుతుందని మార్కెటింగ్ మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పప్పు ధాన్యాలు దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని మంత్రి అన్నారు. దీంతో ధరలు పెరిగి సామాన్య వినియోగదారులపై భారం పడుతుందని, వారి దృష్ట్యా కొనుగోళ్లు చేపట్టాలని రామ్ విలాస్ పాశ్వాన్‌కు రాసిన లేఖలో మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు.

మురికివాడల్లేని గ్రేటర్

నగరంలో లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి తీరుతాం

- ఐటి, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్
- కంటోన్మెంట్ నియోజకవర్గంలో 'డబుల్' నిర్మాణాలకు శంకుస్థాపన



మన తెలంగాణ/కంటోన్మెంట్: హైదరాబాద్‌ను మురికివాడల్లేని నగరంగా తీర్చిదిద్దుతామని ఐటి, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తూ మోడల్ కాలనీలను నిర్మిస్తుందన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మడ్‌ఫోర్ట్ శ్రీరామ్‌నగర్, గాంధీనగర్, మోండా మార్కెట్ డివిజన్‌లోని వెస్ట్ మారేడుపల్లిలో ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులకు శనివారం ఆయన ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంపి మల్లారెడ్డి, ఎంఎల్‌ఎ సాయన్నతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా వేదికల్లో మంత్రి కెటిఆర్ మాట్లాడారు. పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చి, ఆడపిల్లలకు పెళ్లి ఖర్చు ఇచ్చే ముఖ్యమంత్రి ఒక కెసిఆర్ తప్ప దేశంలో మరెవ్వరూ లేరని కొనియాడారు. రాష్ట్రంలో 2లక్షల 70వేల ఇళ్లు, నగరంలో 1 లక్ష ఇళ్లు నిర్మాణం చేస్తామన్నారు. ఒక ఇళ్లు నిర్మించాడానికి ప్రభుత్వం రూ.8 లక్షల 70 వేలు ఖర్చు చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 18 వేల కోట్లతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. కంటోన్మెంట్‌లోనూ కేంద్ర, రక్షణ శాఖ స్థలాల్లో నివాసం ఉంటున్న వారికి కేంద్రంతో మాట్లాడి భూ మార్పిడి చట్టం కింద ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కంటోన్మెంట్‌లో ట్రాఫిక్ సమస్య, బొల్లారం ఆసుపత్రి విషయంపై కేంద్ర రక్షణ శాఖ మంత్రితో మాటాడినట్లు వివరించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ మారేడుపల్లిలో హౌసింగ్ బోర్డు స్థలంలో ఎన్నో ఏళ్ల నుంచి నివాసం ఉంటున్న వారికి ఇళ్లు నిర్మించి, మోడల్ కాలనీగా తీర్చిదిద్దాలని



సిఎం కెసిఆర్‌ను కోరినట్లు చెప్పారు. అంతకుముందు ఉప ముఖ్యమంత్రి మహ్మముద్ అలీ, హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎంపి మల్లారెడ్డి మాట్లాడారు. ఎంఎల్‌ఎ సాయన్న మాట్లాడుతూ గాంధీనగర్, శ్రీరామ్ నగర్, మారేడుపల్లి, సిల్వర్ కంపెనీ బస్తీ ప్రాంతాల్లో 1500 ఇండ్ల నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. 'ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, సికింద్రాబాద్ ఆర్‌డిఒ చంద్రకళ తదితరులున్నారు.

రాష్ట్రంలో కొత్త ఉత్పత్తి కర్మాగారం

- దేశంలోనే తొలిసారి భవన నిర్మాణాల ఉత్పత్తుల ప్లాంట్



మన తెలంగాణ/హైదరాబాద్: దేశంలోనే తొలిసారిగా భవన నిర్మాణాల రంగానికి అవసరమైన ఉపకరణాల తయారీ సంస్థ రాష్ట్రంలో వస్తోందని దీని ద్వారా సుమారు పదివేల ఉద్యోగావకాశాలు లభిస్తాయని మంత్రి కెటిఆర్ తెలిపారు. కెఇఎఫ్ ఇన్‌ఫ్రా, కెఇఎఫ్ హోల్డింగ్స్ గ్రూపు సంస్థ సుమారు 600 కోట్ల మేర పెట్టుబడులు పెట్టడానికి సంసిద్ధత వ్యక్తం చేసిందని, హైదరాబాద్ నగరంతో పాటు మరో నాలుగు ప్రాంతాల్లో ఈ పార్కును నెలకొల్పడంపై ఆలోచిస్తున్నామని తెలిపారు. ఆ సంస్థ ప్రతినిధులతో చర్చలు జరిపిన అనంతరం సంయుక్త మీడియా సమావేశంలో మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ, కెఇఎఫ్ సంస్థతో కలిసి తెలంగాణ ప్రభుత్వం భవన నిర్మాణాల ఉపకరణాల ఉత్పత్తి పార్కును నెలకొల్పుతోందని, సుమారు 250 ఎకరాల స్థలం అవసరమవుతోందని, ప్రభుత్వం ఉచితంగా ఈ స్థలాన్ని సమకూరుస్తుందని తెలిపారు. స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి ఈ పార్కులో ఉపాధి అవకాశాలు పొందేలా చొరవ తీసుకుంటుందని పేర్కొన్నారు. కెఇఎఫ్ సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ ఫైజల్ కొట్టికొల్లన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ పారిశ్రామిక పాలసీ బాగుందన్నారు. వంద మిలియన్ డాలర్ల పెట్టుబడితో తమిళనాడులోని కృష్ణగిరిలో పారిశ్రామిక పార్కును నెలకొల్పామని, కేరళలో 500 పడకల ఆసుపత్రిని నిర్మించామని, బెంగళూరులో 175 పబ్లిక్ క్యాంటీన్లను నిర్మించామని తెలిపారు. ఇప్పుడు తెలంగాణలో భవన నిర్మాణ పరికరాల ఉత్పత్తి పార్కును నెలకొల్పాలని భావిస్తున్నామన్నారు.

ఆన్‌లైన్‌లో మద్యం బ్రాండ్ల ధరలు

- మొబైల్ యాప్ విడుదల చేసిన మంత్రి పద్మారావు



మన తెలంగాణ /హైదరాబాద్: మద్యం బ్రాండ్లు, వాటి ధరల పట్టిక, మద్యం షాపుల వివరాలు ఇక అన్నీ ఆన్‌లైన్‌లోకి వచ్చేశాయి. ఇందుకు సంబంధించిన 'లిక్కర్ ప్రైస్ మొబైల్ యాప్'ను ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు శనివారం సచివాలయంలో విడుదల చేశారు. మద్యం షాపుల సిసిటివి కవరేజ్‌ను కూడా మంత్రి ప్రారంభించారు. సుమారు 880 బ్రాండ్ల మద్యం ధరల పట్టికలు ఈ యాప్ ద్వారా తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. ప్రాంతాల వారీగా ఆయా ప్రాంతాల్లో ఎక్కువగా అమ్ముడు అయ్యే 25 బ్రాండ్ల మద్యం ధరలు, 5 బీర్ బ్రాండ్ల ధరలు మద్యం దుకాణాల్లో ధరల పట్టికపై ముద్రించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. గత 12 నెలల అమ్మకాలను ప్రామాణికంగా తీసుకొని వీటిని ముద్రించినట్లు మంత్రి వివరించారు. లిక్కర్ ప్రైస్ మొబైల్ యాప్‌లో తెలంగాణలో అమ్మబడే 880 లిక్కర్ బ్రాండ్ల ధరలను చూసుకోవచ్చన్నారు. లిక్కర్ సైజు వారీగా, మద్యంలో రకాలవారీగా, ధరల వారీగా తెలుసుకోవచ్చని మంత్రి తెలిపారు. ఏదైనా ఫిర్యాదు చేయాలనుకుంటే వాట్సప్ ద్వారా (7989111222), ఉచిత ఫోన్ కాల్ ద్వారా (18004252523), లిక్కర్ ప్రైస్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. 2017–19 మద్యం పాలసీ ప్రకారం ప్రతి మద్యం దుకాణం 2 సిసిటీవీ కెమెరాలను రికార్డింగ్ సదుపాయంతో సహా అమర్చుకోవాల్సి ఉంటుంది.

అర్హులైన వారందరికీ 'ఆసరా'

- ప్రభుత్వాన్ని కోరిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ

మన తెలంగాణ/హైదరాబాద్: ఆసరా పెన్షన్ పథకం సంపూర్ణంగా అమలు కావడానికి 60 ఏళ్లు ఉండి, అర్హులైన వారందరికీ ఇవ్వాలని సిపి ఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి రాష్ట్ర ప్రభు త్వాన్ని కోరారు. ఆసరా పథకం కింద పెన్షన్‌లు ఇస్తున్నప్పటికీ ఇంకా సుమారు 5లక్షల మంది 65 ఏళ్లు పైబడిన వారు వృద్ధాప్య పెన్షన్ గురించి ఎదురుచూస్తున్నారని ఆయన పేర్కొన్నారు. బయోమెట్రిక్ విధానం ద్వారా పెన్షన్ ఇవ్వడం కారణంగా కొంతమంది వృద్ధులకు వేలు ముద్రలు సరిగా లేకపోవడం తో పెన్షన్ పొందడానికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని శనివారం ఒక ప్రకటనలో చాడ వివరించారు. 'వృద్ధాప్య పెన్షన్ వస్తే జీవనోపాధికి తోడ్పడుతుందని ఆశిస్తున్నారు. అలాగే చౌక ధరల దుకాణాల్లోనూ ఇలాంటి సమస్యలు ప్రజలు ఎదుర్కొంటున్నారని, వాటిని కూడా పరిష్కరించాలని కోరారు. బోదకాలు బాధితులకు రూ.1000 పెన్షన్ ఇవ్వ డం మంచి పరిణామమన్నారు.

దేవాదాయ శాఖ బడ్జెట్ 250 కోట్లు



మన తెలంగాణ/హైదరాబాద్: రానున్న ఆర్థిక సంవత్సరానికి దేవాదాయ శాఖకు సుమారు రూ.250 కోట్లు అంచనా వ్యయంగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బడ్జెట్ ప్రతిపాదనలపై దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సచివాలయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కొత్తగా మూడు వేల ఆలయాలకు ధూప దీప నైవేద్య పథకం వర్తింపు ప్రక్రియపై జిల్లా స్థాయిలో త్వరితగతిన నివేదికలను సిద్ధం చేసి దేవాదాయ శాఖ కమిషనర్‌కు సమర్పించాలని ఆదేశించారు. మరోవైపు ఆలయాల్లో ప్రసాదాల మీద జిఎస్‌టి విధిం చడంపై సంబంధిత అధికారులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేసి, చర్చించి ఓ పరిష్కారం చూడాలన్నారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ శివశంకర్, అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు, జాయింట్ కమిషనర్ కృష్ణవేణి, ఇంచార్జ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ సత్యానారయణ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నిమ్స్‌కు పూర్తిస్థాయి ఐసియు

మన తెలంగాణ/హైదరాబాద్: నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)కు పూర్తిస్థాయి ఐసీయూని సమ్మే అగర్వాల్ సమాజ్ సహాయత సేవా ట్రస్ట్ బహుమానంగా అందిస్తోంది. రూ.60 లక్షలు విలువ చేసే ఈ ఐసియు కేర్ యూనిట్‌లో 5 వెంటిలేటర్లు, 7 మానిటర్లు, 6 వీల్ చైర్లు, 2 ట్రాలీలు, వెయిటింగ్ రూమ్ వద్ద స్టీల్ సోఫా సెట్లతో పాటు 2 ఎల్‌ఈడీ టీవీలను కూడా అందిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. గతంలో ఈ ట్రస్టు గాంధీ ఆసుపత్రికి డయాలసిస్ కేంద్రాన్ని అందించింది. వచ్చే ఏడాది ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి మొబైల్ యూనిట్‌ను అందించాలని యోచిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు చెప్పారు. ఈ ఐసీయు కేంద్రాన్ని ఆదివారం ఉదయం పది గంటలకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సి..లక్ష్మారెడ్డి ప్రారంభించనున్నారు. వ్యాపారంతో పాటు సేవాలోనూ ముందున్నామని నిరూపిస్తూ ట్రస్ట్ వైద్య రంగంలో విశేష సేవలను అందిస్తుందని ట్రస్టు ప్రతినిధి రాజేష్ అగర్వాల్ వెల్లడించారు. తమ ట్రస్టు అందించే సేవలకు మంత్రి లక్ష్మారెడ్డి సహకారం ఎంతో ఉందన్నారు.

బినామీలకు బిగుస్తున్న ఉచ్చు!

- హెచ్‌ఎండిఎ ప్లానింగ్ డైరెక్టర్ కేసులో ఇద్దరు అరెస్టు
- మరికొందరిపై గురిపెట్టిన అధికారులు



నిందితుడు పురుషోత్తంరెడ్డి, అతడి బినామీలుగా అనుమానిస్తున్న యాదవరెడ్డి, నిశాంత్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్: ఆదాయానికి మించి ఆస్తులు పోగేసుకోవడం, లంచం తీసుకుంటూ పట్టుబడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల కేసుల్లో అవినీతి నిరోధక శాఖ వారి బినామీలపైనా దృష్టి సారించింది. పలు కేసుల ఆధారంగా ఈ విషయం స్పష్టమవడంతో ఆ దిశగా కేసులను దర్యాప్తు చేసేందుకు సిద్ధమవుతోంది. హెచ్‌ఎండిఎ ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి కేసులోనూ అతడికి సంబంధించిన 90శాతం ఆస్తులు బినామీల పేర్ల పైనే ఉన్నట్లు తేలింది. పురుషోత్తంరెడ్డి ఇళ్లపై ఏక కాలంలో దాడిచేసిన ఎసిబి అధికారులకు రూ.5 కోట్ల ఆస్తులు మాత్రమే లభించడంతో అతని బినామీలపై నిఘా పెట్టారు. బంధువుల పేర్లపైనా, బినామీ పేర్లతోనూ ఉన్న కోట్లాది రూపాయల ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయి అనే అంశాలపై ఆరా తీస్తున్నారు. హబ్సిగూడకు చెందిన శ్రీసాయి హరిహర ఎస్టేట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్‌గా ఉన్న ఎ.యాదవరెడ్డి, గండిపేటకు చెందిన జి. నిశాంత్‌రెడ్డి పురుషోత్తంరెడ్డికి బినామేలేనని అంచనాకు వచ్చి వారిద్దరినీ శుక్రవారం అరెస్టు చేశారు. మరికొందరి బినామీలను కూడా వినియోగించుకున్నట్లు అనుమానిస్తున్నారు. దీంతో అవినీతి అధికారులకు సన్నిహితంగా ఉండే స్నేహితుల లిస్టును కూడా పోలీసులు బయటకు తీస్తున్నారు. వారి వ్యాపారాలు, ఉద్యోగ వివరాలు సేకరిస్తున్నారు. బినామీ ఆస్తులని తేలిన సందర్భాల్లో బినామీ చట్టం కింద అరెస్టు చేస్తున్నారు.

పురుషోత్తంరెడ్డి కేసులో ఎసిబి అధికారులు త్వరలో మరి కొందరు బినామీలను అరెస్టు చేసే అవకాశాలున్నట్లు సమాచారం. కాగా, పురుషోత్తంరెడ్డి సుమారు రూ.100 కోట్లకు పైగా అక్రమంగా సంపాదించాడని అవినీతి నిరోధక శాఖ అంచనా.

ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ రూపకల్పనకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీని రూపొందించడానికి మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఐదుగురు మంత్రులతో కూడిన ఉప సంఘాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో ఆ ఉత్పత్తులను సమర్థవంతంగా వినియోగించుకునేలా, రైతులకు కనీస మద్దతు ధర లభించేలా ఆ పాలసీలో సిఫారసులు ఉండాలని ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మంత్రులు ఈటల రాజేందర్, కెటిఆర్, హరీశ్‌రావు, జూపల్లి కృష్ణారావులు ఈ ఉప సంఘంలో సభ్యులుగా ఉంటారు. నెల రోజుల్లో నివేదికను సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలకు అనుగుణంగా ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ ఉండాలని, దాదాపు అన్ని పంటల ఉత్పత్తులకు కనీస మద్దతు ధర లభించేలా చూడాలని, ప్రతి గ్రామీణ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఒక ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఉండేలా వంద నియోజకవర్గాలకు ప్రణాళిక రూపొందించాలని, సాగునీటిని సమర్థవంతంగా వినియోగించుకుని విస్తృతంగా ఈ పంటలను రైతులు సాగుచేసేలా విభిన్న సేద్యపు విధానాలను రూపొందించాలని, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఎక్కడెక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను నెలకొల్పాలో సిఫారసు చేయాలని, వివిధ పంటలకు, వాటి నుంచి ఉత్పత్తి చేసే ప్రాసెసింగ్ ఉత్పత్తులకు తగిన మార్కెటింగ్ సౌకర్యం కల్పించడానికి అవలంబించాల్సిన పద్ధతులను పేర్కొనాలని కొన్ని సూచనలను ప్రభుత్వం ఈ ఉప సంఘానికి స్పష్టం చేసింది. నెల రోజుల వ్యవధిలో ఈ సంఘం సమర్పించే నివేదిక ప్రకారం పాలసీని రూపొందిస్తుంది.

సచివాలయం సాక్షిగా..





సచివాలయం మీదుగా ఐమాక్స్ వెళ్లే ప్రధాన రహదారిలో ఎదురుగా ఓ నిర్మాణ సంస్థ భూగర్భ పైప్‌లైన్ కోసం రోడ్డు మధ్యలో 20 అడుగుల లోతు గల మ్యాన్‌హోల్ నిర్మాణం చేపట్టింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై కనీసం ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. నామమాత్రంగా బారికేడ్లు పెట్టి చేతులు దులుపుకుంది. గురువారం సాయంత్రం అటుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ ప్రయాణికుడు ప్రమాదవశాత్తూ వాహనంతో సహా మ్యాన్‌హోల్ పడిపోయాడు. దీంతో అటుగా వెళ్తున్న వాహనదారులు వెంటనే మ్యాన్‌హోల్ నుంచి యువకుడిని బయటకు తీసి కాపాడారు. శనివారం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది.

– మన తెలంగాణ/సిటీబ్యూరో

చెల్లెలు కవితకు హృదయపూర్వక కృతజ్ఞతలు

- జనసేనాని పవన్ ట్వీట్

మన తెలంగాణ/హైదరాబాద్: టిఆర్‌ఎస్ ఎంపి కల్వకుంట్ల కవితకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ట్విట్టర్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మద్దతుగా నిలిచినందుకు ధన్యవాదాలంటూ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఏపికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లోక్‌సభలో మద్దతు తెలిపిన టిఆర్‌ఎస్ ఎంపి, చెల్లెలు కవిత గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు' అంటూ జనసేనాని పవన్ ట్వీట్ చేశారు.

పిడబ్ల్యూసిఎస్‌కు పర్సన్ ఇన్‌చార్జీలు

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు (పిడబ్ల్యుసిఎస్) ప్రభుత్వం పర్సన్ ఇన్‌ఛార్జీలను నియమించింది. ఈ మేరకు వ్యవసాయ, సహకారశాఖ ముఖ్యకార్యదర్శి సి. పార్థసారథి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాలక వర్గాలకే 6 నెలల పాటు పర్సన్ ఇన్‌ఛార్జీలుగా కొనసాగుతారని పేర్కొంది. రాష్ట్రంలో మొత్తం 350 పిడబ్ల్యుసిఎస్‌లు ఉన్నాయి. వీటి పాలకవర్గాల పదవీ కాలం ఈ నెల 10తో ముగియనుంది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చేనేత గణన కొనసాగుతున్నందున ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహణ కష్టమని నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

చేప తక్కువ తిండి

మన తెలంగాణ/హైదరాబాద్ : చేపలు అనగానే కొవ్వు ఉండదని, ఆరోగ్యానికి మంచిదని ఇష్టంగా తినేవాళ్లు ఉన్నారు. వామ్మో ముళ్లు అంటూ తినకుండా ఉండేవారూ ఉన్నారు. అయితే మన రాష్ట్రంలోని జనాభా అవసరాలకు సరిపడా చేపలు ఉత్పత్తి కాకపోవడంతో పాటు జాతీయ సగటుతో పోలిస్తే వినియోగం కూడా తక్కువగానే ఉంది. అందులో సగటున ప్రతి మనిషి చేపలను తినాల్సినంత మోతాదులో తినడం లేదు. రాష్ట్ర మత్స్యశాఖ తయారు చేసిన నివేదిక ఈ విషయాలను స్పష్టం చేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం నుంచి ప్రభుత్వమే పూర్తి సబ్సిడీ మీద చేప పిల్లలను మత్స్యకారులకు పంపిణీ చేసి జలాశయాల్లో వదిలినప్పటికీ చేపల ఉత్పత్తి అంతంత మాత్రంగానే ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) ప్రకారం ప్రతి వ్యక్తి ఏడాదికి 13 కిలోల చేపలు తినాల్సి ఉంది. ఆ ప్రకారం ఏడాదికి 2.50 లక్షల టన్నుల చేపలు రాష్ట్రానికి అవసరమౌతాయి. కానీ మన రాష్ట్రంలో 3 కోట్ల మంది ఏడాదికి సగటున ఒక్కొక్కరు 6.21 కిలోల చొప్పున తింటున్నట్లు అంచనా. కానీ రాష్ట్రంలో తలసరి లభ్యత మాత్రం 5.21 కిలోలుగానే ఉన్నట్లు తేలింది. మన రాష్ట్రంలో 2016–17లో 1.98 లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే నమోదైంది. గడిచిన రెండేళ్ల వివరాలు పరిశీలిస్తే ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేసినప్పటికీ ఉత్పత్తి అంతంత మాత్రంగానే ఉంది. జాతీయ స్థాయిలో సగటున ఏడాదికి ఒక్క వ్యక్తి 9కిలోల చేపలు తింటున్నారని,



ముళ్లు తీసే పరిజ్ఞానమేదీ?

చేపల ధరలు ఎక్కువగా ఉండటం, ముళ్లు తీసే పరిజ్ఞానం లేకపోవడం, విక్రయదారులు పరిశుభ్రత పాటించకపోవడంతో వినియోగదారులు ఆసక్తి చూపడం లేదు. బాయిలర్ కోళ్లు కొనేందుకు వీధివీధినా దుకాణాలుండగా చేపలకు మాత్రం రాష్ట్రంలో కేవలం 33మార్కెట్లే ఉన్నాయి. వినియోగం తగ్గడానికి ఇది కూడా ఒక కారణమని అధికారులు చెబుతున్నారు. ఔత్సాహిక యువకులు చేపల వ్యాపారం చేయాలనుకున్నా అవసరమైన రిఫ్రిజిరేటర్లు, సరఫరా వ్యవస్థ లేదు. సబ్సిడీ ఇచ్చే పరిస్థితి లేనేలేదు.

పైగా ముళ్లు తీసి విక్ర యించే పరిజ్ఞానం రాష్ట్రంలో ఇంకా అందుబాటులోకి రాలేదు. ఇటీవల కొచ్చిన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ సంస్థ చేప ముళ్లు లేకుండా ముక్కలు చేసే యంత్రాన్ని తీసు కొచ్చింది. ప్రయోగాత్మకంగా పరిక్షీంచేందుకు ఆ యంత్రం ఒకటి కొనుగోలు చేయాలని మత్స్యశాఖ భావిస్తోంది.


సమస్యలను విస్మరించిన అధికార పక్షం, ప్రతిపక్షం



మన తెలంగాణ/ హైదరాబాద్: రాష్ట్రంలో అధికార టిఆర్‌ఎస్, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ప్రజా సమస్యలను విస్మరించి తమ బాధ్యతలను మరచి అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. ఎన్‌టిఆర్ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, టిఆర్‌ఎస్ తిట్ల పురాణం మానాలన్నారు. విభజన చట్టంలో రాష్ట్రానికి రావాల్సిన వాటిలో ఏమేమి సాధించామో, వాటిలో కాంగ్రెస్, టిఆర్‌ఎస్‌ల పాత్ర ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

Dwaraka (Everyday NewsPapers)

"ఇప్పుడు ఈ క్షణంలో చేయాల్సిన మంచి పని చెయ్యి. వాయిదా వేయకు.
– కబీర్"



ఎన్నో మెట్లు ఎక్కాలి!

సంపాదకీయం

నీతి ఆయోగ్ రూపొందించిన ఆరోగ్యసూచీలో 21 పెద్ద రాష్ట్రాల్లో తెలంగాణ రాష్ట్రం 12వ స్థానంలో ఉండటం ప్రజారోగ్య రంగంలో చేయాల్సింది ఎంతో ఉందని విదితం చేస్తున్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండూ ఎంతోకొంత మెరుగుదల సాధించిన రాష్ట్రాల కేటగిరీలో ఉన్నప్పటికీ వ్యత్యాసం హెచ్చుగా ఉంది. ఆరోగ్యసూచీల్లో మెరుగుదల క్రితం సంవత్సరంతో పోల్చినపుడు ఆంధ్రప్రదేశ్‌లో 2.41యూనిట్లు కాగా, తెలంగాణ మెరుగుదల 0.45 శాతమే. నిధుల విడుదలలో తెలంగాణలో పరిస్థితి దారుణంగా ఉన్నట్లు నివేదిక కనుగొన్నది. రాష్ట్ర ట్రెజరీ నుంచి రాష్ట్ర ఆరోగ్య సొసైటీలకు నిధులు బదిలీ కావటానికి పడుతున్న కాలం 70 నుంచి 287 రోజులకు పెరిగింది. బడ్జెట్ నిధుల విడుదలలో జాప్యమే ఇందుకు ప్రధాన కారణం కావచ్చు. జిల్లా ఆసుపత్రుల ఆధునికీకరణకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నప్పటికీ వసతులు, సిబ్బంది కొరత వంటి సమస్యలు వెంటాడుతున్నాయి. నీతి ఆయోగ్ సూచీలో కేరళ, పంజాబ్, తమిళనాడు అగ్రస్థానంలో ఉండగా రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ చివరి రెండు స్థానాల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ 7, తెలంగాణ 12 స్థానాల్లో ఉన్నాయి. 2015–16 సంవత్సరంలో పనితీరు ఆధారంగా ర్యాంకులు ఇవ్వటం జరిగింది.

ఆరోగ్యరంగంలో దేశం పనితీరును అవగాహన చేసుకునేందుకు, మెరుగుదలకు తోడ్పడే నిమిత్తం నీతి ఆయోగ్ 2014–15 నుంచి కొన్ని సూచికలు ప్రాతిపదికగా "ఆరోగ్యవంతమైన రాష్ట్రాలు– పురోగమిస్తున్న భారత్" పేరుతో నివేదిక రూపొందిస్తున్నది. రాష్ట్రాల పనితీరు అంచనాకు గాను మూడు కేటగిరీలు నిర్ణయించింది. ఒకటి, శిశుమరణాల రేటు, ఐదు సంవత్సరాలలోపు మరణాల రేటు, లింగ దామాషా. రెండు, నిర్వహణ తీరు–టీకాలు వేయటం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల సొంత ఖర్చు, ఆసుపత్రుల్లో ప్రసవాల దామాషా. మూడు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది ఖాళీలు, 24X7పని చేసే ఆరోగ్యకేంద్రాల దామాషా.

ప్రజారోగ్య సంరక్షణకై తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు ప్రారంభించింది. ఫలితాలు రావటానికి మరికొంత కాలం పట్టవచ్చు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవల మెరుగుదల గూర్చి ప్రజలను చైతన్యపరచటం కూడా అవసరం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించే నిమిత్తం ప్రవేశపెట్టిన కెసిఆర్ కిట్ సత్ఫలితాలిస్తున్నది. ప్రభుత్వ సేవల వల్ల శిశుమరణాల రేటు 25నుంచి 23కు, ఐదేళ్ల వయస్సులోపు మరణాల రేటు 37నుంచి 34కు మెరుగైంది. అయితే రాష్ట్రంలో వ్యాధి నిరోధక టీకాల కవరేజిలో ఎంతో తగ్గుదల ఉంది. గిరిజన ప్రాంతాలు, మారుమూలల్లో వైద్యసేవలు తగినంతగా అందుబాటులో లేనందున క్షయవ్యాధి విస్తరిస్తున్నది. ఆరోగ్య కేంద్రాల్లో డాక్టర్లు, సిబ్బంది కొరత హెచ్చుగా ఉంది.

అయితే రాష్ట్రప్రభుత్వం ప్రారంభించిన సమగ్ర ఆరోగ్య సేవా కార్యక్రమం వల్ల వచ్చే కొద్ది సంవత్సరాల్లో ఆరోగ్య సూచీల్లో కచ్చితమైన మెరుగుదల కనిపించే అవకాశముంది. ఆరోగ్య, వైద్య సంరక్షణను గ్రామీణ పేదల ఇంటిముంగిటకు చేర్చేందుకు ముఖ్యమంత్రి కెసిఆర్ శుక్రవారంనాడు ప్రకటించిన డయాగ్నిస్టిక్ పరీక్షల కార్యక్రమం వ్యాధి నిరోధనకు, సకాలంలో గుర్తించేందుకు, చికిత్స చేసేందుకు ఎంతో దోహదం చేస్తుంది. ప్రతిగ్రామంలోని ప్రతి ఒక్కరికీ రెగ్యులర్ ఆరోగ్యపరీక్షలు నిర్వహించటం దీని ఉద్దేశం. 'రక్తనమూనాలు సేకరిస్తారు, అన్ని జబ్బులకు పరీక్షలు చేస్తారు, జబ్బును గుర్తించగానే చికిత్స మొదలెడతారు, ఖర్చును ప్రభుత్వం భరిస్తుంది' అని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రజారోగ్య రంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శప్రాయం చేస్తామన్నారు. అయితే ఇందుకు పెద్ద ఎత్తున ప్రాతిపదిక వసతులు కావాలి, డాక్టర్లు, సిబ్బంది ఎందరో కావాలి. అందువల్ల వైద్యారోగ్య పథకాన్ని అమలు చేయటం దాన్ని రూపొందించినంత సులభం కాదు. ప్రాధాన్యక్రమంలో అంచెలంచెలుగా ముందుకెళ్లటమే మెరుగైన ఫలితాలిస్తుంది. అయితే దేనికైనా పట్టుదల ముఖ్యం.

'నగదు బదిలీ' వైఫల్యం!

చూపు


జార్ఖండ్‌లోని నాగ్రీ బ్లాక్‌లో సబ్సిడీ ఆహార ధాన్యాలకు బదులుగా 'నేరుగా ప్రయోజనాలను బదిలీ' చేసే ప్రయోగాత్మక పథకం అమలు అవకతవకగా సాగుతోంది. నగదు లావాదేవీలలో పెద్దగా కాలయాపన చోటు చేసుకొని లబ్ధిదారులకు, డీలర్లకు ఇబ్బందులు కలిగాయి. దీనితో బ్యాంకులపై తీవ్రంగా ఒత్తిడి పడింది. ఇంకా 25 శాతం మంది ప్రజలు పథకం వెలుపలే ఉండిపోయారు. ఏ కొత్త పథకాన్ని ప్రవేశపెట్టినా ప్రయోజనాలతోపాటు అనుకోని వ్యయాలు తప్పవు. అయితే ప్రస్తుతం ప్రవేశపెట్టిన సబ్సిడీ ఆహార ధాన్యాల ప్రత్యామ్నాయ పథకం మెరుగ్గానే ఉన్నట్లు అధికార్లు భావిస్తున్నారు. వాస్తవాలు మాత్రం వేరుగా ఉన్నాయి.

సబ్సిడీ ఆహార ధాన్యలు బదులుగా నగదును నేరుగా లబ్ధిదార్ల అకౌంట్లలోకి బదిలీ చేసే పథకం ఇది. దీనిని జార్ఖండ్ రాంచీ జిల్లా నాగ్రీ బ్లాక్‌లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. ఇది అంతగా ఆలోచించకుండా ప్రవేశపెట్టినదిగా, పౌరులకు దీర్ఘకాలంలో నష్టాలు తెచ్చేదిగా కనిపిస్తోంది. ఈ పథకం అమలుకు పాలనా యంత్రాంగం ముందుగా తర్ఫీదు పొందలేదని అర్థమవుతోంది. పౌరుల ప్రయోజనాల అంశం లోంచి దీనిని అంచనా వేయడానికి పాలనా యంత్రాంగం నిరాకరించడం తొలి వైఫల్యం. ఈ ప్రయోగాత్మక పథకం అమలు మొదలుకాగానే పాలనా యంత్రాంగం తప్పిదాలు బయటపడ్డాయి.

ఇంతకుముందు ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) అమలులో ఉన్నప్పుడు ఆహార పౌర సరఫరాల శాఖ గ్రామాలలో డీలర్లకు ఆహార ధాన్యాలను అందించేది. ఆ తర్వాత కిలోగ్రామ్ 1 రూపాయి ధరకు పౌరులు రేషన్లను ఆ డీలర్ వద్ద కొనుగోలు చేశారు. ఆ ధర డీలర్‌కు కమీషన్‌గా దక్కేది. ఇప్పుడు 'నేరుగా ప్రయోజనాల బదిలీ (డిబిటి)' ప్రయోగాత్మక పథకాన్ని ప్రారంభించాక సబ్సిడీ ఆహార ధాన్యాలను పొందడానికి ప్రజలు సుదీర్ఘ ప్రక్రియను దాటవలసి వస్తోంది. ముందుగా తమ బ్యాంక్ అకౌంట్ల నుంచి డబ్బును వారు విత్ డ్రా చేసుకోవాలి. కిలోగ్రామ్ రూ. 32.60 ధర చొప్పున సబ్సిడీ ఆహార ధాన్యాలకు నేరుగా బదిలీ చేసిన మొత్తం అది.

ఆ తర్వాత ప్రజలు కెజి రూ. 31.60 చొప్పున డీలర్‌కు చెల్లించాలి. ఈ రకంగా ఆ డీలర్ వద్ద నెలకు రూ.4–5లక్షల నగదు జమ అవుతుంది. డిసెంబర్ 2017లో నాగ్రీ బ్లాక్‌లో నగదు రహిత కార్యకలాపాల మిషన్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఇప్పుడు అదే బ్లాక్ సబ్సిడీ రేషన్ నగదుకు కేంద్రం కావడం వింతైన విషయం. ఇప్పుడు డిబిటి అమలు తర్వాత నగదు లావాదేవీల పరిమాణం ఈ బ్లాక్‌లో చాలా రెట్లు పెరిగింది. ఇది లబ్ధిదారులకు, డీలర్లకు అసౌకర్యంగా, బ్యాంకులకు పని ఒత్తిడిగా పరిణమించింది. బ్యాంకింగ్ ప్రతినిధులపై తీవ్ర ఒత్తిడి కలుగుతోంది. తమకు ఏ అకౌంట్‌లో నగదు బదిలీ అయిందో తెలుసు కోలేక నాగ్రీ ప్రజలు ముందుగా అయోమయం ఎదుర్కొన్నారు.

తాజాగా ఆధార్‌కు అనుసంధానమైన అకౌంట్‌లోకి డిబిటి నగదు బదిలీ అవుతుంది. ఆధార్‌ను కేవలం ఒకే బ్యాంక్ అకౌంట్‌కు అనుసంధానించడం సాధ్యమన్నది మరచి డిబిటి ప్రయోజనాల కోసం విడిగా ఆధార్‌ను అకౌంట్‌కు లింకుచేసే ప్రయత్నాలు ముమ్మరం కావడంతో బ్యాంకుల వద్ద రద్దీ పెరిగిపోయింది. ఒకో సందర్భంలో బదిలీ అయిన డిబిటి మొత్తం నగదు లావాదేవీ జరపడానికి వీలయినంత లేకపోవడంతో బ్యాంకులు నగదు విత్ డ్రా చేసుకోడాన్ని నిరాకరిస్తున్నాయి. చిన్నమొత్తాల్లో విత్‌డ్రా చేసుకోడానికి డిబిటి లబ్ధిదారులను ప్రగ్యా కేంద్రాలు లేదా బ్యాంకింగ్ కరస్పాండెంట్ల వద్దకు బ్యాంకులు పంపుతున్నాయి.



ఇది కేవలం అసౌకర్యమేగాక బ్యాంకింగ్ నియమాలకు విరుద్ధం కూడా. విధిలేక ఈ అక్రమాలకు బ్యాంకులే పాల్పడుతున్నాయి. బ్యాంకింగ్ కరస్పాండెంట్లకు ఎదురవుతున్న కష్టాలు కూడా చిన్నవేమీ కాదు. మొత్తం బ్లాక్‌కు సేవలు అందించడానికి తగినంత మంది బ్యాంకింగ్ కరస్పాండెంట్లు కొరవడడం మొదటి సమస్య. దీనితో జనాల రద్దీ పెరిగిపోతోంది. డబ్బు విత్ డ్రా చేసుకోడానికి చాలా సమయం వృథా అవుతోంది. బ్యాంకింగ్ సేవలకు ఈ రద్దీ వల్ల చార్జీలు పెంచేశారు. చార్జీల వసూళ్లపై సరైన నిఘా కొరవడింది. దీనితో నగదు లావాదేవీల్లో పారదర్శకత లోపించింది. సగటున ప్రతిఒక్క లబ్ధిదారు నాగ్రీ బ్లాక్‌లో లావాదేవీ నడపడానికి సగటున మూడుసార్లు బ్యాంక్‌ను సందర్శించవలసి వస్తోంది. అప్పుడే 'నేరుగా ప్రయోజనం బదిలీ' జరిగిందో లేదో లబ్ధిదారు తెలుసుకోగలుగుతాడు. ఆధార్‌కు ఏ బ్యాంక్ అకౌంట్‌ను అనుసంధానం చేశారన్నది తెలుసుకోవడం తర్వాతి బాధ్యత. నగదు బదిలీ క్రెడిట్ అయ్యిందో లేదో ఆ తర్వాత తెలుసుకోవాలి. ఒకవేళ బదిలీ జరిగితే బ్యాంకింగ్ కరస్పాండెంట్‌ను కలుసుకోవాలి. ఈ ప్రయాసంతా పడ్డాకే లబ్ధిదారు నగదును విత్ డ్రా చేసుకొని డీలర్ వద్దకు సబ్సిడీ ఆహార ధాన్యాల కోసం వెళ్లగలుగుతాడు.

సీనియర్ సిటిజన్‌లకు ఈ కష్టాలు మరింత తీవ్రంగా ఉంటాయని వేరే చెప్పనక్కరలేదు. వృద్ధులే కాకుండా వికలాంగులు, స్కూలు పిల్లలు వంటి జనాభాలోని బలహీనులు కూడా అనేక కష్టాలు పడాల్సి వస్తుంది. అనేక సార్లు బ్యాంకుకు వెళ్లడం వారికి కుదరదు. బ్యాంక్ అకౌంట్ల నుంచి నిధుల విడుదలకు బయోమెట్రిక్ సరిపోలని సందర్భంలో వారి బాధ వర్ణనాతీతం. బ్యాంకింగ్ కరస్పాండెంట్లపై వారు పూర్తిగా ఆధారపడవలసి వస్తుంది. పిల్లలయితే స్కూల్‌కు గైర్హాజరై బ్యాంకుల వద్ద, డీలర్ల వద్ద పడిగాపులు కాయాలి. ముఖ్యంగా పెళ్లయిన కుమార్తెల అకౌంట్లలో, చనిపోయిన వ్యక్తుల అకౌంట్‌లలో డిబిటి నగదు బదిలీ అయితే ఆ డబ్బు ఇవతలకు రావడానికి తాతలు దిగి వస్తారు.

దేశంలో అత్యంత బలహీనవర్గాల ప్రజలకు ఆహార భద్రత కల్పించడానికి ఉద్దేశించినదే జాతీయ ఆహార భద్రతాచట్టం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ). అందుకు బదులుగా డిబిటి వ్యవస్థ అత్యంత బలహీన ప్రజలను సబ్సిడీ ఆహారధాన్యాల కల్పనలో శిక్షిస్తోంది అని విమర్శలు బయలుదేరాయి. రక్షించాల్సినది పోయి ఆహారభద్రత పేరుతో శిక్షించడం ఏమిటని జార్ఖండ్ నాగ్రీ బ్లాక్ ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇద్దరే సభ్యులున్న కుటుంబాలకు, ఒక్క స్త్రీయే ఉండే వాటికి ఒక్కొక్కరికీ 5 కిలోల డబ్బును డిబిటి కింద ఇస్తున్నారు. ఇంత చిన్నమొత్తం పొందడానికి తరచూ బ్యాంకుకు వెళ్లిరావడం ఖర్చు ఆయా లబ్ధిదారులకు భారం అవుతోంది. ఇది కూడా ఈ పథకంలో పెద్ద అపసవ్యమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంతకు ముందు అమల్లో ఉన్న ప్రజాపంపిణీ వ్యవస్థతో పోల్చితే ఆహార భద్రత కల్పనలో కొత్త డిబిటి ప్రక్రియ విఫలం కావడం తథ్యమని నిపుణులు చెపుతున్నారు. ముఖ్యంగా స్త్రీలు, వృద్ధులు, వికలాంగులవంటి బలహీన వర్గాలకు ఈ వ్యవస్థ ఎంతమాత్రం పనికిరానిదని విమర్శలు వినిపిస్తున్నాయి.నాగ్రీబ్లాక్‌లో బ్యాంకులు, డీలర్లు, బ్యాంక్ కరస్పాండెంట్లు, లబ్ధిదార్లు అదే మాట అంటున్నారు.

* ఆకాష్ రంజన్

నెహ్రూను మరిపించతరమా?

నరేంద్రమోడీ ఒప్పుకోకపోవచ్చు కాని, భారతదేశంపైనే కాదు, తమ పైనా చెరగని ముద్ర వేసిన చారిత్రక వ్యక్తిగా జవహర్ లాల్ నెహ్రూను గుర్తించడానికి ప్రపంచదేశాలు క్షణం సంకోచించవు. నెహ్రూ 1964లో మరణించినపుడు న్యూయార్క్ టైమ్స్ ఆయనకు నివాళులర్పిస్తూ "ఆధునిక భారత నిర్మాత" గా పేర్కొంది. ఎకనమిస్ట్ పత్రిక ముఖపత్ర కథనం ప్రచురిస్తూ "నెహ్రూలేని ప్రపంచం" అంటూ విషాదాన్ని ప్రకటించింది.

దేశంలో మాత్రం ఇటీవల నెహ్రూ గురించిన అభిప్రాయాల్లో చాలా మార్పు కనిపిస్తోంది. ప్రధాని నరేంద్రమోడీ పార్లమెంటులో మాట్లాడుతూ "కాంగ్రెసు చెబుతున్నట్లు జవహర్ లాల్ నెహ్రూ వల్ల దేశానికి స్వాతంత్ర్యం రాలేదు" అన్నారు. రాజస్థాన్‌లో 8వ తరగతి పాఠ్యపుస్తకాల నుంచి నెహ్రూ పాఠాన్ని తొలగించారు. క్విట్ ఇండియా ఉద్యమానికి సంబంధించిన నేషనల్ ఆర్కయివ్స్ ఎగ్జిబిషన్ లో ఆయన ప్రస్తావనే లేదు. నెహ్రూ అధికారిక నివాసం వద్ద ఉన్న నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీని ప్రస్తుత సాంస్కృతిక శాఖ పేరు మార్చి మాజీ ప్రధానులందరి జీవిత చరిత్రలను ప్రదర్శించే కాంప్లెక్సుగా మార్చాలని నిర్ణయించింది. అందరికీ సమానావకాశాల పేరుతో ప్రపంచంలో ఎక్కడా లేని నాటకం ఇక్కడ నడుస్తోంది. అమెరికాలో లింకన్ మెమోరియల్ ఉంది. హఠాత్తుగా ఇప్పుడెవరైనా అమెరికా అధ్యక్షుడు దాన్ని మార్చేసి ఆ ప్రదేశాన్ని ఇంకా అనేకమంది ప్రముఖుల విగ్రహాలతో నింపేస్తే ఎలా ఉంటుంది?

నెహ్రూను లక్ష్యంగా ఎందుకు చేసుకుంటున్నారంటే దానికి అనేక కారణాలున్నాయి. మహాత్మాగాంధీ హత్యానంతరం ఆర్‌ఎస్‌ఎస్ ను నిషేధించినందుకు ఆర్‌ఎస్‌ఎస్ వారికి నెహ్రూ అంటే తీవ్రమైన వ్యతిరేకత ఉంది. జవహర్ లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన సెక్యులరిజం పట్ల ఆర్‌ఎస్‌ఎస్‌కు ఏవగింపు ఉంది. చైనాతో 1962లో జరిగిన యుద్ధంలో ఎదురైన దారుణ ఓటమిని గుర్తు చేసి ప్రజల్లో నెహ్రూ పట్ల ఆగ్రహాన్ని రెచ్చగొట్టడం చాలా తేలిక. విదేశీవిధానంలో నెహ్రూ అలీనవిధానం, పంచవర్ష ప్రణాళికల పద్ధతి వీటన్నింటిపై విమర్శలతో దాడులు చేయడం తేలిక. అంతేకాదు, ప్రజాజీవితంలో నెహ్రూ ప్రముఖ నాయకుడిగా ఎదిగిపోవడం, ఆయన విగ్రహాలతో కాంగ్రెసు ఆయన్ను తమ పార్టీ నాయకుడిగా మార్చేయడం పట్ల కూడా చాలా మందికి అసమ్మతి ఉంది. రోడ్లకు ఆయన పేర్లు పెట్టారు. ప్రభుత్వ పథకాలకు ఆయన పేర్లు పెట్టారు. ఆయన చిత్రాలతో ప్రభుత్వం పత్రికల్లో ఇచ్చే ప్రకటనలు కూడా ఈ అసంతృప్తి వెనుక మరో కారణం. నిజం చెప్పాలంటే ఎక్కడ పడితే అక్కడ నెహ్రూ కనబడేలా ఆయన్ను వాడుకున్న పద్ధతి వల్ల నిజానికి ఆయన గొప్పదనానికి సంబంధించిన అనేక ప్రత్యేకతలు మరుగునపడిపోయాయి.

నెహ్రూ జీవితాన్ని చదవితే భారతదేశానికి ఆయన ఎంత ముఖ్యమైన వ్యక్తి అన్నది అర్థమవుతుంది. నేటికి కూడా నెహ్రూ భారతదేశానికి ఎంత ముఖ్యమైన వారో తెలుస్తుంది. నిజానికి ఆయనపై రావలసినన్ని జీవితచరిత్రలు రాలేదు. విస్తృతమైన ఆయన జీవితంలోని విభిన్న అంశాలను రాతలో పెట్టడం సాధ్యం కాకపోవడమే దానికి కారణం కావచ్చు. ఆయన రాసిన పుస్తకాలు, వ్యాసాలు, ఉత్తరాలు, ఆయన ప్రసంగాలు ఒక వ్యక్తి తన జీవితంలో ఇంత పరిశ్రమిస్తాడా అని ఆశ్చర్యపోయేలా చేస్తాయి. చరిత్రకారుడు జూడిత్ ఎం.బ్రౌన్ 2003లో రాసిన నెహ్రూ జీవితచరిత్ర "నెహ్రూ: ఏ పొలిటికల్ లైఫ్" చదివితే ఈ గొప్పదనం కొంతవరకు అర్థమవుతుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారాన్ని, 1947 తర్వాత నెహ్రూ రాసిన వ్యాసాలను రచయితకు సోనియాగాంధీ అందజేశారు. రచయిత అద్భుతంగా, అత్యంత నిష్పక్షపాతంగా నెహ్రూ జీవిత చరిత్రను రికార్డు చేశారు.

నెహ్రూ సంపన్న కుటుంబంలో జన్మించారు. తండ్రి మోతీలాల్ నెహ్రూ ప్రముఖ న్యాయవాది, రాజకీయ నాయకుడు. ఈ జీవిత చరిత్ర పుస్తకంలో రచయిత రాసినట్లు భారతదేశంలో ధార్మిక, సామాజిక, సంప్రదాయాలను బ్రిటీషు పాలన దెబ్బతీస్తున్నప్పుడు, విద్యావంతులైన భారతీయులకు అవసరమైన అవకాశాలు కల్పిస్తున్న వాతావరణంలో నెహ్రూ పెరిగి పెద్దయ్యారు. హారో, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయా ల్లో చదువుతున్నప్పుడే ఆయన రాజకీయ భావాలు రూపుదిద్దుకున్నాయి. సామ్రాజ్యవాదం పట్ల తీవ్రమైన వ్యతిరేకత ఆయనకుండేది. దేశానికి తిరిగి వచ్చిన తర్వాత కొన్ని సంవత్సరాలు లక్ష్య రహితంగానే గడిచాయి. కాని మహాత్మాగాంధీ 1919–20ల్లో ప్రారంభించిన ప్రతిఘటనలతో ఆయన రాజకీయాలవైపు ఆకర్షించబడ్డారు. ఆ తర్వాతి నుంచి జాతీయోద్యమంలో అతివాదులకు, మితవాదులకు మధ్య పోరాట వ్యూహాలు, ఎత్తుగడల విషయమై చర్చల పరంపర ప్రారంభమైంది. అలాగే సహాయనిరాకరణ గురించి, సంపూర్ణ స్వరాజ్యం కోసం డిమాండ్ లేదా పరిమిత ఫలితాల కోసం ప్రయత్నించడం వంటి విషయాలపై వాడి వేడి చర్చలు జరిగే వి.

ఈ వాతావరణంలో నెహ్రూ స్థిరంగా గాంధీజీకి బాసటగా నిలిచారు. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీని కేంద్రశక్తిగా గుర్తించారు. మహాత్మాగాంధీ రాజకీయ విధానాలు, నైతిక పరివర్తన విషయమై ఆయన పట్టుపట్టడం వంటివి చికాకు కలిగించినా గాంధీజీకి తన మద్దతును కొనసాగించారు. నెహ్రూ విధానాలపై ప్రభావం వేసిన ఇతర విషయాలు కూడా ఉన్నాయి. అందులో ఒకటి ఆయన పుట్టి పెరిగిన, హిందూ ముస్లిమ్ మిశ్రమ సంస్కృతి ఉన్న వాతావరణం. ఆయన తండ్రి మోతీలాల్ నెహ్రూ ప్రాథమిక విద్యాభ్యాసం అంతా ఒక ముస్లిం పండితుని ద్వారా అరబ్బీ, పార్శీ భాషల్లోనే జరిగింది. అలహాబాద్‌లో నివసించే కశ్మీరీ కుటుంబం అది. నెహ్రూను అలహాబాద్‌లో స్థానికులుగా ఎన్నడూ భావించలేదు. అక్కడి సంకుచితమైన, ప్రాంతీయ దురభిమానాలకు దూరంగానే ఉన్నారు. నెహ్రూ అయితే ఒకవిధంగా బయటివ్యక్తిగానే ఉండేవారు. సాంస్కృతికంగా బ్రిటన్ ను మెచ్చుకునే బలమైన జాతీయవాది. భారతదేశం విదేశీపాలనలో ఉండడం పట్ల ఆయన చాలా బాధపడేవారు. కాని దేశంలోని మూఢనమ్మకాలు, అంధసంప్రదాయాలను ఏవగించుకునేవారు.

త్వరలోనే నెహ్రూ రాజకీయాల్లోను, కాంగ్రెసు వ్యవహారాల్లోను తలమునకలైపోయారు. ఆయన అధ్యయనం చాలా విస్తారమైనది. చాలా లోతయినది. జైల్లో ఉండడం కూడా అధ్యయనానికి ఉపయోగపడింది. 1921 నుంచి 1945 వరకు ఆయన తొమ్మిది సార్లు జైలుకు వెళ్లారు. అతి తక్కువ కాలం 12రోజులు జైల్లో ఉంటే అత్యధికంగా 1041 రోజులు జైల్లో ఒకసారి ఉన్నారు. మొత్తం జీవితంలో 3259 రోజులు జైల్లో గడిపారు. అంటే జీవితంలో దాదాపు తొమ్మిది సంవత్సరాలు జైల్లోనే ఉన్నారు. ఆయన జైలు జీవితానికి తన్ను తాను అలవాటు చేసుకున్నారు. జైల్లో స్నేహాల గురించి, హాబీల గురించి రాశారు. ప్రైవసీ లేకపోవడం పట్ల చికాకును కూడా రాసుకున్నారు. అధ్యయనం ఆయనకు గొప్ప సాంత్వన నిచ్చేది. ఆయన జీవిత చరిత్ర రాసిన బ్రౌన్ ప్రకారం నెహ్రూ అనేక విషయాలపై చదివేవారు. పాలిటిక్స్, ఎకనమిక్స్, సైన్స్, లిటరేచర్, కరంట్ ఎఫైర్స్ అన్నీ చదివేవారు. జైల్లో ఉన్నప్పుడు విస్తారమైన అధ్యయనం చాలా అవసరం లేకపోతే మనస్సు కుంగి కృశించిపోతుంది అన్నారాయన. ఒకసారి ఫిబ్రవరి 1934 నుంచి సెప్టెంబరు 1935 వరకు ఆయన 188 పుస్తకాలు చదివారు. అంటే నెలకు 15 నుంచి 20 పుస్తకాలు.

ఈ విస్తారమైన, లోతయిన అధ్యయనం వల్ల ఆయన అద్భుతమైన రచయిత కాగలిగారు. ఆయన రాసుకున్న ఆటో బయోగ్రఫీ కాని, డిస్కవరి ఆఫ్ ఇండియా కాని, ఆయన రాసిన ఉత్తరాలు కాని, ప్రసంగాలు కాని అన్నింటా ఆయన ప్రతిభ కనబడుతుంది. భారతదేశంలోను, బ్రిటన్‌లోను ఆయన నివసించిన కాలం, యూరపు ప్రయాణా ల్లో ఆయన గడిపిన కాలం, ఇతర దేశాల నాయకులతో ఆయన చర్చ లు వీటన్నింటిలో ఆయన చాలా పటిష్టమైన రాజకీయ దృక్పథాన్ని ఏర్పరచుకున్నారు. వలసపాలనను తీవ్రంగా వ్యతిరేకించేవారు. దేశాల మధ్య సమానత్వం కోరుకునేవారు. దేశంలో ప్రజల మధ్య సమానత్వం కోరుకునేవారు. భూసంస్కరణలు అవసరమని భావించారు. ఆర్థికరంగంలోను, సామాజికంగాను రాజ్యం జోక్యం చేసుకోవడం అవసరంగా భావించారు. ఒక జాతి జీవనంలో విజ్ఞాన శాస్త్రానికి చాలా ప్రాముఖ్యం ఇచ్చేవారు. మతానికి ఆయనెప్పుడు ప్రాముఖ్యం ఇవ్వలేదు. జాతి నిర్మాణంలో మహిళలకు ప్రముఖ పాత్ర ఉండాలని భావించేవారు. ప్రపంచపటంలో భారతదేశానికి ప్రత్యేక స్థానం కోసం పరితపించారు.

ఈ మేధోపరమైన ప్రగతి అనేది భారత భవిష్యత్తుకు ఎంతైనా అవసరం. నెహ్రూ కాంగ్రెసులో 1930 నాటికి ప్రముఖ స్థాయికి ఎదిగారు. పార్టీ అధ్యక్షుడిగా, జాతీయోద్యమ నాయకుడిగా ఆయన అనేక పరిస్థితులను చూశారు. ఆందోళనలు, ప్రతిఘటనలు, సర్దుబాట్లు, అసమ్మతులు ఇలా ఎన్నెన్నో చూశారు. అప్పటికి గాంధీజీ ముఖ్యంగా అంటరానితనంపై దృష్టి పెడుతూ రాజకీయాల నుంచి వెనక్కు తొలగుతున్న కాలం అది. ఆ తర్వాత 1936లో గాంధీజీ తన వారసుడిగా నెహ్రూను ప్రకటించారు. అనేక నైపుణ్యాలున్న నెహ్రూ, భారతదేశం పట్ల పూర్తి అంకితభావం ఉన్న నాయకుడు, ఎలాంటి వర్గపరమైన ప్రయోజనాలు, వ్యక్తిగత ప్రయోజనాలు లేని నాయకుడు కాబట్టి ఆయనపై పూర్తిగా ఆధారపడవచ్చని గాంధీజీ విశ్వసించేవారు. నెహ్రూ ద్వారా కాంగ్రెసులో సమైక్యత సాధించవచ్చని ఆయన భావించారు. ఈ దశలో నెహ్రూ కాంగ్రెసు పార్టీలో కీలకమైన నాయకుడు మాత్రమే కాదు, ప్రజలు పెద్ద సంఖ్యలో మద్దతిస్తున్న ప్రజానాయకుడు కూడా. ప్రజలు ఆయన్ను అమితంగా గౌరవించేవారు.

1946లో నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వానికి అంగీకరించారు. ఆ తర్వాత చర్చల్లో ఆయన ముఖ్యభూమిక పోషించారు. చివరకు దేశవిభజన దశ కూడా వచ్చింది. చరిత్రకారుడు రామచంద్రగుహ రాసిన పుస్తకం "పాట్రియాట్స్ అండ్ పార్టిసాన్స్" లో ఇలా రాశారు, "నిస్సందేహంగా మన ప్రజాస్వామ్యసాధానికి ప్రధాన వాస్తుశిల్పి నెహ్రూ. ఆయనే అందరికీ ఓటు హక్కు, బహుళ పార్టీ వ్యవస్థలకు పునాదులేశారు." అని రాశారు.

దేశంలో సామాజిక మార్పు కోసం నెహ్రూ కృషి చేశారు. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి ద్వారా అసమానతలను తొలగించే ప్రయత్నం చేశారు. సోషలిస్టు పంథా పరిపాలనతో, మిశ్రమ ఆర్థిక విధానాలను అవలంబిస్తూ ఆయన చేసిన ప్రయత్నాలను ఇప్పుడు ఎవరు విమర్శించినా, ఇలాంటి విధానాల వల్ల ప్రగతి దెబ్బతిందని కొందరు వాదించినా ఆయన అవలంబించిన విధానాలకు మద్దతు కూడా చాలా ఉంది. సోవియట్ పారిశ్రామికీకరణ వేగం పుంజుకోవడం ఆయన్ను ఆకర్షించింది. భారతదేశంలో కూడా అలాంటి ప్రగతి సాధించాలని భావించారు. అయితే సోవియట్‌లో మాదిరి హింసాత్మక పరిస్థితులు లేకుండా అదంతా సాధించాలనుకున్నారు. ఇక్కడ మనం గుర్తించవలసిన వాస్తవమేమంటే, స్వతంత్ర భారతం ప్రయాణం ప్రారంభించినప్పుడు దేశంలో అక్షరాస్యత 14 శాతం. పేదరికం ఎటు చూసినా అలుముకున్న పరిస్థితులవి. అందువల్ల అనేక రంగాల్లో ప్రభుత్వం కలుగజేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. దాని వల్ల చెప్పుకోదగ్గ ఫలితాలు కూడా లభించాయి. ముఖ్యంగా అణుశక్తి రంగంలోను, రోదసీరంగంలోను ఈ ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

నెహ్రూ పోషించిన పాత్రను తగ్గించి చూపడం అన్నది, లేదా ఆయన్ను మరిచిపోవడం అన్నది దేశాన్ని తక్కువ చేయడమే అవుతుంది. చరిత్రలో ఆయన పోషించిన పాత్ర ప్రాముఖ్యం మాత్రం తగ్గదు.

* సుశీల్ ఆరన్

ఎడిటర్‌కు లేఖ

యథేచ్ఛగా సాగుతున్న వన్యప్రాణుల వేట?

అడవులలో స్వేచ్ఛగా సంచరించాల్సిన వన్యప్రాణులు వేటగాళ్ళ బారినపడి మాంసాహార ప్రియులకు విందు భోజనంగా మారుతున్నాయి. ముఖ్యంగా వరంగల్ రూరల్, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలలో దట్టమైన అటవీ సంపద ఉంది. అడవులకు సరిహద్దులలో గల గ్రామాలలోని వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడి వాటి మాంసాన్ని నగరాలు, పట్టణాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అడవులలోని వన్యప్రాణులకు కరెంటు తీగలు అమర్చడం, మందుగుండు సామాగ్రి ద్వారా వాటిని హతమార్చి మాంసాన్ని రవాణా చేస్తున్నారు. కొన్ని గ్రామాలలో ముఠాలుగా ఏర్పడి పెద్ద ఎత్తున వన్యప్రాణులను వేటాడుతూ కార్పొరేట్ హోటళ్లు, రెస్టారెంట్ల కు తరలిస్తున్నారు. కుందేళ్లు, దుప్పులు, అడవిపందులు, కొండ గొర్రెలు, నెమళ్లు, జింకలు వేటగాళ్ల వలలో పడి తనువు చాలిస్తున్నాయి. వన్యప్రాణి సంరక్షణచట్టం కేవలం కాగితాలకే పరిమితమవుతుంది. ఒకవైపు పోడు వ్యవసాయం మూలంగా అడవులు అంతరించి పోతుండడం, మరోవైపు వేటగాళ్ల దాష్టీకానికి వన్యప్రాణుల సంఖ్య తగ్గుతుండడం కలవరానికి గురిచేస్తోంది. వరంగల్ రూరల్‌లోని కొత్తగూడ, పాకాల అడవులు, జయశంకర్‌జిల్లాలోని మహదేవ పూర్, పలిమెల, వాజేడు, మహాముత్తారం, గూడూరు, మంగపేట, కన్నాయిగూడెం, వెంకటాపురం, ఏటూ రు నాగారం మండలాల పరిధిలో ఈ వేట నిరాటంకంగా సాగుతోంది. ప్రభుత్వం గుర్తించి వేటగాళ్ల బారినుండి వన్యప్రాణులను సంరక్షించాలి.

– కామిడి సతీష్‌రెడ్డి

అసెంబ్లీ సీట్ల పెంపుపై కేంద్రానికి లేఖ

భారతదేశంలోని 29వ రాష్ట్రమైన తెలంగాణలోని జనాభా దాదాపు 5కోట్లు. చిన్న రాష్ట్రాలైన గోవా, పుదుచ్చేరి, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, మిజోరంలలో జనాభా కోటికన్నా తక్కువ. అసెంబ్లీ స్థానాలు దాదాపు 100లోపున ఉన్నాయి. ఐదు కోట్ల జనాభా కలిగిన తెలంగాణ రాష్ట్రంలో శాసనసభ స్థానాలు 119ని 153కు చేయాలని సిఎం కెసిఆర్ గారు ఎన్నో పర్యాయాలు వినతులు చేశారు. 2026 వరకు పెంచడం సాధ్యం కాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీహన్స్‌రాజ్ గంగారం ఆహిర్ తెలిపారు. తెలంగాణలోని పెద్దపల్లి పార్లమెంటు స్థానంను మంచిర్యాల నియోజకవర్గంగా, ఆసిఫాబాద్, సిర్పూర్, బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల ఐదునియోజకవర్గాలను కలుపుతూ మంచిర్యాల పార్లమెంటు స్థానంగా కేంద్రం ప్రకటించాలి. ఇప్పుడున్న మంచిర్యాల పార్లమెంటు నియోజక వర్గంను జనరల్ స్థానంగా ప్రకటిస్తూ ఎన్నిక జరిపించాలి. నియోజకవర్గాలను పెంచి సిఎం కెసిఆర్ గారి 'తెలంగాణ స్వర్ణం' లక్ష్య సాధనకు తోడ్పడాలని కేంద్ర హోంశాఖ మంత్రిగారిని వేడుకుంటున్నాను.

– కోలిపాక శ్రీనివాస్

మా 'విడాకులు' వద్దు!

'వివాహం చేసుకున్న వారు' చెప్పుడు మాటలు విని విడాకులు తీసుకోవడం సులభంగా ఉన్నా ఏడడుగులు నడిచి కాపురాలు చేసి ఆ బంధాన్ని మరచిపోవడం సబబుగా లేదు. భార్యాభర్తల బంధం పటిష్టం కోసం మనసు విప్పుకొని జరిగిన విషయమై పరస్పరం చర్చించుకొని తమ వల్ల జరిగిన పొరపాట్లను జీవితంలో జరగకుండా చూసుకుంటే ఆ కాపురం నిలబడుతుంది. విదేశీయులు భారత్‌కు వచ్చి మన దేశంలో జరుగుతున్న వివాహబంధాన్ని గౌరవిస్తున్నారు. భార్యాభర్తలు ఎవరైనా సరే పెద్దల మాట వినాలి. కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నను వారి మధ్యగల బంధాన్ని తెంపుకోలేరు. విడిపోదలచుకునే భార్యాభర్తలు హిందూ వివాహ బంధానికి విలువ ఇచ్చి ఆదర్శదంపతులుగా మెలగాలి. (ఫిబ్రవరి11న ప్రపంచ వివాహ దినోత్సవం)

– కోలిపాక శ్రీనివాస్

నెలసరి 'ప్యాడ్స్' సంపన్నుల స్వంతమా?

మన దేశంలో అధికశాతం ఏ రోజుకు ఆ రోజు సంపాదించుకుని కుటుంబాన్ని నడుపుకునే వారే. ఆడపిల్ల పుడితే పుట్టినప్పటి నుండి 'ఆడ'పిల్లగానే పెంచుతారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్చుతారు. రజస్వల అయితే చదివించలేక ఒక అయ్యచేతిలో పెట్టాలని చూస్తారు. వారికి అధిక ధరలతో లభ్యమయ్యే నెలసరి 'ప్యాడ్స్' కొనే స్థోమత కూడా లేకపోవడం. వాటిపై 12% పన్ను వేయడం బలహీన వర్గాల మహిళలను అవమాన పరచడమే. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ వారు 2016లో చేసిన పరిశోధన ప్రకారం దేశంలో 84% అమ్మాయిలు, 92.2%తల్లులూ ఇప్పటికి నెలసరి సమయంలో గుడ్డని వాడుతున్నారు. 37.8% పెళ్లి కాని పిల్లలు చర్మవ్యాధులతో బాధపడుతున్నారు. స్త్రీలలో ఆర్‌టిఐ(రిప్రొడక్టివ్ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్)కి, సర్వైకల్ కాన్సర్‌కు 70% కారణం శుభ్రమైన గుడ్డ, ప్యాడ్‌లు వాడకపోవడమేనని. కాబట్టి ప్రభుత్వం 'టాక్స్ ఫ్రీ' చెయ్యాలి. బాలికలకు ఫ్రీగా ఇవ్వాలి. జైట్లీ పునరాలోచించాలి.

– గుండ్రాతి శారదగౌడు

Dwaraka (Everyday NewsPapers)



2017 మార్చి లో లండన్ లోని ఒక అంతర్జాతీయ సంస్థ దేశంలోని 20 రాష్ట్రాలలో చేసిన అధ్యయనం ప్రకారం 2010 -11 నుండి 2015-16 వరకు అయిదు సంవత్సరాల కాలంలో ఒక కోటి ముప్పై లక్షల మంది ప్రభుత్వ బడులను వదలగా ఒక కోటి డెబ్బై అయిదు లక్షల మంది పిల్లలు ప్రైవేటు బడుల వైపు మొగ్గు చూపారు. ఈ అయిదు సంవత్సరాల కాలంలోనే ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 122 మంది నుండి 108కు పడిపోయింది.అదే సమయంలో ప్రవేటు బడులలో విద్యార్థుల సంఖ్య 202 నుండి 208కి పెరిగింది.... 2016-17 సంవత్సర తెలంగాణ విద్యా శాఖ లెక్కల ప్రకారం రాష్ట్రంలో గల 11982 ప్రైవేటు పాఠశాలల్లో 32,45,657 మంది విద్యార్థులు నమోదు అయినారు. అంటే రాష్ట్రంలో బడికెళుతున్న 6033196 మంది మొత్తం పిల్లలలో సగానికంటే ఎక్కువగా ప్రైవేటు బడులకు వెళుతున్నారు.

ప్రతి ఆదివారం ప్రజాజీవన ప్రతిబింబం

మన తెలంగాణ

మన

మనపేజీ
మనందరిపేజీ

www.manatelangana.news

హైదరాబాద్ | ఆదివారం | 11 ఫిబ్రవరి | 2018

గల్లీ గల్లీమే స్కూల్

సరైన బోధన నిల్

నియతి నియంత్రణ లేని ప్రైవేటు విద్యావధ్యశాలలు

దేశంలోని 15 లక్షల పాఠశాలలలో దాదాపు 25 కోట్ల మంది పిల్లలు చదువుతున్నారు. అందులో దాదాపు 40 శాతం మంది 25 శాతం గల ప్రైవేటు బడులలో చదువుతున్నట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వ బడులను వదిలి ప్రైవేటు బడులలో చేరిన విద్యార్థులు 2006లో 18.7 శాతం కాగా 2016 నాటికి అది 25.6 శాతానికి పెరిగింది. 2017 మార్చి లో లండన్ లోని ఒక అంతర్జాతీయ సంస్థ దేశంలోని 20 రాష్ట్రాలలో చేసిన అధ్యయనం ప్రకారం 2010–11 నుండి 2015–16 వరకు అయిదు సంవత్సరాల కాలంలో ఒక కోటి ముప్పై లక్షల మంది ప్రభుత్వ బడులను వదలగా ఒక కోటి డెబ్బై అయిదు లక్షల మంది పిల్లలు ప్రైవేటు బడుల వైపు మొగ్గు చూపారు. ఈ అయిదు సంవత్సరాల కాలంలోనే ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 122 మంది నుండి 108కు పడిపోయింది.అదే సమయంలో ప్రైవేటు బడులలో విద్యార్థుల సంఖ్య 202 నుండి 208కి పెరిగింది. మొత్తంగా దేశ వ్యాప్తంగా 65 శాతం మంది పిల్లలు ప్రభుత్వ బడులలో చదువుతుండగా 35 శాతం మంది పిల్లలు ప్రైవేటు బడులలో విద్యనభ్యసిస్తున్నారు. ఉచితంగా విద్యనందిస్తున్నా ప్రభుత్వ పాఠశాలలను వదిలి తల్లిదండ్రులు ప్రైవేట్ చదువులకు ఫీజులు కట్టడానికి సిద్ధపడి వాటి బాట పట్టడంపై జాతీయ స్థాయిలో చర్చ జరగవలసిన అవసరం ఉంది. ప్రభుత్వ బడులలో నాణ్యమైన విద్య అందడం లేదనే ప్రధానమైన కారణంతో పాటు ఇంగ్లీషు మాధ్యమం లేకపోవడం కూడా దీనికి మరొక బలమైన కారణంగా నిపుణులు చెపుతుంటారు. కేంద్ర ప్రభుత్వం ఈ అయిదు సంవత్సరాల కాలంలో ప్రాథమిక విద్యపై దాదాపు ఒక లక్షా పదహారు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని ఈ కాలంలో ప్రభుత్వరంగంలో నాణ్యమైన విద్య అందకపోగా ఇంకా దిగజారిందని పలు నివేదికల ద్వారా తెలుస్తుంది.

బహుళ ప్రచారంలో ఉన్న అసర్ రిపోర్ట్ ప్రకారమైతే నాలుగవ తరగతిలోని 41 శాతం పిల్లలు మాత్రమే 2వ తరగతి పుస్తకాన్ని చదువగలరు. అయిదు సంవత్సరాలు పాఠశాలలో గడిపిన పిల్లలలో 59 శాతం మంది దాదాపు ఏమీ నేర్చుకోలేదంటే వారికి మన ప్రభుత్వాలు చేసిన అన్యాయం అంత ఇంతా కాదు.

ప్రజలలో విద్యపట్ల ఉన్న ఆసక్తిని, నమ్మకాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం వలన ప్రైవేట్ యాజమాన్యాలు ఆదిలో సేవా భావంతో పాఠశాలలు ఏర్పరచి క్రమక్రమంగా లాభాపేక్ష సంస్థలుగా మారి విద్యా వ్యాపారాన్ని సాగిస్తున్నా యి. వాటికి ప్రభుత్వమే అనుమతులిచ్చి నియంత్రణను గాలికొదిలేసింది. ప్రైవేట్ బడుల స్థాపన శాస్త్రీయ పద్ధతిలో జరగడం లేదు. ఎక్కడపడితే అక్కడే ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. దేశ వ్యాప్తంగా గతంలో కంటే 19 శాతం ప్రైవేట్ పాఠశాలలు ఒక్కసారిగా 31 శాతానికి పెరిగాయి. అంతే కాకుండా సమాజంలో ఎన్నిరకాల ఆర్థిక సామాజిక తారతమ్యాలు ఉన్నాయో ప్రైవేట్ పాఠశాలలలో కూడా అన్నే తారతమ్యాలు మనకు కనిపిస్తున్నాయి.



2016–17 సంవత్సర తెలంగాణ విద్యా శాఖ లెక్కల ప్రకారం రాష్ట్రంలో గల 11982 ప్రైవేటు పాఠశాలల్లో 32,45,657 మంది విద్యార్థులు నమోదు అయినారు. అంటే రాష్ట్రంలో బడికెళుతున్న 6033196 మంది మొత్తం పిల్లలలో సగానికంటే ఎక్కువగా ప్రైవేటు బడులకు వెళుతున్నారు. కేవలం 25 శాతం ప్రైవేటు బడులలో 50 శాతం కన్నా ఎక్కువ మంది పిల్లలు చదువుకొంటున్నారు. ఒక్క హైదరాబాద్ లోనే 8లక్షల 50వేల మంది బడికి వెళ్తున్న పిల్లల్లో 7 లక్షల 19 వేల మంది పిల్లలు ప్రైవేటు బడులలోనే చదువుతున్నారు. అంటే దాదాపు 85% మంది పిల్లలు ప్రైవేటు లో ఉన్నారు. అదేవిధంగా రంగారెడ్డి జిల్లాలో 69%, మేడ్చల్ లో 82%, వరంగల్ అర్బన్ జిల్లాలో 65% మంది పిల్లలు ప్రైవేట్ బడులలో చదువుతున్నారు. అంటే ఈ నాలుగు జిల్లాలలోనే దాదాపు 16లక్షల మంది పిల్లలు ప్రైవేట్ బడులకు వెళుతున్నట్లు విద్యాశాఖ లెక్కల ద్వారా తెలుస్తుంది. ఈ ప్రైవేటు బడులు పిండి కొద్దీ రొట్టె అన్నట్లుగా తల్లిదండ్రుల ఆర్థిక స్థోమత తగ్గట్లుగా అసంఖ్యాకంగా వెలిశాయి. నెలకు 500 వందల రూపాయల నుండి లక్ష అంతకంటే ఎక్కువ రూపాయల వరకు కూడా ప్రతి విద్యార్థి నుండి వసూలు చేస్తున్నారు.

ఇలా రాష్ట్రంలో ప్రైవేటు బడుల పేరుతో వేల కోట్ల రూపాయల వ్యాపారం కొనసాగుతున్నది. ఎంత చెట్టుకు అంత గాలి అన్నట్లుగా లక్ష రూపాయలు కట్టే తల్లిదండ్రులు కూడా ఇంకో పాపనో బాబునో బడిలో చేర్పించాలంటే భారీగా పెరిగిన ఫీజులు కట్టలేక రోడ్డెక్కుతున్న సంఘటనలు మనం నిత్యం చూస్తూనే ఉన్నాము. తల్లిదండ్రులు సంఘాలుగా ఏర్పడి దేశ వ్యాప్తంగా ఒక పెద్ద ఆందోళనకు కూడా సిద్ధమయ్యారంటే పరిస్థితి ఎంత క్లిష్టమైందో అర్థం అవుతున్నది. ఒక వైపు ప్రతి సంవత్సరం ఫీజులు పెంచుతూ పోతున్నారు మరో వైపు అదే రీతిలో తమ జీతాలు పెరగటం లేదని అదే ప్రైవేటు పాఠశాలల అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు. చిన్న మధ్య తరగతి కుటుంబాలైతే తమ పిల్లలను మంచి చదువులు చదివించాలన్న తపనతో అన్ని కోరికలను చంపుకొని, ఖర్చులను తగ్గించు కొని, కొన్ని సందర్భాలలోనైతే ఉన్నదీ లేనిదీ అమ్ముకొని, కుదువ పెట్టి, చిట్టీలు కట్టి, వడ్డీకి అప్పులు తెచ్చి మరీ చదివిస్తున్నారు. తెలంగాణలో ప్రతి రెండు కుటుంబాలలో ఒక కుటుంబం ఈ పరిస్థితికి నెట్టబడింది. హైదరాబాదు లాంటి నగరంలో అయితే దాదాపు 75శాతం కుటుంబాలు ఈ ప్రైవేటు ఫీజుల విషవలయంలో చిక్కుకొని ఉన్నాయి.

ప్రైవేటు పాఠశాలలో ఫీజుల భారం భరించలేక తల్లిదండ్రులు పిల్లలను బడులు మాన్పించి పనులలో పెట్టిన సందర్భాలు అనేకం. మరీ ముఖ్యంగా తమ సంతానంలో యెవరికో ఒక్కరికే చదువుకునే అవకాశం ఇవ్వాలని నిర్ణయించుకుంటే ఆడ పిల్లలను ముందుగా బడి మాన్పించడం మనం గమనిస్తూనే ఉన్నాం. దీని ప్రభావం వల్ల బాల్యవివాహాలు, ఇళ్ళల్లో వెట్టిచాకిరి వంటి ఇబ్బందులకు ఆడపిల్లలు గురి అవుతుంటారు. ఇంకా కొన్ని సందర్భాలలో పాఠశాల యజమాన్యం సకాలంలో ఫీజులు కట్టకపోతే పిల్లలపై వత్తిడి పెంచి అవమానానికి గురిచేసినప్పుడు వారు భరించలేక ఆత్మహత్యలు వంటి కఠినమైన నిర్ణయాలు తీసుకున్న సంఘటనలు మనకు దర్శనమిస్తూనే ఉన్నాయి.

బాలల హక్కు చట్టం 2 0 0 9 ప్రాథమిక విద్యలో ప్రవేశ పరీక్షలు నిషేధించింది. ఆడ పిల్లలకు మగ పిల్లలకు వేరుగా మరుగు దొడ్లు, రక్షిత మంచి నీటి సౌకర్యం, ఆట స్థలం, సరిహద్దు గోడ లేదా కంచె ఉండాలని పేర్కొన్నది. చట్టం అమలులోకి వచ్చిన తేదీ నుండి మూడు సంవత్సరాలలోపు వీటిని పూర్తి చేయడంలో విఫలమైతే ఆ బడి గుర్తింపు రద్దు చేయాలని పేర్కొనడం జరిగింది. ఉల్లంఘించిన వారికి లక్ష రూపాయల జరిమానా విధించ వచ్చని చట్టం చెబుతుంది. ఎన్ని ప్రైవేటు పాఠశాలలు దీనిని ఉల్లంఘించాయో తెలుసుకోవడం పెద్ద సమస్యనే కాదు కాని చట్టం అమలు ఎంత నిర్వీర్యంగా ఉందో అర్థం అవుతున్నది.

విద్య హక్కు చట్టం ప్రకారం క్యాపిటేషన్ రుసుం కానీ డొనేషనలు కాని వసూలు చేయకూడదు క్యాపిటేషన్ రుసుం ఎంత వసూలు చేస్తే దానికి పది రెట్ల వరకు జరిమానా విధించాలని చట్టం చెబుతున్నది. పిల్లలను ప్రవేశ పరీక్షకు గురి చేస్తే రూ. 25,000 నుండి రూ. 50,000 వరకు జరిమానాలు విధించవచ్చు. మన దేశంలో చట్టాలు చేయడానికి ప్రభుత్వాల మీద వత్తిడి తేవాలి. చట్టాలు చేసినప్పటి ఉత్సాహం, ప్రచారం వాటి అమలు విషయంలో చూపరు.ఆచరణలో విద్యా చట్టం వైఫల్యమే ఇందుకు నిదర్శనం.

ప్రైవేట్ యాజమాన్యాలు ప్రభుత్వాలను శాసించే స్థాయికి వెళ్ళాయి. ప్రభుత్వంలో ఉన్న పార్టీకి కొన్ని యాజామాన్యాలు మద్దతు తెలిపితే ప్రభుత్వంలోకి వస్తాయి అనుకున్న పార్టీలకు మరి కొన్ని సంస్థల యాజమాన్యాలు వత్తాసు పాడుతాయి. ఆయా రాజకీయ పార్టీల సభలకు బస్సులు, ఇతర సహాయ సహకారాలు అందిస్తూ తమ పై చట్ట పరంగా ఎటువంటి చర్యలు తీసుకోకుండా చూసుకుంటారు.

ఈ నేపథ్యంలోనే గత రెండు మూడు సంవత్సరాలుగా ప్రవేట్ పాఠశాల యాజమాన్యాలు తమ ఇష్టమొచ్చినట్లుగా పెంచుతున్న ఫీజుల విషయంలో తల్లిదండ్రుల సంఘాలు, బాలల హక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు, ఇతర సంఘాలు, ఆందోళనలు చేపట్టాయి. ప్రైవేట్ పాఠశాలలను నియంత్రించాలని ప్రభుత్వం పై వత్తిడి తీసుకువస్తూనే ఉన్నాయి.

తల్లిదండ్రుల నుండి వచ్చిన వత్తిడికి ఎట్టకేలకు తలొగ్గి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ వి.సి ప్రొ.తిరుపతిరావు అధ్యక్షతన మార్చి 21, 2017న ఒక కమిటీని వేసింది. వాస్తవానికి ఈ కమిటీ తల్లిదండ్రుల సంఘాలతో, పాఠశాలల యాజమాన్యాలతో, ఇతర నిపుణులతో చర్చించి ఫీజుల నియంత్రణ విషయంలో ప్రభుత్వానికి మూడు నెలలో నివేదికను సమర్పించాలి. దాదాపు సంవత్సర కాలం పాటు సమయం తీసుకొని నివేదిక విడుదల చేసింది. కమిటి నివేదిక రూపొందించడంలో భాగంగా పాఠశాలల ఆడిట్ రిపోర్టులను సమర్పించమని తిరుపతిరావు కమిటీ పదే పదే చేసిన అభ్యర్థనలను లెక్కచేయకుండా ప్రైవేట్ పాఠశాలలు బాహాటంగానే ధిక్కారం ప్రదర్శించాయి. ఇది ప్రభుత్వ ఉత్తర్వుల పట్ల ప్రైవేట్ విద్యాసంస్థలకున్న గౌరవాన్ని తెలుపుతున్నది. ఇంత జరిగిన తర్వాత మహారాజుకు మనవి చేసుకుంటే మరి రెండు తన్నించిన చందంగా, యాజమాన్యాలు ఫీజులను 10శాతం పెంచుకోవచ్చని కమిటీ సిఫారసు చేయడం సభ్య సమాజాన్ని ఆశ్చర్య పరిచింది.

ఈ కమిటీ నివేదికను తల్లిదండ్రుల సంఘాలు ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించినాయి. ఈ వ్యతిరేకతను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నివేదికను అమలు చేయబోమని ఒక ప్రకటన చేసి చేతులు దులుపుకుంది. తిరుపతిరావు కమిటీ ద్వారా కాలయాపనే కావున అన్ని విద్యా సంస్థల పరిపాలన నిర్వహణ విధి విధానాలను స్పష్టం చేస్తూ ఫీజుల నియంత్రణ నిబంధనలను నిర్వచిస్తూ, అభ్యాసన సామాగ్రి యూనిఫాంలు ఇతరత్రా సామాగ్రి నిర్బంధంగా కొనడాన్ని నిషేధిస్తూ విద్యా హక్కు చట్టం అమలు తప్పని సరి చేస్తూ తక్షణం తెలంగాణ ప్రభుత్వం ఒక సమగ్ర ప్రైవేటు విద్యా సంస్థల పరిపాలన చట్టాన్ని తీసుకరావాలి.

చట్టం అమలు కు స్వయం ప్రతిపత్తి గల విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయాలలి. అన్ని విద్యా సంస్థల్లో తల్లిదండ్రుల, ప్రజా ప్రతి నిధుల భాగస్వామ్య కమిటీలను ఏర్పాటు చేసి చట్ట బద్ధత కల్పించాలి.


విద్యపై కొఠారి కమిషన్ సిఫారసు ప్రకారం అందరికీ సమాన విద్యా అవకాశాలు కల్పించే దిశగా, పేద, ధనిక తేడా లేకుండా పిల్లలందరూ తమ నివాస పరిధిలోని బడికే వెళ్లేలా చేయాలి. కేంద్రీయ విద్యాల యాల నమూనాతో అన్ని వసతులతో కూడిన ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేసిఈ సమస్యకు శాశ్వత పరిష్కారం వైపు పయనించాలి.




రేగట్టే వెంకట్ రెడ్డి
సామాజిక కార్యకర్త
9949865516

జాతి మెచ్చిన నేతలు


ప్రకృతి రంగుల పులకింతలు





రాష్ట్రానికి చెందిన ఆరుగురు నేతన్నలు 2016 సంవత్సరం జాతీయ అవార్డులకు ఎంపికయ్యారు. యాదాద్రి జిల్లా, సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన గజం శ్రీనివాస్, చేరిపల్లి భువనారుషి, నల్లగొండ జిల్లా చండూరుకు చెందిన గంజి యాదగిరి, చిలుకూరు శ్రీనివాస్, కొండగట్ల భావనా రుషి, యాదాద్రి భువనగిరి జిల్లా , కొయ్యలగూడెంకు చెందిన జెల్ల వెంకటేశంలకు ఈ అరుదైన గౌరవం దక్కింది.



జెల్ల వెంకటేశం


గంజి యాదగిరి


చిలుకూరి శ్రీనివాస్


కందగట్ల భావనా రుషి


చెరుపల్లి భావనా రుషి


పాండిచ్చేరి గవర్నర్ ఆశా పాండేతో గజం శ్రీనివాస్

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తెలంగాణ చేనేత వస్త్రానికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన చేనేత కళాకారుడు జెల్లా వెంకటేశంను కేంద్ర చేనేత మంత్రిత్వ శాఖ సంత్ కబీర్ 2016 పురస్కారానికి ఎంపిక చేసింది. టై అండ్ డై విధానంలో ఇక్కత్ చీరలు, తేలియా రుమాల్ వస్త్రాన్ని నేయడంలో నేర్పరిగా పేరుగాంచిన వెంకటేశంకు కేంద్ర చేనేత మంత్రిత్వ శాఖ ప్రకటించిన జాతీయ స్థాయి అవార్డు దక్కింది. సంత్ కబీర్ పురస్కారానికి ఎంపికిన చేసిన ఐదుగురిలో వెంకటేశం ఒకరు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి మరో సారి జాతీయ అవార్డుల పంట పండింది. ఇక్కడి చేనేత కార్మికుల కళానైపుణ్యాన్ని చూసి భారత ప్రభుత్వం ఈ గ్రామానికి రెండు జాతీయ అవార్డులను ప్రకటించింది. ఇదివరకే రెండు పద్మశ్రీ అవార్డులు అందుకున్న పుట్టపాకకు చెందిన చెరుపల్లి భావణాఋషి, గజం శ్రీనివాస్ చేనేత జాతీయ అవార్డు2016కు ఎంపికై ఈ మారుమూల గ్రామాన్ని మరోసారి జాతీయ స్థాయిలో నిలబెట్టారు. రసాయనాలతో కాకుండా ప్రకృతి సిద్ధమైన రంగులతో రకరకాల చీరలు తయారుచేస్తాడు. తేలియా రుమాల్, డబుల్ ఇక్కత్ చీర తయారు చేశాడు. ఈ చీరను జాతీయ స్థాయి అవార్డు కోసం ప్రతి పాదనకు పంపాడు. దీన్ని పరిశీలించిన కేంద్ర చేనేత జౌళి మంత్రిత్వ శాఖ 2016 సంవత్సరానికి గాను జాతీయ అవార్డుకు ఎంపిక చేసింది. పుట్టపాకకు చెందిన భావణాఋషి గత 40 సంవత్సరాలుగా చేనేత వృత్తిని నమ్ముకుని వస్త్రాలు నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 3వ తరగతి చదువుకున్న ఇతను పదవ ఏటనుంచే చేనేత ప్రారంభించాడు. ఈయన రూపొందించిన డిజైన్లకు గాను 2013 సంవత్సరం హ్యాండ్లూం అవార్డుకు ఎంపికయ్యాడు. డబుల్ ఇక్కత్‌లో గుజరాత్ నవరత్నాల డిజైన్‌లో చీరను రూపొందించినందుకు గాను 2016 నేషనల్ మెరిట్ అవార్డుకు ఎంపికయ్యారు. ఇలాంటి చీరలు నేయడానికి కనీసం మూడు నెలలైనా పడుతుందన్నారు. గుమ్మడి, తేలియా, బ్లాక్ ప్రకృతి రంగులు వాడి తయారు చేశాడు.

– మనతెలంగాణ ప్రతినిధులు/ సంస్థాన్ నారాయణ్‌పురం, చౌటుప్పల్, చండూరు.

Dwaraka (Everyday NewsPapers)

సమర్ధంగా పని చేస్తున్న భద్రతా దళాలు

అహ్మదాబాద్: సైన్యం, ఇతర భద్రతా దళాలు తమ విధులను సమర్థంగా, బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నాయని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. భారతీయులు సిగ్గుతో తలవంచుకునే పరిస్థితిని అవి ఎప్పుడూ తీసుకురావన్నారు. శనివారం తెల్లవారు జామున సుంజువాన్ ఆర్మీ క్యాంప్‌పై ఉగ్రవాదుల దాడి చేయడంతో ఇద్దరు జూనియర్ కమాండ్ అధికారులు(జెసిఒలు) మృతి చెందగా, కల్నల్ ర్యాంక్ ఆఫీసర్, సైనికుడి కుమార్తె సహా నలుగురు గాయపడటంపై రాజ్‌నాథ్‌సింగ్ విచారం వ్యక్తం చేశారు. అంతకు ముందు ఆయన జమ్మూకశ్మీర్ పోలీస్ చీఫ్‌తో మాట్లాడారు.

హల్వా తిని ఐదుగురు మృతి

జైపూర్: హల్వా తిని ఐదుగురు మృతి చెందిన విషాద ఘటన రాజస్థాన్‌లోని భటేలాలో చోటు చేసుకుంది. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం.. శనివారంనాడు రాజస్థాన్ లోని భిల్వారా జిల్లా భటేలాకు చెందిన ఓ ఇంటికి అతిథులు రావడంతో వారి కోసం ఆ కుటుంబీకులు ప్రత్యేకంగా హల్వా చేసి వడ్డించారు. అయితే హల్వా తిన్న కొద్దిసేపటికే వారందరూ అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఐదుగురు చనిపోయారని, మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. కాగా, ఫుడ్ పాయిజన్ కారణంగానే ఈ విషాదం చోటు చేసుకున్నట్లు వైద్యులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



'పన్ను వసూళ్ల'పై మున్సిపల్ నజర్

- సిబ్బందికి కాలపరిమితితో కూడిన టార్గెట్
- బకాయిదార్లకు రెడ్ నోటీసులు

మన తెలంగాణ/హైదరాబాద్: ఆస్తిపన్నులను నిర్దిష్ట గడువులోగా వసూలు చేసేలా పురపాలక సిబ్బందికి ఉన్నతాధికారులు టార్గెట్ విధించారు. బిల్ కలెక్టర్లు తమ పరిధిలో 500 మంది డిఫాల్టర్స్‌ను గుర్తించి, మార్చి చివరినాటికి వసూలు చేయాలని మున్సిపల్ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నది. పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులను అందజేయడంతో పన్నులను చెల్లించేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని మున్సిపల్ శాఖ స్థానిక పురపాలికలను ఆదేశించింది. సిబ్బందికి ఏరియాలను కేటాయించి, పన్నుల వసూళ్ల టార్గెట్‌ను విధించాలని స్పష్టం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2017–18) ఇప్పటి వరకు గృహ సముదాయాల నుంచి 53 శాతం, ప్రభుత్వ సముదాయాల నుంచి 12 శాతం పన్నులు మాత్రమే వసూలయ్యాయి. కాగా ప్రభుత్వ ఆస్తుల నుంచి బకాయిలపై కూడా మున్సిపల్ శాఖ దృష్టి సారించింది. స్థానిక మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి ఆయా విభాగాల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, పన్నులు వసూలయ్యేలా చూడాలని సూచించింది. 2017–18 ఆర్థిక సంవత్సర గడువు కేవలం 48రోజులే ఉండడం మరో వైపు పన్ను వసూళ్లలో కొన్ని పురపాలికలు వెనకబడడంతో మున్సిపల్ శాఖ ఇక ఆస్తిపన్ను వసూలు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. బిల్లు



కలెక్టర్‌తో సహా ప్రత్యేక సిబ్బందితో 'పన్ను వసూలు బృందాన్ని' ఏర్పాటు చేయాలని, వారికి నిర్ణీత కాలపరిమితి విధించి రోజువారి కలెక్షన్‌ను చేసేలా పర్య వేక్షించాలని మున్సిపల్ శాఖ స్థానిక కమిషనర్లను ఆదేశించినట్టు తెలిసింది. ప్రతి రోజూ వసూలవుతున్న పన్నుల వివరాలను కూడా ఎప్పటికప్పుడు మున్సిపల్ శాఖకు సమాచారం అందించాలని స్పష్టం చేసింది.

గృహసముదాయం
డిమాండ్:రూ.349.51 కోట్లు
కలెక్షన్ : రూ.174.కోట్లు
వసూలైన శాతం: 53.05

ప్రభుత్వ సముదాయం
డిమాండ్ :రూ. 84.64 కోట్లు
కలెక్షన్ : రూ.10.02 కోట్లు
వసూలైన శాతం: 12.06

ట్రేడ్ లైసెన్స్ ఫీజు
డిమాండ్ : రూ. 7.87 కోట్లు
కలెక్షన్ : రూ.2.15 కోట్లు
వసూలైన శాతం: 27.31

అడ్వర్‌టైజ్‌మెంట్ పన్ను
డిమాండ్ : రూ. 3.95 కోట్లు
కలెక్షన్ : రూ.58 లక్షలు
వసూలైన శాతం: 14.7

ఇందులో భాగంగానే క్షేత్ర స్థాయిలో బకాయిదారులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేయడంతోపాటు వారి ఫోన్లకు సంక్షిప్తసమాచారాన్ని(ఎస్ఎంఎస్) పంపించనున్నారు.

బకాయిదార్లకు రెడ్ నోటీసులు

పన్నుబకాయిదార్లను గుర్తించి వారికి రెడ్ నోటీసులను జారీ చేసి, వారి నుంచి కూడా పన్నులను వసూలయ్యేలా అధికారులు ప్రత్యే క చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. ప్రధానంగా ప్రతి బిల్ కలెక్టర్ పరిధిలో 500 మంది డిఫాల్టర్స్‌ను గుర్తించి, వారి ప్రస్తుత అసెస్‌మెంట్లను కూడా పరిశీలించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. మార్చి 31లోపు వంద శాతం పన్నులను వసూలు చేయాలని మున్సిపల్ శాఖ లక్ష్యంగా పెట్టుకున్నది. దీనికి సంబంధించిన ప్రక్రియను వేగం చేయడంతో పాటు ఇక నుంచి పన్నులపై ఎప్పటికప్పుడు సమీక్షించనున్నారు.

రైతు విమోచన కమిషన్ ఏర్పాటేది?

రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు ఆగ్రహం

మన తెలంగాణ/ హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర స్థాయి రైతు రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేస్తామన్న హామీని అమలు చేయకపోడంపై కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో స్పష్టం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. బిజెపి నాయకుడు ఇంద్రసేనారెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మి లతో కూడిన డివిజ న్ బెంచ్ విచారణ జరిపింది. ప్రభుత్వ హామీ గడువు గత ఏడాది నవంబర్ 21తో ముగిసిందని, రైతులు ఆత్మహత్యల నివారణకు కమిషన్ ఏర్పాటు చేయలేదని తిరిగి ఆయన హైకోర్టు దృష్టికి తెచ్చారు. సీఎస్‌కు నోటీసులు ఇచ్చిన హైకోర్టు విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

'పెద్దచెరువు'లో నిర్మాణాలు వద్దు

మన తెలంగాణ/ హైదరాబాద్: శేరిలింగంపల్లి మండలం నల్లగండ్ల గ్రామంలోని పెద్దచెరువు పరిధిలో అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మాణాలు చేయరాదని, ఈ మేరకు చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి విజయలక్ష్మి లతో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. చెరువు ఆవరణలో అపర్ణ అనే నిర్మాణ కంపెనీ గోడ నిర్మాణం చేస్తోందని, రోడ్డు వేస్తోందని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందంటూ 'జనం కోసం' అనే స్వచ్ఛంద సంస్థ వేసిన కేసులో బెంచ్ మధ్యంతర ఆదేశాలిచ్చి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

ఒకే రోజు 28వేల కేసులు పరిష్కారం

మన తెలంగాణ/ హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జరిపిన లోక్ అదాలత్‌లో ఒక్కరోజే ఏకంగా 28 వేల కేసులు పరిష్కారమయ్యాయి. జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో శనివారం లోక్ అదాలత్‌లను నిర్వహించారు. వాటిలో 28 వేల కేసుల పరిష్కారం ద్వారా 58.4కోట్ల రూపాయల మేరకు కక్షిదారులకు పరిహార చెల్లింపులు జరిగాయి. తెలంగాణలో పది వేల కేసులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 18వేల కేసులు పరిష్కారమయ్యాయి.తెలంగాణలో రూ.26 కోట్లు,ఎపిలో 32 కోట్ల రూపాయలకుపైగా పరిహార చెల్లింపులకు కేసుల్లోని ఇరుపక్షాల వారు అంగీకరించారు. హైకోర్టు లీగల్ సర్వీసెస్ అథారిటీ నిర్వహించినలోక్‌అదాలత్‌లో 500 కేసుల ద్వారా 6.5కోట్లు పరిహార చెల్లింపులకు ఆమోదం లభించింది. ఈ మేరకు ఎపి/తెలంగాణ రాష్ట్రాల లీగల్ సర్వీసెస్ అథారిటీల సభ్య కార్యదర్శులు రాంబాబు, మధుసూదన్‌రావు వేరువేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

హరిత అభివృద్ధిపై గజ్వేల్‌లో అధ్యయనం



మన తెలంగాణ / హైదరాబాద్ : ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్,గౌరారం, సింగాయపల్లి, కోమటిబండ, సంగాపూర్ ప్రాంతాల్లో అటవీ శాఖ కార్యదర్శి, ముఖ్య చీఫ్ అటవీ కన్జర్వేటర్, సిఎం ఓఎస్‌డి ప్రియాంకా వర్గీస్, పర్యాటక కమిషనర్ తదితరులు శనివారం అధ్యయనం జరిపారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లో పచ్చదనంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను,హరితహారం పనులను, అటవీ పునరుద్ధరణ చర్యలను, అవెన్యూ ప్లాంటేషన్‌ను, అర్బన్ పార్కుల ఏర్పాటును పరిశీలించారు. నగర జీవనం నుంచి పచ్చదనం ఉపశమనం ఇస్తుందని, వీలైనన్ని ఎక్కువ చెట్లు పెంచాలన్న సిఎం కోరిక మేరకు అధ్యయనం నిర్వహిస్తున్నట్లు ముఖ్య చీఫ్ కన్జర్వేటర్ పి.కె. ఝా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హరితహారం తర్వాత సహజసిద్ధంగా పెరుగుతున్న మొక్కలతో పాటు రైతులు గచ్చకాయ తదితర రకాల మొక్కలను కూడా పెంచుతున్నారని, అటవీ భూముల్లోకి సామాన్య ప్రజలు ప్రవేశించకుండా అటవీ సిబ్బంది కందకాలు తవ్వడం మంచి ఫలితాలను ఇస్తున్నాయని పేర్కొన్నారు.


రాష్ట్రానికి అన్యాయం కనబడలేదా?

మన తెలంగాణ/హైదరాబాద్ : ఎపికి ప్రత్యేక హోదాను ఇవ్వాలని పార్లమెంట్‌లో అడిగిన ఎంపి కవితకు తెలంగాణ జరుగుతున్న అన్యాయం కనబడలేదా అని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపి వి.హనుమంతురావు ప్రశ్నించారు. రాష్ట్రంలో బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ,ఐఐఎం ,హైకోర్టు విభజన ఆమెకు గుర్తు రాలేదా అని అన్నారు. గాంధీ భవన్‌లో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ లో వసూల్ చేసున్నట్యాక్స్‌లను మిషన్ భగీరథకు ఖర్చుచేస్తున్నారన్నారు. కార్పొరేట్‌లను డమ్మీలు చేసి మంత్రి కెటిఆర్ గుత్తాధిపత్యం చేస్తున్నారని విమర్శించారు.

పక్షవాతం రోగులకూ పెన్షన్ : కాంగ్రెస్

మన తెలంగాణ/హైదరాబాద్: బోదకాల బారిన పడినవారికి ఇచ్చినట్లుగానే పక్షవాతం వచ్చిన వారికి కూడా పెన్షన్ ఇవ్వాలని కాంగ్రెస్ సిఎల్‌పి ఉపనేత టి. జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. పక్షవాతాన్ని కూడా అంగవైకల్యం కింద పరిగణించాలని కోరారు. హైదరాబాద్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బోదకాలు ఉన్నవారికి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెన్షన్ ఇచ్చిందని గుర్తు చేవారు. 50 ఏళ్ళు పైబడిన బీడీ కార్మికులకు కూడా జీవనభృతి అందించాలన్నారు.సాధారణ పెన్షన్ రూ.2 వేలకు, వికలాంగుల పెన్షన్ రూ.3 వేలకు పెంచాలన్నారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చాక ప్రస్తుతం ఉన్న పెన్షలన్నింటినీ డబుల్ చేస్తామన్నారు.

ఎపికి చెప్పింది చేస్తున్నాం : హరిబాబు



అమరావతి: దుగరాజపట్నం పోర్టుపై అభ్యంతరాలున్నాయని,ప్రత్యామ్నాయం చూపాలని ఎపికి కేంద్రం సూచించిందని బిజెపి ఎంపి హరిబాబు తెలిపారు. పోలవరానికి రూ.4వేల కోట్లను విడుదల చేశామని, వీలైనంత త్వరగా ప్రాజెక్టును పూర్తి చేస్తామని కేంద్రమంత్రి గడ్కరీ చెప్పారన్నారు. కడప స్టీల్‌ప్లాంట్ విషయంలో త్వరలో కేంద్ర నిర్ణయం తీసుకుంటుందని వివరించారు. కేంద్ర పథకాలతోనే ఎపిలో 24 గంటల విద్యుత్ సరఫరా జరుగుతుందని వెల్లడించారు. ఉజ్వల్ పథకాన్ని ఎపి పూర్తి స్థాయిలో వినియోగించుకుంటుందని, ఎపిలో దూరదర్శన్ ఏర్పాటుకు కేంద్రం చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. ఎపిలో రూ.లక్ష కోట్లతో రహదారుల నిర్మాణం చేపట్టిందని కేంద్రాన్ని ప్రశంసించారు. రాజకీయ లాభం కోసం బురదజలడం మంచి పద్ధతి కాదని ఎపి ప్రాంతీయ పార్టీలపై మండిపడ్డారు. రూ.7వేల కోట్లతో కాకినాడపుదుచ్చేరి అంతర్గత జలరవాణ నిర్మాణం జరుగుతోందని, రాజధాని నిర్మాణానికి నిధులు ఇస్తున్నామని వివరించారు. స్వాతంత్ర్యం తరువాత మూడున్నరేళ్లలో ఏ రాష్ట్రానికి ఎవరూ ఇవ్వనన్ని నిధుల్ని ఎపికి ఇచ్చామని స్పష్టం చేశారు.

పాస్‌బుక్‌ల ముద్రణకు కేబినెట్ ఆమోదం



సెక్యూరిటీ ప్రెస్‌తో కుదిరిన ఒప్పందం

మన తెలంగాణ / హైదరాబాద్ : రైతులకు అందించే పట్టాదారు పాసు పుస్తకాల ముద్రణా బాధ్యతను కేంద్ర ప్రభుత్వానికి చెందిన సెంట్రల్ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌కు నామినేషన్ పద్ధతిపైన రాష్ట్ర ప్రభుత్వం అప్పజెప్పింది. ఈ నెల 7వ తేదీన ఈ మేరకు సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ జనరల్ మేనేజర్‌కు, తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్‌కు మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. సుమారు 72 లక్షల పాస్‌బుక్‌లను 18 భద్రతా ప్రమాణాలతో నెల రోజుల వ్యవధిలో ముద్రించడానికి ప్రైవేటు ముద్రణా సంస్థలేవీ ముందుకు రాకపోవడంతో మంత్రులందరి అభిప్రాయాలను సేకరించిన రాష్ట్ర ప్రభుత్వం నామినేషన్ పద్ధతిపైన ఒక్కో పాస్‌బుక్‌ను రూ. 200 ఖర్చుతో ముద్రించేందుకు సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌ను ఎంపిక చేసింది. ఒకవేళ సకాలంలో పాస్‌బుక్‌లను ముద్రించి ఇవ్వకపోతే ఒక్కో పుస్తకానికి పది రూపాయల చొప్పున జరీమానా విధించేలా ఒప్పందంలో రాష్ట్ర ప్రభుత్వం నిబంధన పెట్టింది. హైదరాబాద్‌తో పాటు నాసిక్, నోయిడాలలో సైతం పాస్‌బుక్‌ల ముద్రణ జరుగుతుందని సమాచారం. ఇప్పటికే ముద్రణ ప్రారంభమైందని, నిర్దిష్ట గడువుకల్లా పూర్తి స్థాయిలో పాస్‌బుక్‌ల ముద్రణ పూర్తవుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ముదురు ఆకుపచ్చ రంగులో పాస్‌బుక్‌ల కవర్‌పేజీ ఉండాలని ఇప్పటికే సిఎం ఆదేశించడంతో ఆ తరహాలోనే ముద్రణ జరుగుతోందని అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. 'రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం', 'రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం', 'బంగారు తెలంగాణ మన స్వప్నం, మన లక్ష్యం' తదితరాలు ఈ పాస్‌బుక్ లోపలి, చివరి కవర్‌పేజీలపై దర్శనమిస్తాయి. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా పొలాలకు నీరు పారుతుండడం, రైతు ఎరువులను చల్లుతుండడం, నాగలిపట్టి దున్నుతుండడం, చిరునవ్వులు చిందించే మహిళా రైతులు తదితర ఛాయాచిత్రాలు ఈ పాస్‌బుక్ లోపలి పేజీల్లో కనిపిస్తాయి. ఇక కవర్‌పేజీ తిప్పగానే కనిపించే కుడివైపు మొదటి పేజీలో తెలంగాణ ప్రభుత్వ రాజముద్ర, దానికి ఇరువైపులా కాకతీయ కళాతోరణం, చార్మినార్‌లు, కిందిభాగంలో తెలంగాణ ప్రభుత్వం (తెలుగు, ఆంగ్లం) అక్షరాలు ఉంటాయి. రెండవ నెంబరు పేజీలో రైతుకు సంబంధించిన పేరు, తండ్రి/భర్త పేరు, 13 అంకెలతో కూడిన పాస్‌బుక్ నెంబరు, బార్‌కోడ్, క్యు ఆర్ కోడ్, జిల్లా, డివిజన్, మండలం, గ్రామం, రైతు ఫోటో, చిరునామా, తహసీల్దారు డిజిటల్ సంతకం, డిజిటల్ స్టాంపు ఉంటాయి. మూడవ పేజీలో కులం,



ఆధార్ నెంబరు, మొబైల్ ఫోన్ నెంబరు, బ్యాంకు ఖాతా వివరాలు, ఐఎఫ్ఎస్‌సి కోడ్, పట్టదారు సంతకం లేదా వేలిముద్ర ఉంటాయి. ఆ తర్వాతి పేజీల్లో భూ కమతం సర్వే నెంబర్, విస్తీర్ణం తదితర వివరాలు, భౌగోళిక హద్దులతో కూడిన మ్యాప్, లావాదేవీలకు సంబంధించి ఆరు కాలమ్‌లతో కూడిన పట్టికల వివరాలు ఉంటాయి. చివరి పేజీలో రైతులకు ఐదు సూచనలు ఉంటాయి. మరోవైపున పలు గ్రామ పంచాయతీల్లో రైతులకు విఆర్ఓలు సూచనలు చేస్తూ పాత పాస్‌బుక్, బ్యాంకు ఖాతా, ఆధార్ నెంబరు, మొబైల్ నెంబర్ తదితర వివరాలను జిరాక్సు కాపీలను నిర్దిష్ట గడువులోగా సమర్పించాలని స్పష్టత ఇచ్చారు. ఒక్కో గ్రామ పంచాయతీ ఒక్కో రకమైన గడువు విధించింది.

బైకులపై ఏడు దేశాల యాత్రకు తెలంగాణ ఆడబిడ్డలు

మంత్రి అజ్మీరా చందూలాల్

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ పర్యాటక రంగ ప్రాధాన్యతను ప్రపంచానికి చాటి చెప్పడానికి నలుగురు తెలంగాణ ఆడబిడ్డలు బైకులపై సాహసయాత్రకు బయలుదేరనున్నారు. ఫిబ్రవరి 11న ఉదయం 7గం.లకు పర్యాటక భవన్ నుంచి సాహస యాత్ర ప్రారంభమవుతుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ తెలిపారు. ఈ సాహసయాత్ర గురించి మంత్రి మీడియాతో మాట్లాడుతూ నలుగురు మహిళలు మోటారు బైక్‌లపై 7 దేశాలలో 17 వేల కి.మీ. మేర రోడ్డు మార్గం ద్వారా పర్యటిస్తారని, భారతదేశంతో పాటు తెలంగాణ పర్యాటక రంగ విశేషాలను ప్రచారం చేస్తారని తెలిపారు. ఈ సాహస యాత్రకు జయ భారతి నాయకత్వం వహిస్తారని, బృందంలో ప్రియ, శాంతి, శిల్ప ఉన్నారని తెలిపారు. బంగ్లాదేశ్, మయన్మార్, థాయ్‌లాండ్, లావోస్ కంబోడియా, వియత్నాందేశాలలో పర్యటించి తెలంగాణ పర్యాటక రంగాన్ని చాటిచెప్పడం జరుగుతుందన్నారు. ఈ యాత్రలో భాగంగా 19 యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్లు, 35 యునెస్కో సైట్లను సందర్శిస్తారన్నారు. సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడూతూ నలుగురు మహిళలు 50 రోజులలో 7 దేశాలలో దాదాపు 17 వేల కిలోమీటర్లు పర్యటించి



వస్తారన్నారు. వీరికి 400 సిసి బైకులను బజాజ్ ఆటో కంపెనీ స్పాన్సర్ చేసిందన్నారు. వీరు పర్యటించే రాష్ట్రాలు, దేశాల అధికారులతో సంప్రదించి వీరికి అవసరమైన సౌకర్యాలు కల్పించే విధంగా పర్యాటక శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. తెలంగాణ పర్యాటక రంగానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తేవడానికి ఈ యాత్ర ఉపయోగపడుతుం దన్నా రు. జై భారతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో షీ టీంలను ఏర్పాటు చేసి మహిళలకు భరోసా కల్పించారని, దీనిని ఆదర్శంగా తీసుకొని తెలంగాణ ఆడబిడ్డలు సాహసయాత్రలో పాల్గొంటున్నారన్నారు.

భగీరథ పనుల పూర్తికి ముమ్మర కసరత్తు

కాంట్రక్టర్లకు పెరిగిన చెల్లింపులు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు ముమ్మర కసరత్తు జరుగుతోంది. ఇందులో భాగంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు చెల్లింపులను పెంచారు. ఈ ఏడాదికల్లా ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలని భావిస్తున్న ప్రభుత్వం గ్రామాల్లో అంతర్గత నీటి సరఫరా వ్యవస్థ పనుల్లో జాప్యం జరుగుతుండడంపై అసంతృప్తితో ఉంది. భగీరథ నీటిని పైపుల ద్వారా గ్రామం వరకు తీసుకువెళ్లే పనులు దాదాపుగా పూర్తయినా నల్లాల ద్వారా ఇంటింటికీ సరఫరా చేసే పైప్‌లైన్ నిర్మాణం, పదివేల లీటర్ల నుంచి 20వేల లీటర్ల కెపాసిటి గల ఓహెచ్ఎస్ఆర్ (ఓవర్‌హెడ్ స్టోరేజి) ట్యాంకుల నిర్మాణాలే పూర్తికాలేదు. సుమారు పదివేల ట్యాంకుల నిర్మాణం ఇంకా పూర్తికాలేదని అధికారుల అధ్యయనంలో తేలింది. ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తున్న ప్రస్తుత విధానం కారణంగా పనులను పూర్తి చేయడానికి డబ్బులు కటకట ఏర్పడిందని అధికారులు అంచనాకు వచ్చారు. పెద్దగా ఆర్థిక స్థోమత లేని కాంట్రాక్టర్లు ఈ పనులను చేపట్టడం, ప్రభుత్వం చేస్తున్న చెల్లింపులు సరిపోకపోవడం తదితర కారణాలతో జాప్యం జరుగుతోంది. నిధుల విడుదలను పెంచాలని కాంట్రాక్టర్లు అధికారుల దృష్టికి గతంలోనే తీసుకువచ్చారు. పరిశీలించిన చీఫ్ ఇంజనీర్ల కమిటి చెల్లింపుల విధానంలో మార్పులను సూచిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వీటిని పరిశీలించిన ప్రభుత్వం పనుల దశను బట్టి ఇప్పటి వరకు కాంట్రాక్టర్లకు ఇస్తున్న చెల్లింపుల మొత్తాన్ని పెంచింది.

కితాబులు

(మొదటిపేజీ తరువాయి)

భగీరథ ద్వారా తెలంగాణలో ఈ లోపం ఉండదని అరవింద్ మెహతా వ్యాఖ్యానించారు. స్వచ్ఛమైన నీటితో చాలా రోగాలు దూరమవుతాయని, ప్రజలకు వైద్య ఖర్చులు బాగా తగ్గుతాయన్నారు. మిషన్ భగీరథ లక్ష్యాన్ని, దీనికి అవుతున్న వ్యయాన్ని, అమలు తీరు తదితరాలపై ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, గజ్వేల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి హన్మంతరావు, ఇంజనీర్ ఇన్ చీఫ్ సురేందర్‌రెడడి, గజ్వేల్ మున్సిపల్ ఛైర్మన్ భాస్కర్ తదితరులు ఆర్థిక సంఘం బృందానికి వివరించారు. కొత్త రాష్ట్రమే అయినా వివిధ ప్రాజెక్టులకు ప్రభుత్వం చేస్తున్న ఖర్చును, అమలవుతున్న తీరును ఆర్థిక సంఘం అధికారులు పరిశీలించి ఆశ్చర్యం వ్యక్తం చేశారని రాష్ట్ర అధికారులు పేర్కొన్నారు. దేశ ప్రాజెక్టుల చరిత్రలోనే కాళేశ్వరం ఒక నమూనా అవుతుందని, అతి తక్కువ కాలంలో అద్భుతమైన తీరులో పనులు జరుగుతుండడం అనేక రాష్ట్రాలకు ఆదర్శనీయమని అరవింద్ మెహతా వ్యాఖ్యానించారని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో 11వ ప్యాకేజీ పరిధిలోని రంగనాయకిసాగర్, అన్నారం బ్యారేజీలను ఈ బృందం సందర్శించింది. రంగనాయకి సాగర్‌లోని టన్నెల్ పనులను చూసి మెహతా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు అవసరమవుతున్న నిధులు, సాగులోకి వచ్చే భూవిస్తీర్ణం, ఎత్తిపోతల ద్వారా నీటిని తరలించడానికి వాడుతున్న భారీ స్థాయి మోటార్ పంపులు తదితరాలన్నింటినీ అధికారులు ఈ బృందానికి వివరించారు. షెడ్యూలు ప్రకారం ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి రేయింబవళ్ళు అధికారులు పనిచేస్తున్నారని, నిత్యం సిఎం కెసిఆర్ పర్యవేక్షిస్తూ ఉన్నారని, మంత్రి హరీష్‌రావు క్షేత్రస్థాయిలో అధికారులను పరుగులు పెట్టిస్తున్నారని ఈ బృందానికి సిఎస్ ఎస్‌కె జోషి వివరించారు. ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా మీడియాతో మాట్లాడుతూ, సమగ్ర గ్రామీణ అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టులు ఎంతో దోహదపడతాయని, వ్యవసాయాభివృద్ధి ఊపందుకుంటుందని అన్నారు. భారీ స్థాయి నిర్మాణాలతో పాటు రూపొందించిన డిజైన్, వేగంగా పనులు జరగడం తమను ప్రత్యేకంగా ఆకట్టుకుందని వ్యాఖ్యానించారు. వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయడాన్ని ప్రభుత్వం సవాలుగా తీసుకున్నట్లు మూడు షిఫ్టుల్లో నిరంతరాయంగా జరుగుతున్న పనుల్ని చూసిన తర్వాత అర్థమవుతోందన్నారు. రానున్న వానాకాలంకల్లా ప్రాజెక్టు మొదటి మైలురాయి దాటుతుందని అధికారులు చెప్తున్నారని, ఇప్పుడు జరుగుతున్న పనుల్ని చూస్తుంటే తనకు ఎలాంటి సందేహం కలగడంలేదని జాతీయ అభివృద్ధిలో కాళేశ్వరం భాగస్వామి అవుతుందని అన్నారు. ఇప్పటివరకు ఎన్నో ప్రాజెక్టులను చూశామని, కానీ ఇంత భారీ ప్రాజెక్టు తక్కువ సమయంలో అంచనాలకు అందనంత వేగంగా జరుగుతుండడం ఇక్కడే చూస్తున్నామని, ప్రభుత్వం ఎంత ఎక్కువ శ్రద్ధ పెట్టిందో అర్థమవుతోందని మెహతా సంతృప్తి వ్యక్తం చేశారని ప్రభుత్వ ప్రకటన వివరించింది. మూడున్నరేళ్ళ క్రితమే రాష్ట్రం ఏర్పడినా ఈ భారీ ప్రాజెక్టుకు ఆర్థిక వనరులు సమకూర్చుకోవడం సాహసమేనని, అయినా మిగులు బడ్జెట్‌లో ఉండడం విశేషమంటూ వ్యాఖ్యానించారని పేర్కొనింది. సిద్దిపేట, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఇంజనీర్లు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో జరుగుతున్న ప్రాజెక్టు పనులను, భూసేకరణకు సంబంధించిన అంశాలను ఆర్థిక సంఘం బృందానికి వివరించారు.

రూ.7లక్షల బంగారు ఆభరణాల చోరీ

(మొదటిపేజీ తరువాయి)

వేసుకుంటే దొంగలు దోచుకుంటారని ముందు జాగ్రత్త పడిన ఆమెను దురదృష్టం వెంటాడిందనే చెప్పాలి. వివరాల్లోకి వెళితే ... బిఎన్‌రెడ్డి నగర్‌లో నివాసం ఉండే నర్మద (44) వనపర్తిలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి శనివారం బయలుదేరింది. బిఎన్.రెడ్డి నగర్ నుంచి ఆరాంఘర్ వరకు వచ్చిన ఆమె ఆరాంఘర్ కూడలిలోని బస్టాప్‌లో వనపర్తి బస్సుకోసం చూస్తూ షెల్టర్‌లోని బెంచీపై కూర్చుంది. కొద్ది సేపటి తరువాత ఆమె తన బ్యాగును తడుముకోగా కత్తిరించి కనిపించింది. దాంతో కంగారుగా బ్యాగులో పెట్టిన 20 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఒక్కసారిగా షాక్ గురైన బాధితురాలు లబోదిబోమంటూ తాను కూర్చున్న బస్సుషెల్టర్ పరిసరాల్లో వెతికింది. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం సంఘటన వెలుగు చూసిన పరిధి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కావడంతో రాజేంద్రనగర్ పోలీసులకు కేసును అప్పగించారు. రాజేంద్రనగర్ పోలీసులు బాధితురాలు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు నమోదు చేసుకుని సీసీ టీవీ ఫుటేజీలను సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌టిసి బస్సు, టిప్పర్ ఢీ

(మొదటిపేజీ తరువాయి)

తీయడానికి ప్రయత్నించినా రాలేదు. దీంతో మూడు గంటలపాటు నరకయాతన అనుభవించాడు. చివరికి పోలీసులు జెసిబి సహాయంతో బయటికి తీసి సంగారెడ్డి ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. మూడు గంటలపాటు రోడ్డుపై ప్రమాదానికి గురైన వాహనాలు ఉండడంతో ఆరు కీలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. పుల్‌కల్, జోగిపేట ఎస్‌ఐలు సత్యనారయణ,పరమేశ్వర్‌గౌడ్‌లు ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాలను సాగనంపారు. ఆర్‌టిసి అధికారులు అక్కడకు చేరుకొని సంఘటన వివారాలు తెలుసుకున్నారు.బస్సు డ్రైవర్ గౌస్ పరారీలో ఉన్నాడు.ఈ సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

అసైన్డ్ ఆర్డినెన్స్?

(మొదటిపేజీ తరువాయి)

మారాయి. పేదలతో పాటు కొద్దిమంది ధనిక రైతులు కూడా ఈ భూముల్ని కొన్నారు. తాజాగా భూ రికార్డుల ప్రక్షాలన తర్వాత లెక్కలోకి వచ్చిన అసైన్డ్ భూములపై దృష్టి సారించిన ప్రభుత్వం వీటిని తిరిగి భూమిలేని నిరు పేదలకు కేటాయించాలని భావించింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధి, మండల పరిధిలో ఇలాంటి భూముల లెక్కలపై అధికారులు ఆరా తీస్తున్నారు. లబ్ధిదారులకు బదులుగా కొన్నవారెవరు (థర్డ్ పార్టీ) అనే వివరాలపై దృష్టి సారించారు. ప్రభు త్వ లెక్కలకు, క్షేత్రస్థాయిలో ఉన్న లెక్కలకు మధ్య తేడాలు ఉన్నందున వీలైనంత త్వరలో ఒక స్పష్టత రావాలని అధికారులను ప్రభు త్వం ఆదేశించింది. ఈ స్పష్టత వచ్చిన తర్వాత అసైన్డ్ భూములను తిరిగి పేదలకు కేటాయించడానికి 2014 జూన్ 2ను కటాఫ్ తేదీగా పెట్టాలని భావిస్తోంది. గరిష్టంగా ఐదు ఎకరాలకు మించి అసైన్డ్ భూములు ఒకరి పేరునే ఉండరాదన్న అంశంపై కూడా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఆర్డినెన్సు ద్వారా అసైన్డ్ భూములను తిరిగి అర్హులైనవారికే కేటాయించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు తెలిసింది.

Dwaraka (Everyday NewsPapers)



కేంద్ర పథకాలను ప్రజలకు అందేలా చూడాలి : బండారు దత్తాత్రేయ

మన తెలంగాణ/పెద్దపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలని, కార్యకర్తలు అంకిత భావంతో పని చేయాలని మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని నందనగార్డెన్‌లో శనివారంపెద్దపల్లి పార్లమెంట్ నిమోజకవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామగ్రామన పార్టీ సేవలను విస్తరింప చేయాలని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శక్తి కేంద్రాలను బలోపేతం చేయాలని రానున్న ఎన్నికలకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా ద్వారా పార్టీ సేవలు విస్తృతం చేయాలని తెలిపారు. రాజకీయం అంటే కేవలం పార్టీ కాదు సమాజసేవ అని అన్నారు. ప్రజలకు అత్యవసర సమయంలో ఉపయోగపడే విధంగా ఐదు లక్షల ప్రమద బీమా పథకం ప్రవేశపెట్టిందని, రోడ్లకు 42వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. బిజెపి ఒక వంశం , ఒక కుటుంబ పార్టీ కాదని, కార్యకర్తల పార్టీ అని అన్నారు. 70వేల కోట్ల రూపాయలు మహిళ సంఘాలకు ఇచ్చారని,3లక్షలకోట్లు ముద్ర లోన్లు బ్యాంకుల ద్వారా అందజేశారని అన్నారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణ రెడ్డి, బల్మూరి వనిత, ఎస్.కుమార్, జిల్లా అధ్యక్షుడు కాశిపేట లింగయ్య దిలీప్‌కుమార్, లింగారెడ్డి, మల్లారెడ్డి, మీస అర్జున్‌రావు పాల్గొన్నారు.

కందుల నిల్వలపై విచారణ

మన తెలంగాణ/ హాలియా: అనుముల మండలం హజారీగూడెం గ్రామంలోని ఓబులినేని సత్యనారాయణ ఇంట్లో నిల్వ ఉంచిన 206 క్వింటాళ్ల కందుల నిల్వలలపై రెవిన్యూ, మార్కెటింగ్ అధికారులు శనివారం విచారణ నిర్వహించారు. అయితే సదరు రైతుకు ఉన్న పొలంలో 100 క్వింటాళ్ల కంది దిగుమతి వచ్చిందని, మిగిలిన 106 క్వింటాళ్ల ఇతర రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు సదరు రైతు అధికారులకు తెలిపారు ఇదే విషయంపై 100 క్వింటాళ్ల కందులను రైతు పండించినట్లు వీఆర్‌వో ధృవీకరించారు. కందులతో పాటు గోదాంలో ఉన్న 500 బస్తాల ధాన్యం సీజ్ చేసి తదుపరి విచారణ నిమిత్తం పై అధికారులకు నివేదించినున్నట్లు అనముల మండల తహసీల్దార్ కె.సి. ప్రమీల తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మన తెలంగాణ/ హాలియా : నూతన వాహనానికి రిజిస్ట్రేషన్ చేయించుకొని సంతోషంగా తిరిగి ఇంటికి వెళ్తూ చింతల నర్సింహ (30) మృత్యువాత పడిన సంఘటన అనుముల ద్వారకాపురి కాలనీ వద్ద శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ మండలం కొండభీమనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కాచారం గ్రామానికి చెందిన చింతల నర్సింహా నూతన వాహనానికి మిర్యాలగూడలో రిజిస్ట్రేషన్ చేసుకొని తిరిగి తన గ్రామానికి వెళ్తుండగా తాండూరు నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న లారీ డ్రైవర్ అజాగ్రత్తతో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య చింతల అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్.ఐ. రాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాగర్ కమలా నెహ్రూ ఆస్పత్రికి తరలించారు.

పవర్‌ప్లాంట్‌లో కార్మికుడి మృతి

మన తెలంగాణ/గణపురం: గణపురం మండలం చెల్పూరు శివారు కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్‌లో శనివారం మధ్యాహ్నం విధులు నిర్వహిస్తూ కోల్ క్రషర్‌లో పడి సిలువేరు రవీందర్(40) అనే కార్మికుడు మృతిచెందాడు. రవీందర్ 8సంవత్సరాల నుంచి పవర్ ప్లాంట్‌లో కాంట్రాక్టు లేబర్‌గా పనిచేస్తున్నాడు. రవీందర్‌కు భార్య, ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

గల్ఫ్ ఏజెంట్ మోసంతో ఒకరి ఆత్మహత్యాయత్నం

మన తెలంగాణ/ నిజామాబాద్ రూరల్: గల్ఫ్ ఏజెంట్ చేసిన మోసానికి దుబాయ్ వెళ్లి చిత్రహింసలు అనుభవించి స్వగ్రామానికి తిరిగి వచ్చిన ఓ వ్యక్తి అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నిజామాబాద్ మండలం ముత్తకుంట గ్రామ పంచాయతీ లింగితండాలో శనివారం చోటుచేసుకుంది. నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధి ముత్తకుంట గ్రామ పంచాయతీ లింగితాండకు చెందిన కేతావత్ లాల్‌సింగ్ బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్దామని గల్ఫ్ ఏజెంట్ మోస్ర సంతోష్‌ను సంప్రదించాడు. 65వేల రూ. తీసుకొని 5 నెలల క్రితం పంపించాడు. దుబాయ్ వెళ్లిన తర్వాత పనిలో చేరిన నుండి జీతం ఇవ్వలేదు. దుబాయ్ షేక్‌కు జీతం అడుగగా మీ ఏజెంట్‌కు పంపుతున్నామని చిత్రహింసలు పెట్టారు. కంపెనీలో పని అయిపోయిందని ఇండియాకు తిరిగి ఈ నెల 2న వచ్చాడని తెలిపారు. చేసిన అప్పులు తీర్చలేక మనస్థాపం చెందిన లాల్‌సింగ్ శుక్రవారం అర్ధరాత్రి పురుగుల మందు సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

మన తెలంగాణ/సిరిసిల్ల: ఆర్థిక సమస్యలతో శనివారం ఉదయం తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన యువరైతు గొర్రె గోపాల్ యాదవ్ (35)ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గోపాల్‌యాదవ్ తన సొంత అర ఎకరం భూమితో పాటు మరో మూడెకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తి పంట వేశాడు. పంట దిగుబడి అధికంగా రావాలని అప్పులు చేసి పెట్టుబడి పెట్టాడు. అయితే ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోగా అప్పులు పెరిగిపోయాయి. మరో వైపు శనివారం రోజు కులం చిట్టీ డబ్బు లు 40వేల రూపాయలు చెల్లించాల్సి ఉండగా తన వద్ద డబ్బు లేకపోవడంతో ఆత్మన్యూనతకు లోనై పొలం సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పా ల్పడ్డాడు. మృతునికి భార్య పద్మ, కుమారుడు చందు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు.

వికలాంగుల సంక్షేమానికి పెద్ద పీట



మన తెలంగాణ/కరీంనగర్ టౌన్ : వికలాంగుల సంక్షేమం కోసం టిఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని కె. వాసుదేవ రెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాలను ఏర్పాటు చేస్తామని ఉద్యోగాల్లో రోస్ట్ పాయింట్ విధానాన్ని తీసుకువస్తామని అన్నారు. పాలసీ మ్యాటర్‌లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. బడ్జెట్ లో కాకుండా అదనంగా మూడు కోట్లు విడుదల చేసిందన్నారు. దీన్ని ద్వారా రుణాలు, వివాహ ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నామన్నారు. వికలాంగులకు త్వరల్లో 500 మోటర్ సైకిళ్లు సిఎం చేతుల మీదుగా అందిస్తామన్నారు. తెలంగాణ అభివృద్ధిలో వికలాంగుల సైతం భాగస్వాములు అవుతున్నారన్నారు. స్థలాన్ని పరిశీలించి నగరంలో బిల్డింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఉన్నటువంటి స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ సిద్దం వేణు, టిఆర్ఎస్ నేత పొన్నం అనిల్ గౌడ్, జక్కం సంపత్, కార్తీక్, సంజీవ్, అంజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: ఇద్దరు మృతి

మన తెలంగాణ/బాలానగర్ : ఎదురెదురుగా వస్తూ ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికి అక్కడే మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మండల పరిధిలోని జీడిగుట్ట తాండాకు చెందిన ఖేతావత్ తూల్చ నాయక్(55) బైక్‌పై బాలానగర్‌వైపు వెళుతుండగా ఒడిషా రాష్ట్రానికి చెందిన మోతిలాల్ (45) బాలానగర్ నుండి ఉడిత్యాల వైపు బైక్‌పై వెళుతున్న క్రమంలో రెండు వాహనాలు పెద్దాయపల్లి గ్రామ శివారులోని సబ్ స్టేషన్ వద్ద ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు అక్కడికి అక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మోతిలాల్ ఉడిత్యాల గ్రామ శివారులోని పరమేశ్వర పౌల్ట్రీఫాంలో లేబర్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. సంఘటన స్థలాన్ని ఎఎస్ఐ గోపాల్, సిబ్బంది చేరుకొని వాహనాలను స్టేషన్‌కు తరలించడంతో పాటు మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్టు వారు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభకు పట్టాభిషేకం





- బాసర ట్రిపుల్‌ఐటిలో ఘనంగా స్నాతకోత్సవం
- 500 మందికి ల్యాప్‌టాప్‌ల పంపిణీ
- వచ్చే ఏడాది నుంచి డ్రెస్‌కోడ్ తొలగిస్తాం
- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

మన తెలంగాణ/బాసర : ట్రిపుల్ ఐటి విద్యార్థులు మరింత శ్రమించి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశానికి, రాష్ట్రానికి మంచిపేరు తేవాలని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. శనివారం బాసర ట్రిపుల్‌ఐటి మూడవ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వారు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కష్టపడి చదివి ట్రిపుల్‌ఐటికి ఎంపికయ్యారన్నారు. వారి విజ్ఞానానికి మెరుగులద్దేందుకు కళాశాల సిబ్బంది కృషి చేయాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి మరింత కష్ట పడాలన్నారు. కార్పొరేట్ కళాశాల కంటే ప్రభుత్వ కళాశాలలో చదివిన వారే ముందు వరసలో ఉన్నారని రుజువు చేయాలన్నారు. రాష్ట్రంలోని వర్శిటీలకు రూ.420 కోట్ల ప్రత్యేక నిధులు విడుదల చేశామన్నారు. వర్సిటీలో ఖాళీ ఫ్యాకల్టీలకు త్వరలో భర్తీ చేస్తామని తెలిపారు.రాష్ట్రంలో మొత్తం 4లక్ష46వేల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు విద్యను అభ్యసించగా ప్రసుత్త సంవత్సరం 1.55 లక్షల మంది పరీక్షలు రాయగా 1.20లక్షల మంది విద్యార్థులు ఉత్తీర్ణులవుతున్నారని, ఫ్యాకల్టీ కోసం మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వారి ఉద్యోగాలకు భద్రత కల్పిస్తామన్నారు. ముంబై, ఖానాపూర్ యూనివర్సిటీల్లో ఇప్పటికే డ్రస్ కోడ్‌ను మార్చగా ట్రిపుల్‌ఐటిలో కూడా వచ్చే సంవత్సరం నుంచి డ్రస్ కోడ్‌లో మార్పులు తెస్తామన్నారు.ఈసందర్భంగా కళాశాలలో నూతన అకడమిక్ బ్లాక్‌ను ప్రారంభించారు.2017–18 సంవత్సరానికి 500 మంది విద్యార్థులకు నూతన ల్యాప్‌టాప్‌లను అందజేశారు.అనంతరం 2011 సంవత్సరం బ్యాచ్ కు చెందిన 150 మంది ఇంజినీరింగ్, సివిల్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. వీరిలో బానోతు అవీన్ కుమార్ కెమిస్ట్రీ విభాగంలో కళాశాల టాపర్‌గా నిలవగా, ఎండి హైదర్ బాబా (సివిల్), మంద రజిని (పిహెచ్‌సి), ప్రవీణ్‌కుమార్ (ఇసిఇ), శేఖర్ (మెకానిక్), ప్రేమ్‌కుమార్ (ఎంఎంఇ), మెహరా భాను(ఇసిఇ)లకు బంగారు పతకాలను అందజేశారు. విసి అశోక్‌కుమార్, ఐఐటి డైరెక్టర్ యుబి దేశాయ్ చేతులమీదుగా విద్యార్థులకు పట్టాలు అందజేశారు.

మన తెలంగాణ 'ఎఫెక్ట్'

రైతులకు కష్టం కలిగించొద్దు

మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి: మార్కెట్ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నల్లగొండలో కంది రైతుల రాస్తారోకోపై '**మన తెలంగాణ**'లో 'మార్కెట్‌కు పోటెత్తిన కందులు' అనే శీర్షికన శనివారం వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. వ్యవసాయ శాఖ నల్లగొండ సంయుక్త సంచాలకులు నర్సింహారావు మార్కెట్ అధికారులపై మండిపడ్డారు. ఉదయం 6 గంటలకు మార్కెట్‌కు వచ్చిన రైతులను 11.30 గంటల వరకు మార్కెట్ లోకి ఎందుకు రానివ్వలేదంటూ ఫోన్‌చేసి ఆగ్రహం వెలిబుచ్చారు. మార్కెట్‌లో రైతులకు రక్షిత మంచినీరును సరఫరా చేయాలని అన్నారు. వాహనాల్లో తీసుకొచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసేంత వరకు రైతులకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. 10 క్వింటాళ్లకంటే ఎక్కువ పంటకు విజిలెన్స్ అధికారులచే దర్యాప్తు చేసి నిర్ధారణ అయిన తరువాతే విక్రయించిన పంటకు రైతుల ఖాతాలో నగదు జమచేయాలని సూచించారు.రైతులకు ఎట్టి పరిస్థితుల్లోనూ కష్టం కలుగకుండా చూడాలని, రేపటి నుండి కొనుగోలు కేంద్రాన్ని ఉదయం 6 గంటలకే ప్రారంభించాలని, కందుల కొనుగోళ్లు సకాలంలో జరిగేటట్లు చూడాలని ఆదేశించారు.ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు మార్కెట్‌కు వచ్చిన వాహనాలకే అనుమతివ్వాలని ఆదేశించారు.

మద్దతు ధర కోసం రైతు పక్షాన పోరాటం



- 2019లో అధికారంలోకి రాగానే ఒకే దఫాలో 2లక్షల వరకు రుణమాఫీ
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి

మన తెలంగాణ/మోర్తాడ్ :(నిజామాబాద్ జిల్లా): ఎర్రజొన్న, పసుపు పంటలకు మద్దతు ధర కల్పించే వరకు రైతుల పక్షాన పోరాటం చేస్తామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మోర్తాడ్ మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు అర్మూర్, బాల్కొండ ప్రాంత రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భట్టి విక్రమార్కకు రైతులు, నాయకులు బైక్‌ర్యాలీతో అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రైతులను ఉద్దేశించి బట్టి విక్రమార్క మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. 2019లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఎర్రజొన్నలకు క్వింటాల్‌కు రూ.3000, పసుపు క్వింటాల్‌కు రూ.10,000గ మద్దతు ధర కల్పిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్ర రైతాంగానికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఒకే దఫాలో రెండు లక్షల వరకు రుణాలు మాఫీ చేస్తామని తెలిపారు. యంత్ర లక్ష్మీ ఫథకంలో అర్హులైన లబ్ధిదారులకు చెందాల్సిన ట్రాకర్టలు తెరాస నాయకులకు,కార్యకర్తలకే కట్టాబెట్టారని, సాక్ష్యాధారాలతో నిరూపిస్తామని సవాల్ చేశారు.

రైతుల బైఠాయింపు రాస్తారోకో

అనంతరం రైతులు, నాయకులు జాతీయ రహదారిపై బైఠాయించారు ప్రభుత్వం వెంటనే మద్దతు కల్పిస్తామని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు సురేష్‌రెడ్డి, ఇరవత్రి అనిల్, తాహెర్‌బిన్ హందన్, నర్సారెడ్డి, రాజారాం యాదవ్ రోడ్డుపై బైఠాయించడంతో ఉద్రికత్త చోటు చేసుకుంది. పోలీసులు నాయకులు, రైతులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్ తరలించారు. కోదండరెడ్డి, ఎమ్మెల్సీ ఆకుల లలిత, డిసిసి ప్రధాన కార్యదర్శి మహేష్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలంలోని స్థానిక ప్రజాప్రతినిధులు తెలంగాణ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను ఆయన నివాసంలో శనివారం కలిశారు. త్వరలో రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తున్నట్టు కోదండరామ్ ప్రకటించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

రైతుల పట్ల ప్రభుత్వం మొసలి కన్నీరు

జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం

మన తెలంగాణ / లింగాల ఘణపురం : రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తుందని జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శనివారం మండలంలోని మానిక్యపూర్ శివారు ఏనబావిలో సిఎస్ఐస్ సంస్థ వ్యవసాయ క్షేత్రాన్ని ప్రొఫెసర్ కోదండరాం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు సేంద్రియ సాగు జీవన విధానాలవల్ల రైతు ఆదాయం స్థితి గతులు మెరుగుపడుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించ లేకపోవడం నిరుద్యోగ యువతపై ప్రభుత్వం చిత్త శుద్ధి లేదని అన్నారు. రాష్ట్రంలో పసుపు రైతులకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయడంలో డిపిఆర్ నివేదికను కేంద్రానికి పంపడంలో రైతాంగానికి తీరని నష్టం జరిగిందన్నారు. రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్ పారిశ్రామిక కారిడారుగా మారుస్తానని కెటిఆర్ ఊదరు గొట్టే ప్రసంగాలతో విదేశ పర్యటనల పేరుతో ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాడే తప్ప యువతకు ఒరగ పెట్టిందేమీ లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిజెఎసి ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ అంబాటి శ్రీనివాస్, టిజెఎసి జిల్లా చైర్మన్ ఆకుల సతీష్, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు కోదం కుమార్‌స్వామి పాల్గొన్నారు.

పైసలు ముడితేనే శవపరీక్షలు


తాండూరు జిల్లా ఆస్పత్రిలో దందా



మన తెలంగాణ/తాండూరు: రంగారెడ్డి జిల్లా తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి వైద్యులు శవాలను పీక్కు తింటు న్నారు. శవపరీక్ష కోసం బంధువుల వద్ద రూ.2వేలు చెల్లిస్తేనే శవపరీక్షలు చేస్తున్నారు.దీంతో బందులువు ఆందోళన చెందుతున్నారు. పట్టణ శివారులో శనివారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. చేవెళ్ల నియోజక వర్గం ఆలూరు గ్రామానికి చెంది నవీన్ మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే సదరు వైద్యుడు రూ.2 వేలు చెల్లిస్తేనే శవపరీక్ష నిర్వహిస్తామని తేల్చి చెప్పాడు. దీంతో మృతుని బంధువులు రూ.2వేలు చెల్లించారు. అనంతరం ఆ వైద్యుడు మృతదేహానికి శవపరీక్షలు చేశాడు. జిల్లా ఆస్పత్రి వైద్యుల నిర్వాకం రోజురోజుకు పెరిగిపోతున్నా, ఈ విషయాలను మంత్రి మహేందర్ రెడ్డి దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేకుండాపోతోంది. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్న తాండూరు పట్టణంలో 200 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని భావించిన 2007లో అప్పటి ప్రభుత్వం రూ.7 కోట్లతో జిల్లా స్థాయి ఆస్పత్రిని ఏర్పాటు చేసింది. జిల్లా ఆస్పత్రికి ప్రస్తుతం రోజు వెయ్యి మంది వరకు రోగులు ఓపిలో వస్తుంటారు.పేదలకు ఖరీదైన ప్రభుత్వ వైద్యం అందుతుందని భావించారు.అయితె ఇక్కడ పనిచేస్తున్న వైద్యుల నిర్వాకంతో పేదలకు సర్కారి వైద్యం అందడం లేదు.మరో పక్క ప్రసవం కోసం వస్తున్న గర్భిణీల వద్ద రూ.4 నుండి 5 వేల వరకు వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇవ్వని వారికి వైద్య సేవలందించడం లేదు. జిల్లా ఆస్పత్రి సలహా సంఘ చైర్మన్‌గా జెడ్పి చైర్మన్ సునీతా మహేందర్‌రెడ్డి ఉన్నారు. సలహా సంఘం సమావేశంలో ఈ విషయాన్ని చెప్పిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో జిల్లా ఆస్పత్రికి వస్తున్న రోగులు సరైన వైద్యసేవలందక భయపడుతున్నారు. ఇప్పటికైనా మంత్రి మహేందర్‌రెడ్డి , జెడ్పి చైర్మన్ సునితారెడ్డి స్పందించి జిల్లా ఆస్పత్రి వైద్యులపై చర్యలు తీసుకుని పేదలకు సర్కారీ వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

మేడారం సందర్శించిన అంబాసిడర్ నేహాల్

మన తెలంగాణ/ధర్మారం : భారీ నీటి పారుదల శాఖ బ్రాండ్ అంబాసిడర్ చిన్నారి నేహాల్ శనివారం మేడారం సందర్శించారు. గత రెండు రోజులుగా ప్రాజెక్టులను సందర్శిస్తున్న నేహాల్ మేడారంలోని ఆరవ ప్యాకేజీలో అండర్ టన్నెల్, సర్జిపుల్, సబ్‌స్టేషన్ల నిర్మాణం, పంపుహౌస్‌లను తిలకించారు. ఇఇ నూనె శ్రీధర్ ఆధ్వర్యంలో డిఇ నర్సింగరావు ప్రాజెక్టు వివరాలను వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన 6, 7, 8 ప్యాకేజిలలో జరుగుతున్న వివరాలు అడిగి తెలుసుకున్న నేహాల్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ సందర్భంగా నేహాల్ తన అనుభవాల్ని వివరించారు. సిఎం కెసిఆర్, మంత్రి హరీష్ రావు కృషి, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది శ్లాఘనీయమని అన్నారు. తనను అంబాసిడర్‌గా నియమించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతన్నానన్నారు. ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించి తన వంతు కృషి చేస్తానని నేహాల్ స్పష్టం చేశారు.



పోలీస్ వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు తెచ్చాం



- ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్


మన తెలంగాణ/కరీంనగర్ క్రైం : పోలీస్ వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం నగర శివార్లలోని లోయర్ మానేరు రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన లేక్‌పోలీస్ అవుట్‌పోస్ట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థ పేద ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని నేరాలు జరిగిన సమయంలో పోలీసులు త్వరిత గతిన స్పందిస్తున్నారని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌ల నిర్వహణకు రూ.50 వేల నుండి రూ.75వేల వరకు నిధులు ఇచ్చిన సర్కార్ ఏదీ లేదన్నారు. 2018వ సంవత్సరం ఆగస్టు నాటికి లోయర్ మానేరు రిజర్వాయర్ నీటితో నిండుకుండను తలపిస్తుందన్నారు. 50 టిఎంసిల నీటిని ఎల్‌ఎండిలో నిల్వ ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లోయర్ మానేరు రిజర్వాయర్ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ టూరిస్టులకు మెరుగైన భద్రతను కల్పిస్తున్నామని లేక్ పోలీసు వచ్చాక మానేరు తీరంలో మహిళలు ధైర్యంగా సంచరించగలుగుతున్నారని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తుల ఉమ, స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, కరీంనగర్ మున్సిపల్ కమీషనర్ శశాంక, డిసిపి శ్రీనివాస్, ఎసిపిలు పి.వెంకటరమణ, టి.ఉషారాణి పాల్గొన్నారు.

శ్రీశైలానికి 200 స్పెషల్ బస్సులు



మన తెలంగాణ/హైదరాబాద్/ గోషామహల్: మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆర్‌టిసి జంట నగరాల నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి 200 స్పెషల్ బస్సులు నడపనుంది. ఈ మేరకు ఎంజీబీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో స్పెషల్ బస్సులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 11 నుండి 14 వరకు గౌలిగూడ మహా త్మాగాంధీ బస్ స్టేషన్, జూబ్లీ బస్‌స్టేషన్, దిల్‌సుఖ్‌నగర్ బస్‌స్టేషన్, ఐఎస్ సదన్, కెపిహెచ్‌బి పాయింట్ల నుంచి స్పెషల్ బస్సులను నడపనున్నట్లు రంగారెడ్డి రీజియన్ రీజనల్ మేనేజర్ ఇ.యాదగిరి తెలిపారు. 11వ తేదీన 28 స్పెషల్ బస్సులు, 12వ తేదీన 85 బస్సులను, 13వ తే దీన 72 బస్సులను, 14వ తేదీన 15 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించినట్లు తెలిపారు. భక్తుల రద్దీ అధికమైతే మరిన్ని స్పెషల్ బస్సులను నడిపేందుకు ఆర్టీ సీ సిద్ధంగా ఉందన్నారు. ప్రయాణికులు www,tsrtconline.in ద్వారా కాని, సమీప ఎటిబి ఏజెంట్ల వద్ద కాని, ఎంజిబిఎస్, జెబి ఎస్, దిల్‌సుఖ్‌నగర్ బస్‌స్టేషన్‌లో కానీ రిజర్వు చేసుకోవాలని కోరారు. కాగా శ్రీశైలంకు నడపనున్న స్పెషల్ సర్వీసుల్లో వజ్ర (ఏసీ) ఛార్జీని రూ. 575, సూపర్ లగ్జరీ రూ. 425, డీలక్స్ రూ.375, ఎక్స్‌ప్రెస్ రూ.330లుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. సమావేశంలో డివిజనల్ మేనేజర్ సి శ్రీదేవి, పికెట్ డిపో మేనేజర్ ఎస్.ప్రణీత, అసిస్టెంట్ మేనేజర్‌లు సుధ, స్వామి పాల్గొన్నారు.

శివప్రసాద్ బాధ్యతల స్వీకరణ



మన తెలంగాణ/ హైదరాబాద్: ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ నూతన కమిషనర్‌గా డాక్టర్ బి.శివప్రసాద్ శని వారం బాధ్యతలను స్వీకరించారు. నిన్నటి వరకు ఆ స్థానంలో పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను వాకాటి కరుణ నిర్వర్తించారు. ప్రభుత్వ ఆదేశాల మేర కు ఆమె శనివారం బాధ్యతల నుంచి తప్పుకోవడంతో నూతన కమి షనర్‌గా శివప్రసాద్ బాధ్యతలను స్వీకరించారు. కింగ్ కోఠిలోని జిల్లా ఆసుప్రతిలో మెడికల్ సూపరిం టెండెంట్‌గా బాధ్యతలను నిర్వర్తిస్తున్న శివప్రసాద్‌కు ఈ బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి శనివారం ప్రకటనను విడుదల చేశారు.

Dwaraka (Everyday NewsPapers)

దర్శకత్వ ప్రతిభకు ప్రశంసలు

బద్రి, పోకిరి వంటి సూపర్‌హిట్ చిత్రాలను అందించిన పూరి జగన్నాథ్‌కు గత కొంతకాలంగా ఒక్క హిట్ కూడా లేకుండా పోయింది. బాలకృష్ణతో చేసిన 'పైసా వసూల్' భారీ అంచనాలను అందుకోలేక ప్రేక్షకులను నిరాశపరిచింది. ఇప్పుడు తన తనయుడు ఆకాష్‌ను హీరోగా పరిచయం చేస్తూ పూరి ఒక సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇండియాకు చెందిన అబ్బాయి పాకిస్తాన్‌కు చెందిన ఒక అమ్మాయికి మధ్య సాగే అందమైన ప్రేమ కథతో 'మెహబూబా' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమాలో హీరో ఆకాష్‌కు జంటగా నేహా శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈమధ్య విడుదలైన సినిమా టీజర్ చూశాక పూరి అద్భుతమైన దర్శకత్వ ప్రతిభకు అందరి నుంచి ప్రశంసలు వస్తున్నాయి. అసలు పూరీయేనా తీసింది అన్నవిధంగా ఉందని అంటున్నారు. ఇండియా, పాక్ బోర్డర్ బ్యాక్‌గ్రౌండ్‌లో ఆశ్చర్యపరిచే గ్రాఫిక్స్‌వర్క్‌తో ఒక్కసారిగా సినిమాపై అంచనాలను ఆకాశానికి ఎత్తేశాడు. త్వరలో షూటింగ్ పూర్తి చేసుకోబోతున్న ఈ ప్రేమ కావ్యం ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఇక పూరి తీసిన 33 సినిమాలు ఒక ఎత్తయితే... టీజర్‌తో 'మెహబూబా' సినిమా మరొక ఎత్తు అన్నట్లుగా ఉంది. ఒక్కసారిగా పూరీలో ఇంత మార్పు ఎలా వచ్చింది. హీరోగా తన కొడుకు మొదటి సినిమా అని దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి తీస్తున్నాడా అని అంటున్నారు.





రామ్‌చరణ్

కొత్త లుక్ కోసం ప్రయత్నంలో...

సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రంగస్థలం'లో రామ్‌చరణ్ సరికొత్త లుక్‌తో దర్శనమిస్తున్నాడు. పల్లెటూరి అబ్బాయిలా గడ్డం లుక్‌తో అభిమానులను అలరిస్తున్నాడు. అయితే ఈ చిత్రం చివరి దశకు వచ్చేసింది. కొద్దిరోజుల్లో ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ పనులతో దర్శకుడు సుకుమార్ బిజీ కానున్నాడు. ఈ చిత్రం తర్వాత చరణ్ తన లుక్‌ను పూర్తిగా మార్చే ప్రయత్నంలో ఉన్నాడు. చిట్టిబాబు నుంచి స్టైలిష్ బాబుగా మారాల్సిన సమయం వచ్చేసింది. చరణ్ తన నెక్స్ట మూవీని బోయపాటి శ్రీను దర్శకత్వంలో చేయబోతున్నాడు. ఈ సినిమా మరికొన్ని రోజుల్లో ప్రారంభంకానుంది. ఈనెల 16 నుంచి బోయపాటి ఈ చిత్రం షూటింగ్‌ను ప్రారంభించనున్నాడని తెలిసింది. అయితే ఈ సినిమాలో మాస్ క్యారెక్టర్ కోసం చరణ్ ముంబయ్ హెయిర్ స్టయిలిస్టలతో చర్చలు జరుపుతున్నాడు. తన కొత్త సినిమాలో సరికొత్త లుక్ కోసం వారితో మాట్లాడుతున్నాడు. మొన్నటివరకు షూటింగ్‌లో బిజీగా ఉన్న చరణ్ ఒక వారం గ్యాప్ తీసుకోనున్నాడట. అదే సమయంలో తన లుక్‌కు సంబంధించిన వర్క్‌ను పూర్తిచేసి కొత్త సినిమాను ప్రారంభించాలని అనుకుంటున్నాడు.

హృదయాన్ని హత్తుకునే తొలిప్రేమ

సినిమా కథ: వైజాగ్ నుండి హైదరాబాద్‌కు వెళ్తున్న సమయంలో ఆదిత్య (వరుణ్‌తేజ్)కు వర్ష (రాశిఖన్నా) పరిచయమవుతుంది. ఆదిత్య తొలి చూపులోనే వర్షను ప్రేమిస్తాడు. కొన్ని కారణాల వల్ల ఆది ఆమెను మిస్ అవుతాడు. ఆతర్వాత అతను చదివే ఇంజనీరింగ్ కాలేజీలోనే వర్ష చేరడంతో మళ్లీ వీరి ప్రేమ ప్రయాణం మొదలవుతుంది. వర్ష కూడా ఆదిని ప్రేమిస్తుంది. కానీ కాలేజీలో జరిగిన ఒక సంఘటన వల్ల ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోతారు. ఆ బాధతో ఆది తనకిష్టమైన జీవితాన్ని వెతుక్కుంటూ లండన్ వెళ్లిపోతాడు. మళ్లీ ఆరు సంవత్సరాల తర్వాత ఆదికి వర్ష కనిపిస్తుంది. అసలు ఆది, వర్ష ఎందుకు విడిపోయారు? ఆరేళ్ల తర్వాత కలిసిన వీరు ఒకరినొకరు అర్థం చేసుకొని మళ్లీ ఎలా ఒకటయ్యారు? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

విశ్లేషణ: దర్శకుడు వెంకీ అట్లూరి రచయితగా పూర్తి స్థాయిలో సక్సెస్ కావడంతో 'తొలిప్రేమ' అనే కాన్సెప్ట్ బాగా పండింది. ఈతరం యువతలో పుట్టే తొలిప్రేమ ఎలా ఉంటుంది, చిన్న చిన్న కారణాల వల్ల ప్రేమ ఎందుకు విఫలమవుతుంది, విడిపోయిన తర్వాత కూడా ప్రేమికులను ఆ తొలిప్రేమ ఎలా కలుపుతుంది అనే అంశాలను చాలా ఆసక్తిగా చూపించారు. వరుణ్‌తేజ్, రాశిఖన్నాల సహజమైన నటన సినిమాను ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యేలా చేసింది. ముఖ్యంగా వయసు పెరిగి ప్రేమ విలువ తెలిసి తొలిప్రేమను నిలబెట్టుకోవడం కోసం వాళ్లు పడే తపన ఆకట్టుకుంటుంది. వరుణ్‌తేజ్ పాత్రలో అతని అహం, ప్రేమకు మధ్య జరిగే ఘర్షణ, దీనికి సంబంధించిన సన్నివేశాలు అలరిస్తాయి. సినిమా ఆరంభం నుండి చివరి వరకు వరుణ్, రాశీల మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా పండి ప్రేక్షకులకు కొత్త అనుభూతి కలుగుతుంది. ఈ ప్రేమ కథకు తోడు ఫస్టాఫ్‌లో కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో విద్యుల్లేఖ రామన్ కామెడీ ట్రాక్, సెకండాఫ్‌లో హైపర్ ఆది, ప్రియదర్శి, నరేష్‌ల హాస్యం కడుపుబ్బ నవ్విస్తాయి. లండన్‌లో జరిగే ద్వితీయార్థం మొత్తం అందంగా, ఆకర్షణీయంగా కొనసాగుతుంది. ప్రేమ తాలూకు డైలాగులు, సందర్భానుసారంగా వచ్చే పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమా స్థాయిని మరింతగా పెంచాయి. మంచి కథనం, సంభాషణలు, బలమైన ముఖ్య పాత్రలు, భావోద్వేగ సన్నివేశాలతో వెంకీ అట్లూరి దర్శకుడిగా తన టాలెంట్‌ను నిరూపించుకున్నాడు. ప్రేమ కథను అందంగా, ఆకర్షణీయంగా తెరకెక్కించి ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. వరుణ్‌తేజ్ కెరీర్‌లో 'తొలిప్రేమ' చిత్రం మరచిపోలేని విజయాన్ని అందిస్తునడంలో ఏమాత్రం సందేహం లేదు.

రివ్యూ



'తొలిప్రేమ'లో వరుణ్‌తేజ్, రాశిఖన్నా

వరుణ్‌తేజ్, రాశిఖన్నా హీరోహీరోయిన్లుగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పి పతాకంపై తెరకెక్కిన చిత్రం 'తొలిప్రేమ'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం శనివారం విడుదలైంది.

వాటిని చూసి గర్వపడను

వరుస హిట్లతో మంచి జోరుమీదున్నాడు యంగ్ స్టార్ నాని. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ఎంసిఎ' కథ, కథనాలు రొటీన్‌గానే ఉన్నప్పటికీ అతనికి ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్ కారణంగా ఈ చిత్రానికి మంచి కలెక్షన్లు వచ్చాయి. ప్రస్తుతం యంగ్ హీరోల్లో స్టార్ ఇమేజ్‌ను దక్కించుకున్న నాని వరుస విజయాలతో ప్రేక్షకులను అలరిస్తున్నాడు. ఈ విజయాలపై నాని స్పందిస్తూ... ''ఎంతటి హీరో అయినా సినిమా విడుదలయ్యే శుక్రవారం రోజు తన టాలెంట్‌ను ఎప్పటికప్పుడు నిరూపించుకోవాల్సి ఉంటుంది. విజయాన్ని తలకు ఎక్కించుకోకపోవడం వల్లనే వరుసగా హిట్లను అందుకోగలుగుతున్నారు. సరైన దిశగా లక్ష్యాన్ని నిర్దేశించుకొని కెరీర్‌లో ముందుకు సాగుతున్నాను. నన్ను అభిమానించే ప్రేక్షకులను చూసినప్పుడల్లా నా బాధ్యత మరింత పెరిగిందని భావిస్తాను. నాకొచ్చే కాంప్లిమెంట్లను ఎంజాయ్ చేస్తూనే వాటిని చూసి గర్వపడను''అని చెప్పాడు. ప్రస్తుతం నాని డ్యుయల్ రోల్ చేస్తూ 'కృష్ణార్జున యుద్ధం' సినిమాలో నటిస్తున్నాడు. దీంతో పాటు భారీ తారాగణంతో 'అ..!' సినిమాను తన సొంత బ్యానర్‌పై నిర్మిస్తున్నాడు.



నాని



దిల్‌రాజు, శిరీష్, నందగోపాల్‌రాజు, పూర్ణ తదితరులు

'సుదర్శన్ 35 ఎంఎం'కు ఆలిండియా బెస్ట్ థియేటర్ అవార్డు

దిల్‌రాజు నిర్మించిన 'శతమానం భవతి' చిత్రం గత ఏడాది ఉత్తమ తెలుగు చిత్రంగా జాతీయ అవార్డును అందుకున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం హైదరాబాద్ ఆర్టీసి క్రాస్‌రోడ్డులోని సుదర్శన్ 35 ఎంఎం థియేటర్‌లో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో ఆడి ఘన విజయాన్ని అందుకుంది. అయితే చెన్నైలో జరిగిన బిగ్ సినీ ఎక్స్‌పో అవార్డ్స్ వేడుకలో సుదర్శన్ 35 ఎంఎం థియేటర్ 'ఆలిండియా బెస్ట్ థియేటర్ అవార్డు'ను అందుకుంది. ఈ సందర్భంగా 'శతమానం భవతి' నిర్మాత దిల్‌రాజు, సుదర్శన్ 35 ఎంఎం థియేటర్ యజమాని నందగోపాల్‌రాజులను హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు.

పెళ్లి తర్వాత కలిసి నటిస్తున్నారు

ఓ క్రేజీ కాంబినేషన్‌లో మళ్లీ సినిమా వస్తే చూడాలని అభిమానులు ఎప్పటినుంచో ఆశపడుతున్నారు. గత ఏడాది పెళ్లి చేసుకున్న నాగచైతన్య, సమంత కలయికలో మరో సినిమా రావాలని ప్రేక్షకులు, అక్కినేని అభిమానులు కోరుకుంటున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ఏమాయ చేసావె, ఆటోనగర్ సూర్య, మనం చిత్రాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. అయితే ఈ జంట పెళ్లి తర్వాత వీరి కాంబినేషన్‌లో రెండు, మూడు సినిమాలు వస్తున్నాయని ఆమధ్య కొన్ని రూమర్స్ కూడా వచ్చాయి. ముఖ్యంగా మారుతి దర్శకత్వంలోని 'శైలజరెడ్డి అల్లుడు'లో చైతన్య, సమంత నటిస్తున్నారనే టాక్ వచ్చింది. కానీ అది ఓకే కాలేదు. అయితే అభిమానుల కోరిక మరికొన్ని రోజుల్లో నెరవేరబోతోంది. రచయితగా ఎంతో గుర్తింపు తెచ్చుకున్న కోన వెంకట్ వారిద్దరిని జంటగా వెండితెరపై చూపించడానికి ప్రయత్నం చేస్తున్నాడు. గతంలో 'నిన్ను కోరి' సినిమాకు నిర్మాత డి.వి.వి.దానయ్యతో కలిసి కోన వెంకట్ సహ నిర్మాతగా వ్యవహరించాడు. ప్రస్తుతం ఆయన ఈ చిత్ర దర్శకుడు శివ నిర్వాణతో కలిసి ఓ చిత్రాన్ని నిర్మించబోతున్నాడు. ఈ చిత్రంలో నాగచైతన్య, సమంత జంటగా నటించబోతున్నారు. శివ నిర్వాణ చెప్పిన కథకు చైతన్య ఓకే చెప్పేశాడు. ఇక హీరోయిన్‌గా సమంత అయితే బాగుంటుందని కోన వెంకట్ ఆ కాంబినేషన్‌కు ఎట్టకేలకు సెట్ చేశాడు. ప్రీ ప్రొడక్షన్ పనులను తొందరగా పూర్తిచేసి సినిమాను ప్రారంభించాలని ఫిల్మ్‌మేకర్స్ భావిస్తున్నారు. ప్రస్తుతం నాగచైతన్య 'సవ్యసాచి' సినిమాతో బిజీగా ఉన్నాడు.



నాగచైతన్య, సమంత



క్యాథరిన్

ఆమె పెట్టిన డబ్బుతో విల్లా కట్టొచ్చు!

కొంత మంది తారలు చూడటానికి సింపుల్‌గా కనిపించినప్పటికీ రియల్‌లైఫ్‌లో విలాసవంతగా జీవిస్తారు. అలాంటి తారలు తెలుగు చిత్ర పరిశ్రమలో కొందరు ఉన్నారు. వారిలో హీరోయిన్ క్యాథరిన్ కూడా ఉంటుంది. 'పైసా' సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ హాట్ బ్యూటీ ఇటీవల హైదరాబాద్‌లో ఓ మంచి ఇల్లును కొనుగోలుచేసింది. అయితే ఆమె తన ఇంట్లో ఇంటీరియర్ కోసం పెద్దమొత్తంలో డబ్బును ఖర్చుచేస్తోందట. క్యాథరిన్ ఇంటీరియర్ కోసం ఖర్చు చేస్తున్న డబ్బుతో ఒక లగ్జరీ విల్లాను కట్టేసుకోవచ్చట. అయితే ఈ భామ సినిమాలతోనే కాకుండా వ్యాపారాల్లో కూడా పెట్టుబడులు పెట్టి బాగా సంపాదిస్తోందట. అందుకే డబ్బు విషయంలో ఏమాత్రం వెనుకాడకుండా తన ఇంట్లో విలాసవంతంగా ఉండేవిధంగా ఇంటీరియర్ డిజైనింగ్ చేయిస్తోందట. ఇక 'సరైనోడు' తర్వాత క్యాథరిన్‌కు హీరోయిన్‌గా మంచి క్రేజ్ వచ్చినప్పటికీ తెలుగులో పెద్ద హీరోలతో అవకాశాలు ఆశించినంతగా రావడం లేదు. ఈ భామ తమిళ్‌లో మంచి హిట్‌లను అందుకుంటూ దూసుకుపోతోంది. ప్రస్తుతం క్యాథరిన్ మరింత స్లిమ్‌గా మారి కొత్త లుక్‌తో సినిమాల్లో దర్శనమిస్తోంది.

13న 'విశ్వనట సామ్రాట్' బిరుదుతో కైకాలకు సన్మానం



పరుచూరి వెంకటేశ్వరరావు, టి.సుబ్బరామిరెడ్డి, పద్మిని కొల్హాపురి, మురళీమోహన్, కైకాల సత్యనారాయణ

ప్రముఖ నటుడు కైకాల సత్యనారాయణను 'విశ్వనట సామ్రాట్' బిరుదుతో సత్కరించబోతున్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈనెల 13న వైజాగ్ తీరంలో నిర్వహించే కోటి లింగాల ప్రతిష్టాపన సందర్భంగా సత్యనారాయణను ఈ బిరుదుతో ఘనంగా సన్మానించబోతున్నట్లు టి.సుబ్బరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ''ఎన్టీఆర్, ఏఎన్నార్, ఎస్వీఆర్‌ల సమకాలీకులు కైకాల సత్యనారాయణ. వెయ్యికి పైగా సినిమాల్లో నటించిన ఆయన ఎన్నో గొప్ప పాత్రల్లో జీవించి ప్రేక్షకులను అలరించారు. ఈనెల 13న మహాశివరాత్రిని పురస్కరించుకొని వైజాగ్‌లో నిర్వహించే కార్యక్రమంలో 'విశ్వనట సామ్రాట్' బిరుదును ప్రదానం చేసి కైకాల సత్యనారాయణను స్వర్ణకంకణంతో ఘనంగా సన్మానిస్తాము. భారీ ఎత్తున జరిగే ఈ వేడుకలో మోహన్‌బాబు, మురళీమోహన్ తదితరులు పాల్గొంటారు. ఇక ప్రముఖ బాలీవుడ్ దర్శక నిర్మాత యష్‌చోప్రాతో కలిసి నేను చాందినీ, లమ్‌హే వంటి గొప్ప చిత్రాలను నిర్మించాను. ఈ లెజెండరీ ఫిల్మ్‌మేకర్ గుర్తుగా యష్‌చోప్రా స్మారక జాతీయ అవార్డును 2014 నుంచి సినీ ప్రముఖులకు అందజేస్తున్నాము. 2014లో లతా మంగేష్కర్, 2015లో అమితాబ్ బచ్చన్, 2016లో రేఖ, 2017లో షారుఖ్‌ఖాన్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. ఈ ఏడాది ఈ అవార్డును ప్రముఖ గాయని ఆశాభోంస్లేకు అందించనున్నాం. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర గవర్నర్ సి.హెచ్.విద్యాసాగర్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. దీంతోపాటు కాకతీయ కళా వైభవం పేరిట త్వరలో మహబూబ్‌నగర్‌లో భారీ ఫంక్షన్‌ను నిర్వహించనున్నాం''అని అన్నారు. మురళీమోహన్ మాట్లాడుతూ ''నేను ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో కైకాల సత్యనారాయణ నాకు ఎన్నో మంచి విషయాలు చెప్పారు. ఆయనను సత్కరించడమంటే అది ఇండస్ట్రీకే సత్కారం''అని తెలిపారు. కైకాల సత్యనారాయణ మాట్లాడుతూ ''మహాశివరాత్రి సందర్భంగా వైజాగ్‌లో నిర్వహించే కార్యక్రమంలో టి.సుబ్బరామిరెడ్డి ఓ గొప్ప బిరుదుతో నన్ను సత్కరించబోతున్నందుకు ఆనందంగా ఉంది. ఆయన కళా సేవ చేస్తూ నిజమైన కళాకారుడనిపించుకుంటున్నారు'' అని చెప్పారు. ఈ సమావేశంలో ప్రముఖ బాలీవుడ్ నటి పద్మిని కొల్హాపురి, పరుచూరి వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.



Dwaraka (Everyday NewsPapers)




మార్చి 31లోగా ఐటి రిటర్నులు దాఖలు చేయకుంటే శిక్ష

న్యూఢిల్లీ: పెద్ద నోట్ల రద్దు అనంతరం బ్యాంకుల్లో భారీగా నగదు డిపాజిట్లు చేసిన వ్యక్తులు, సంస్థలు మార్చి 31వ తేదీలోగా తమ రిటర్నులు దాఖలు చేయాలని ఆదాయం పన్ను (ఐటి) విభాగం స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వును పాటించని వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టి శిక్షించడం జరుగుతుందని హెచ్చరించింది. అర్హత పొందిన ట్రస్టులు, రాజకీయ పార్టీలు, సంఘాలు కూడా వచ్చే నెల 31వ తేదీలోగా ఆదాయం పన్ను రిటర్నులు దాఖలు చేసి మచ్చ లేకుండా బయటపడాలని సూచించింది. ఈ మేరకు ఐటి విభాగం ప్రముఖ దినపత్రికల్లో బహిరంగ ప్రకటనలు జారీ చేసింది. 2016–17, 2017–18 మదింపు సంవత్సరాలకు సంబంధించి ఆలస్యమైన లేదా సవరించిన ఆదాయం పన్ను రిటర్నులను దాఖలు చేసేందుకు ఇదే చివరి సూచన అని ఆ ప్రకటనలో పేర్కొన్నది. ఈ కేటగిరీల్లోని పన్ను చెల్లింపుదారులకు ఇంకా చాలా సమయం ఉన్నదని, కనుక వారంతా గడువు తేదీకి ముందే రిటర్నులు దాఖలు చేసి చివరి నిమిషంలో రద్దీ లేకుండా చూసుకోవాలని ఐటి విభాగం సూచించింది.

అదిగదిగో మంచిరోజులు

వచ్చే ఏడాది ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి దేశ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడంపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. గత మూడు రోజులుగా ముడి చమురు ధరలు పతనమవుతున్నాయని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆర్థిక రంగంలో ఇప్పుడున్న పరిస్థితులో పతనం అన్నదాని గురించి తాను ఆందోళన చెందడంలేదన్నారు. బడ్జెట్ తర్వాత లాంఛనంగా జరిగే ఆర్‌బిఐ బోర్డుతో శనివారం జరిగిన సమావేశం అనంతరం జైట్లీ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ అధ్యక్షతన ద్రవ్య విధాన కమిటీ కీలక వడ్డీరేట్లు యథాతథంగా ఉంచాలని తీసుకున్న నిర్ణయం సరైనదేనని ఆయన అన్నారు.

2018–19 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం స్థూలజాతీయోత్పత్తి(జిడిపి)లో 3.2 శాతం లక్ష్యానికి బదులు 3.5 శాతంగా అత్యధిక ద్రవ్యలోటును ప్రాజెక్ట్ చేశారు. మొత్తం ఆదాయం, వ్యయం మధ్య ఉండే వ్యత్యాసం లేక ఆర్థిక లోటును వచ్చే ఆర్థిక సంవత్సరంలో 3.3 శాతంగా అంచనా వేశారు. ఇది ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్(ఎఫ్ ఆర్‌బిఎం) చట్టం ఆదేశం 3 శాతం కన్నా ఎక్కువే. ఖరీఫ్ సీజనలో వ్యవసాయ ఉత్పత్తి వ్యయం కన్నా కనీస మద్దతు ధర రూ. 1.5 రెట్లు ఎక్కువ ఉండాలన్న బడ్జెట్ ప్రతిపాదన గురించి మాట్లాడుతూ ఈ సమావేశంలో దీని గురించి చర్చించామన్నారు. 'దీనిని ఎలా అమలు చేయాలి? దాని ప్రభావం రైతుల మీద, ఉత్పత్తుల ధరల మీద, ఎగుమతి పోటీతత్వంపై ఎలా ఉండగలదు వంటి అంశాలను చర్చించాము. అదంతా అకాడమిక్ చర్చ' అని ఆయన పేర్కొన్నారు.

దీర్ఘకాలి మూలధన లాభాల పన్ను గురించి మాట్లాడుతూ అది ఈ సమావేశంలో భాగం కానిదన్నారు. కానీ దానిని సెబీ బోర్డు సమావేశంలో చర్చించామన్నారు. బ్యాంకుల రేట్ ట్రాన్స్‌మిషన్ గురించి మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఒక బ్యాంకు మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్(ఎంసిఎల్ఆర్)ను తగ్గించిందన్నారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత కొన్ని ట్రాన్స్‌మిషన్‌లు ఆలస్యంగా వచ్చాయని మనం అంగీకరించాలని అన్నారు.

త్వరలో క్రిప్టో కరెన్సీలపై నిబంధనలు: సెబీ



న్యూఢిల్లీ: త్వరలో క్రిప్టోకరెన్సీలపై నిబంధనలు ప్రకటించనున్నట్లు సెబీ ఛైర్మన్ అజయ్ త్యాగి తెలిపారు. నేడు ఆయన మాట్లాడుతూ బిట్‌కాయిన్ల ధరల్లో భారీ మార్పులు చోటు చేసుకుంటుండటంతో పెట్టుబడిదారులను రక్షించేందుకు త్వరలోనే నిబంధనలను వెల్లడిస్తామన్నారు. ఇప్పటికే పలు నిబంధనలపై చర్చలు జరుగుతున్నాయని అన్నారు. బడ్జెట్ సమర్పించిన మర్నాడే ఆర్థిక వ్యవహారాల శాఖ సమావేశం ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇప్పటికే దీనిపై ఏర్పాటు చేసిన కమిటీ త్వరలో నివేదిక ఇచ్చే విధంగా పూర్తిగా కృషి చేస్తున్నామన్నారు. క్రిప్టో కరెన్సీలపై ఏర్పాటు చేసిన కమిటీలో అజయ్ త్యాగి కూడా సభ్యుడే. ఈ కమిటీ క్రిప్టో కరెన్సీల లాభనష్టాలను వివరిస్తుంది. దీంతో పాటు ప్రభుత్వమే క్రిప్టో కరెన్సీ తయారీపై సాధ్యాసాధ్యాలను వివరిస్తుంది. క్రిప్టోకరెన్సీ తయారిపై ప్రభుత్వ పాలసీ వెల్లడయ్యాక దానిలో సెబీ పాత్ర ఏమిటో బయటకు వస్తుందని త్యాగి తెలిపారు.

పెరిగిన విదేశీ మారకపు నిల్వలు



ముంబయి: భారత విదేశీ మారకపు నిల్వలు ఫిబ్రవరి 2 నాటికి 4.12 బిలియన్ డాలర్లకు చేరిందని అధికారిక డేటా వెల్లడించింది. విదేశీ మారకపు నిల్వలు జనవరి 26 వారాంతంలో 417.78 బిలియన్ డాలర్ల నుంచి 421.91 బిలియన్ డాలర్లకు పెరిగిందని ఆర్‌బిఐ వీక్లి స్టాటిస్టికల్ అనుబంధం తెలిపింది. భారత విదేశీ మారక నిల్వల్లో విదేశీ కరెన్సీ ఆస్తులు(ఎఫ్‌సిఎలు), బంగారం నిల్వలు, స్పెషల్ డ్రాయింగ్ రైట్స్(ఎస్‌డిఆర్‌లు), అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్)తో ఆర్‌బిఐ స్థాయి వంటివి ఉంటాయి. అమెరికా డాలర్లకు తోడు ఎఫ్‌సిఎలు దాదాపు 20 నుంచి 30 శాతం వరకున్నాయి. వాటిలో యుఎస్ ట్రెజరీ బాండ్లు, సెలెక్టెడ్ గవర్నమెంట్స్ బాండ్లు, విదేవీ సెంట్రల్, కమర్షియల్ బ్యాంకుల వద్ద ఉన్న డిపాజిట్లు ఉన్నాయి. ఇదేవిధంగా దేశపు బంగారం నిల్వలు 21.51 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఎస్‌డిఆర్‌లు 1.54 బిలియన్ డాలర్లకు చేరింది. కాగా అంతర్జాతీయ ద్రవ్య నిధి వద్ద దేశపు నిల్వలు 2.08 బిలియన్ డాలర్లకు పెరిగింది.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	28790	30791.44	0.45%
ముంబై	29590	31647.06	0%
ఢిల్లీ	29100	31122.99	0.17%
కోల్‌కతా	29670.99	31733.68	0%
కేరళ	27800	29732.62	0%
బెంగళూరు	28200	30160.43	0%
హైదరాబాద్	28790	30791.44	0.17%
గల్ఫ్	1400.16	1497.50	0.47%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	42600.00	42400.00	0.47
ముంబై	42600.00	42400.00	0.47
ఢిల్లీ	42600.00	42400.00	0.47
కోల్‌కతా	42600.00	42400.00	0.47
హైదరాబాద్	42600.00	42400.00	0.47



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	345	విశాఖపట్నం	340
వరంగల్	347	చిత్తూరు	373
విజయవాడ	335	చెన్నై	380
గోదావరి	335	బెంగళూరు	365

ఏప్రిల్ నుంచి దేశవ్యాప్తంగా
ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఏప్రిల్ నుంచి ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ పనిచేయండం ప్రారంభిస్తాయని ప్రభుత్వం శనివారం తెలిపింది. ఆరంభించే సమయం మార్చవచ్చు లేదా ఆలస్యం చేయవచ్చు అనే వార్తలను ఖండించింది. 'ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్(ఐపిపిబి) విస్తరణ కార్యక్రమం చురుకుగా కొనసాగుతున్నది. కొన్ని మీడియాలో వస్తున్న వార్తల్లా ఆరంభ సమయాన్ని మార్చబోవడంలేదు' అని ప్రభుత్వం తన ప్రకటనలో పేర్కొంది. 'విస్తరణ అంటూ పూర్తయితే, దేశంలో ఐపిపిబిది అతి పెద్ద ఆర్థిక నెట్‌వర్క్ కాగలదు. ఇది పట్టణాలు, గ్రామాల్లో కూడా పనిచేయనున్నది. డిజిటల్ సర్వీస్‌లతో ఇంటివద్దనే పోస్ట్‌మెన్, గ్రామీణ్ డాక్ సేవకులు(జిడిఎస్) సేవలందించనున్నారు' అని కూడా పేర్కొంది. ఐపిపిబి ద్వారా 17 కోట్ల మంది యాక్టివ్ అకౌంట్‌దారులు ఉండగలరు. పోస్టాఫీసుల్లో డిజిటల్ పేమెంట్లు కూడా చేపడతారు. రూ. 1450 కోట్ల పెట్టుబడితో 2018 మే నుంచి దేశవ్యాప్తంగా పోస్టల్ డిపార్ట్‌మెంట్ తన శాఖలను తెరువనుంది అని పోస్టల్ సెక్రటరీ అనంత నారాయన నందా వారం కిందట తెలిపారు. 1.55 లక్షల పోస్టాఫీసు శాఖలు యాక్సెస్ పాయింట్లుగా, 650 పేమెంట్స్ బ్యాంక్ బ్రాంచీలుగా పనిచేయనున్నాయని, బ్యాక్–ఎండ్ మద్దతును కూడా అందించనున్నాయని అన్నారు. పేమెంట్ బ్యాంక్స్ రూ. 1 లక్ష వరకు వ్యక్తిగత, చిన్న వ్యాపార ఖాతాలకు డిపాజిట్లను స్వీకరిస్తుంది.

అయితే సాంప్రదాయిక బ్యాంకులు ఇచ్చినట్లుగా పేమెంట్స్ బ్యాంకులు వినియోగదారులకు రుణాలు, క్రెడిట్లు ఇవ్వడాన్ని అనుమతించబోరు. ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, పేటిఎం తర్వాత ఐపిపిబి మూడో పేమెంట్స్ బ్యాంక్‌గా పూర్తిస్థాయిలో పనిచేయబోతున్నది. పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్‌ను ప్రయోగాత్మకంగా 2017 జనవరిలో రాయ్‌పూర్, రాంచీలో ఆవిష్కరించారు. 2017 సెప్టెంబర్ కల్లా దేశంలో 650 శాఖలకు దీనిని విస్తరించాలని భావించారు. అయితే ఆ ప్రణాళిక కాస్త ఆలస్యం అయింది. అందుకు కారణం నిర్దారిత సమయంలో సిస్టం ఇంటిగ్రేటర్(ఎస్ఐ)పై సంతకం చేయడం కుదరలేదు.

పన్ను ఎగవేతదారుల నుంచి
భారీగా ఆర్జన



న్యూఢిల్లీ: బ్యాంకు ఖాతాలకు, రెండు లక్షల రూపాయాలు దాటిన ఆర్థిక వ్యవహారాలకు పాన్ కార్డును తప్పనిసరి చేయడం, దాంతో పాటు ఆధార్ లింక్ చేయడం వంటి చేపట్టి ప్రభుత్వం పన్ను ఎగవేతదారుల భరతంపడుతోంది. తాజాగా అదనపు రిటర్నులలో రూ.1.7 కోట్ల ఫైల్ చేశారని, దీంతో మొత్తంగా ప్రభుత్వం డిసెంబర్ వరకు రూ.26,500 కోట్లు ఆర్జించినట్టు తెలిసింది. ఇన్‌హౌజ్ సమాచారంతోనే నాన్‌ఫైలర్స్‌ను ఆదాయపు పన్ను శాఖ గుర్తిస్తుందని ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ పార్లమెంట్‌కు తెలిపారు. ఈ డేటాను టిడిఎస్, టిసిఎస్ ద్వారా సేకరించిన ఎక్కువ విలువ ఉన్న లావాదేవీలతో ట్యాలీ చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం పాన్ నెంబర్‌ను రూ.2 లక్షలకు పైన జరిపే లావాదేవీలు ప్రాపర్టీ, షేర్లు, బాండ్లు, ఇన్సూరెన్స్, విదేశీయ ప్రయాణం వంటి అన్నింటికీ తప్పనిసరి చేసినట్టు చెప్పారు. గతేడాది 35 లక్షల నాన్ ఫైలర్స్‌ను గుర్తించామని, ఆ ముందటేడాది ఈ సంఖ్య 67 లక్షలుగా ఉండేదని ఆదాయపు పన్ను శాఖ తెలిపింది. నాన్‌ఫైలర్స్‌ను గుర్తించిన అనంతరం పలు కేటగిరీల్లోకి కేసులను వర్గీకరించి, పర్యవేక్షిస్తున్నట్టు అరుణ్‌జైట్లీ తెలిపారు. రిటర్నులు ఫైల్ చేయాలని టార్గెట్ చేసిన గ్రూప్‌లుకు టెక్స్‌ట్ మెసేజ్‌లు, ఇ–మెయిల్స్‌ను పంపుతున్నట్టు కూడా పేర్కొన్నారు. అంతేకాక వారి స్పందనలను కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. ప్రాజెక్ట్ ఇన్‌సైట్ అనే కొత్త మెకానిజం ద్వారా మరింత కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

కోల్ ఇండియా క్యూ 3 నికర లాభం 4 శాతం వృద్ధి



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ అయిన కోల్ ఇండియా లిమిటెడ్(సిఐఎల్) నికర లాభం 4.21 శాతం గడించినట్లు శనివారం ప్రకటించింది. 2017 డిసెంబర్‌కు ముగిసిన మూడో త్రైమాసిక ఫలితాల్లో రూ. 3004.79 కోట్లు ఏకీకృత నికర లాభం గడిచింది. 2017 జులై 1న అమలైన జిఎస్‌టి కారణంగా గత ఏడాదితో ఆదాయాన్ని పోల్చలేకపోయామని సిఐఎల్ తెలిపింది. గత ఏడాది త్రైమాసిక ఉత్పత్తి 147.73 మిలియన్ టన్నులు కాగా ఈ ఏడాది త్రైమాసికంలో ఉత్పత్తి రూ. 152.04 మిలియన్ టన్నులు అని పేర్కొంది. గత ఏడాది మొత్తం వ్యయం రూ. 18907.17 కోట్లు కాగా ఈ ఏడాది రూ. 17873.93 కోట్లు. స్టాండ్‌ఎలోన్ ఆధారంగా గత ఏడాది రూ. 39.03 కోట్లు కాగా ఈ ఏడాది నికర లాభం రూ. 121.14 కోట్లు అని కోల్ ఇండియా తన క్యూ3 ఫలితాల్లో ప్రకటించింది.

నిలదొక్కుకున్న బంగారం ధర

ముంబయి: బులియన్ మార్కెట్‌లో శనివారం బంగారం ధర మరో రూ. 30 పెరిగి 10 గ్రాములు రూ. 31,200కు చేరకుంది. స్థానిక నగల వ్యాపారుల కొనుగోళ్లతో, విదేశాల్లో బంగారం ధర బలహీన పడినా దేశీయ మార్కెట్‌లో నిలదొక్కుకుంది. పెండ్లి సీజన్ డిమాండ్ అందుకోడానికి స్థానిక నగల వ్యాపారులు బంగారం కొనుగోళ్లకు పాల్పడ్డారని ట్రేడర్లు తెలిపారు. న్యూయార్క్ మార్కెట్‌లో బంగారం 0.20 శాతం పడిపోయి ఔన్స్ బంగారం 1315.70 డాలర్ల ధర పలికింది. కాగా వెండి రూ. 180 మేరకు పడిపోయి కిలో వెండి రూ. 39,050 ధర పలికింది. పారిశ్రామిక సంస్థలు, నాణెపు తయారీదారులు వెండిని కొనడం తగ్గించారు.



అమెరికా షట్‌డౌన్ సుఖాంతం



వాషింగ్టన్: అమెరికా షట్‌డౌన్ ముగిసింది. ప్రభుత్వ కార్యకలాపాలు తిరిగి తెరుచుకున్నాయి. బడ్జెట్ బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ సంతకం చేయడంతో కార్యకలాపాలు యథావిధిగా మళ్లీ ప్రారంభమయ్యాయి. కీలకమైన ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం ఆలస్యం కావడంతో.. 5 గంటపాటు అమెరికా ప్రభుత్వం కార్యకలాపాలు స్తంభించి పోయిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం మూతపడకుండా ఉండేందుకు గురు వారం అర్ధరాత్రిలోగా బిల్లును కాంగ్రెస్ ఆమోదించాల్సి ఉండగా.. సెనేట్‌లో ఆలస్యం జరిగింది. సెనేట్ 7128 ఓట్ల తేడాతో, ప్రతినిధుల సభ 240186 ఓట్ల తేడాతో దీన్ని ఆమోదించింది. 'బిల్లుపై సంతకం చేశా. మా సైన్యం ముందు కంటే చాలా బలంగా ఉంది. మేము సైన్యాన్ని ప్రేమిస్తాం. ప్రతిఒక్కటీ అందిస్తాం. చాలా కాలంలో తొలిసారి ఇది జరిగింది. జాబ్స్..జాబ్స్..జాబ్స్!' అని డొనాల్డ్ ట్రంప్ ట్వీట్ చేశారు. ఈ బిల్లుపై శుక్రవారం ఉదయం డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. అంతకముందు జనవరిలో కూడా ఓసారి ఇలానే అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ అయింది. సభలో బిల్లుకు మద్దతు ఇచ్చిన 73 మంది డెమోక్రాట్లకు ట్రంప్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక విధానాన్ని భవిష్యత్ దృష్టితోనే చూడాలి



న్యూఢిల్లీ: ఆర్థిక విధాన నిర్ణయాలను రోజువారీ ద్రవ్యోల్బణం ఆధారంగా కాక భవిష్యత్తు దృష్టితో చూడాలని భారత రిజర్వు బ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ అన్నారు. ప్రపంచ చమురు ధరలను ఎలా ఉంటాయన్నది చెప్పడం కష్టమని , ఇటీవల కాలంలో ప్రపంచ ఛార్టులు దాన్ని రెండు రకాలుగా చూపిందన్నారు. పెరిగే, తరిగే ధరల స్థితిలో రెండింటికీ సన్నద్ధం కావాలని అన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఆబిఐ బోర్డు మీటింగ్‌లో ప్రసంగించిన తర్వాత విలేకరులతో ఉర్జిత్ పటేల్ మాట్లాడుతూ ఈ విషయాన్ని చెప్పారు. పరపతి వృద్ధి చెందగలదన్న విశ్వాసాన్ని కూడా ఆయన ప్రకటించారు. క్యాపిటల్ మార్కెట్ నుంచి కంపెనీలు కావలసినంత డబ్బును సేకరించగలుగుతున్నాయని కూడా ఆయన చెప్పారు. ఆర్థిక విధాన ఛత్రం గురించి మాట్లాడుతూ ద్రవ్య విధాన కమిటీ(ఎంపిసి) ఈ వారం వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచాలని నిర్ణయించిందన్నారు. ఆ నిర్ణయానికి ఉన్న కారణాలను కూడా ఆయన వివరించారు. 'మనం నిన్న, నేడు ఉన్న ద్రవ్యోల్బణం రేటు ఆధారంగా కాక భవిష్యత్తు దృష్టితోనే ఆర్థిక విధానాన్ని చూడాలని అన్నారు. ప్రపంచంలో చాలా సెంట్రల్ బ్యాంకులకన్నా మా తీర్మానాలు ఎంతో దీర్ఘకాలిక దృష్టితో తీసుకున్నవై ఉంటాయి. మేము రెండేళ్ల కోసారి ద్రవ్య విధాన రిపోర్టును ప్రకటిస్తాము , నిర్ణయాలను జాగ్రత్తగా వివరిస్తాం' అని ఆయన తెలిపారు. స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధి రేటు ఊర్ధ్వ దిశను సూచిస్తోంది అన్నారు. ద్రవ్యలోటును లక్ష్యం మేరకు ఉంచేలా ప్రయత్నిస్తామన్నారు. మూడు రోజుల్లో చమురు ధరలు ఎలా ఉన్నాయో ఎవరూ చెప్పలేకపోయారన్నారు. అంటే ఇప్పట్లో దానిపై స్పష్టత లేదనే అనిపిస్తోంది.

'కొన్ని నెలల క్రితం అంటే జూన్ లేక అంతకు ముందు ప్రజలు చమురు ధరలు బ్యారెల్‌కు 45 డాలర్లకు మించదని మాట్లాడారు. చమురు ధరల ఆధారంగానే ఆర్థిక విధాన నిర్ణయాలు ఉండాలని అన్నారు. రెండు మూడు రోజుల కిందట చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. నిధుల సేకరణకు క్యాపిటల్ మార్కెట్ బాగానే తోడ్పడిందని ఉర్జిత్ పటేల్ అన్నారు. 'మనకు మంచి ఈక్విటీ–డెట్ రేషియో(కార్పొరేట్స్) ఉంది. సంస్థలు ఈక్విటీ విషయంలో బాగానే సేకరించాయి. మన పరపతి వృద్ధి 11 శాతం దరిదాపుల్లో ఇప్పటికే ఉందని నేను భావిస్తున్నాను' అని కూడా అన్నారు.

Dwaraka (Everyday NewsPapers)

రాజకీయ పార్టీలను తొలగించే అధికారమూ ఇవ్వండి

న్యూఢిల్లీ : రాజకీయ పార్టీల రిజిస్టర్‌తో పాటు వాటిని జాబితా నుంచి తొలగించే(డీరిజిస్టర్) అధికారం కూడా ఇవ్వాలని ఎన్నికల సంఘం కోరింది. శనివారంనాడు ఈ మేరకు సుప్రీంకోర్టులో ఒక అఫిడవిట్ సమర్పించింది. రాజకీయ పార్టీలను డీరిజిస్టర్ చేసే అధికారం కావాలని అడిగింది. పార్టీలను డీరిజిస్టర్ చేసే అధికారం తమకు కల్పించాలని తాము 20 సంవత్సరాల నుంచి కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని ఎన్నికల సంఘం ఆఫిడవిట్‌లో గుర్తు చేసింది. నేరస్థులు రాజకీయ పార్టీలను ఏర్పాటు చేయడాన్ని ఆపాలని లాయర్, ఉద్యమకారుడు అశ్విని ఉపాధ్యాయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లో రాజకీయ పార్టీల నమోదుకు సంబంధించిన నిబంధనలు మాత్రమే ఉన్నాయి. డీరిజిస్టర్ చేయడానికి సంబంధించిన స్పష్టమైన నిబంధన ఏదీ లేదు. నేరస్థులు, ఎన్నికల్లో పోటీ చేయడంపై అనర్హత వేటు పడినవారు ప్రస్తుత చట్టాలను ఆసరాగా చేసుకుని రాజకీయ పార్టీలను ఎలా ఏర్పాటు చేయగలుగుతున్నారని ప్రశ్నించారు. రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉండేలా చేయగలిగే అధికారం ఎన్నికల సంఘానికి ఉండాలని సూచించారు.



వాళ్లూ బీర్ తాగుతున్నారనే ఆందోళన



పనాజీ : మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటున్నదని గోవా ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ తెలిపారు. హద్దు మీరిన అమ్మాయిలు కూడా బీర్ తాగడాన్ని ప్రారంభించారని, అందుకే తనకు ఆందోళన ప్రారంభమైందని అన్నారు. రాష్ట్ర శాసనసభ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర యువ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ 'నేను అందరి గురించి మాట్లాడడం లేదు. ఇక్కడ కూర్చున్న వారి గురించి కూడా మాట్లాడడం లేదు' అని అన్నారు. దేశంలోనే పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందిన గోవాలో ఇప్పుడు జరుగుతున్న మాదక ద్రవ్యాల వ్యాపారంపై ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం, వాటిని దూరంగా తరిమి కొట్టే వరకు ఈ చర్యలు కొనసాగుతాయని చెప్పారు. ఈ విక్రయాలు జీరోకు వస్తాయని చెప్పలేనని, కేవలం కాలేజీల్లోనే వీటి వ్యాప్తి జరుగుతుందని కూడా తాను అనుకోవడం లేదని అన్నారు.

ఉత్తరాది పర్యాటకులు అలగాజనం



పనాజి : పర్యాటకులపై గోవా పట్టణ, ప్రణాళిక మంత్రి విజయ్ సర్దేశాయ్ నోరుపారేసుకునారు. ముఖ్యంగా ఉత్తరాది నుంచి వస్తున్న వారిని అలగాజనమని అభివర్ణించారు. ఉత్తరాది పర్యాటకులు గోవాను మరో హర్యానాగా మార్చాలనుకుంటున్నారని ఆరోపించారు. గోవా బిజ్ ఫెస్ట్ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోవా ఉత్తరాది పర్యాటకులపై ఆధారపడిందని, అయితే వాళ్లు తమకు ఇస్తున్నది మురికి అని చెప్పారు. వాళ్ళు గోవా గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గోవాలో హర్యానాను సృష్టించాలనుకుంటున్నారని పేర్కొన్నారు. గోవా వస్తున్న దేశీయ పర్యాటకుల్లో చాలా మంది ఈ భూమ్మీద అలగా జనమేనన్నారు. రాష్ట్ర జనాభా కన్నా ఆరు రెట్ల మంది పర్యాటకులు వస్తున్నారన్నారు. వీళ్ళు ఉన్నత స్థాయికి చెందినవారు కాదన్నారు. మిగతా భారతదేశం కన్నా గోవా అత్యున్నతమైనదని సర్దేశాయ్ అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న బాధ్యతారహితులైన పర్యాటకులను నియంత్రించడం కష్టమని తెలిపారు.

రైలు ఢీకొని ఇద్దరు రైల్వే సిబ్బంది మృతి

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాలో రైలు ఢీకొని ఇద్దరు రైల్వే సిబ్బంది మృతి చెందారు. కురువాయి స్టేషన్ సమీపంలో శుక్రవారం రైల్వే ట్రాక్‌లపై సిగ్నల్‌కు మరమ్మతు చేస్తున్న ఇద్దరు రైల్వే సిబ్బందిని హజ్రత్ నిజాముద్దీన్– చెన్నై సెంట్రల్ రాజధాని ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టిందని పశ్చిమ మధ్య రైల్వే భోపాల్ డివిజన్ ప్రజా సంబంధాల అధికారి ఐఎ సిద్ధిఖ్ తెలిపారు. మృతులు రైల్వే సిగ్నల్ నిర్వాహణ విభాగానికి చెందిన సంజయ్‌శర్మ (48), మనోహర్ (57)గా గుర్తించామని ఆయన తెలిపారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పంచనామాకు తరలించామని అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ కమలేష్ పాండే తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

రేపు అసెంబ్లీలో జయ చిత్రపటం

చెన్నై: తమిళనాడు అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలిత చిత్రపటాన్ని సోమవారం నాడు సిఎం ఎడప్పాడి కె పళనిస్వామి ఆవిష్కరించనున్నారు. గతంలో పళనిస్వామి ఢిల్లీలో పర్యటించినప్పుడు ప్రధాని నరేంద్ర మోడీని కలిసి జయలలిత చిత్రపట ఆవిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమిళుల కోసం జయలలిత తన జీవితాన్ని అంకితం చేశారని, భారత రాజకీయల్లో ఆమె చెరగని ముద్ర వేసినట్లు ప్రధానికి అందజేసిన ఆహ్వాన పత్రికలో ఆయన పేర్కొన్నారు. తమిళనాడు, భాష, సంస్కృతి, అభివృద్ధికి ఆమె ఘనీయమైన సేవ చేశారని అందులో పేర్కొన్నారు. జయలలిత చిత్రపట ఆవిష్కరణ కార్యక్రమానికి వస్తే తమిళులు సంతోషం వ్యక్తం చేస్తారని పేర్కొన్నారు. కాగా, బిజీ షెడ్యూల్ కారణంగా ఈ కార్యక్రమానికి మోడీ హాజరుకాలేకపోతున్నారు.

20,250 మందికి 898 మంది సైకాలజిస్టులు

న్యూఢిల్లీ: దేశంలో 20,250 మంది సైకాలజిస్టుల అవసరం ఉండగా ప్రస్తుతం 898 మంది మాత్రమే ఉన్నారని, సైకియాట్రిక్ సోషల్ వర్కర్లు 37 వేల మంది కావాల్సి ఉండగా కేవలం 900 మందే ఉన్నారని శుక్రవారం ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి అనుప్రియా పటేల్ లోక్‌సభకు తెలిపారు. దేశంలో మానసిక ఆరోగ్య నిపుణుల కొరతపై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆమె బదులిచ్చారు. జనవరి 2015 నాటికి దేశంలో 13,500 మంది సైకియాట్రిస్టుల అవసరం ఉండగా 3,827 మంది మాత్రమే ఉన్నారన్నారు. మూడు వేల మంది సైకియాట్రిక్ నర్సుల అవసరం ఉండగా ప్రస్తుతం 1500 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 15 లక్షల మంది బుద్ధి మాంద్యంతో బాధ పడుతుండగా, 7.22 లక్షల మంది ప్రజలు మానసిక రోగాలతో బాధ పడుతున్నారు. దేశంలోనే అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లో 76,603 మంది ఏదో ఒక మానసిక వ్యాధితో బాధ పడుతున్నారు. బెంగాల్‌లో 71,515 మంది, కేరళలో 66, 915 మంది, మహారాష్ట్రలో 58,753మంది వ్యాధితో బాధపడుతున్నారు.

పూరి ఆలయానికి కస్తూరి బంద్?

పూరి: పూరిలోని శ్రీ జగన్నాథ్ ఆలయానికి తమ దేశం కస్తూరిని సరఫరా చేయడం సాధ్యంకాకపోవచ్చునని నేపాల్ ఆఖరి రాజు జ్ఞానేంద్ర బీర్ బిక్రమ్ షాదేవ్ చెప్పారు. శంకరాచార్య స్వామి నిశ్చలానంద సరస్వతి పట్టాభిషేకం రజతోత్సవానికి బీర్ బిక్రమ్ శుక్రవారం నాడు హాజరయ్యారు. అంతరించిపోయే ప్రమాదంలోపడిన 'మస్క్ డేర్ (కస్తూరి లేడి)' నుంచి ఈ కస్తూరిని సేకరిస్తారు. ఈ మృగాన్ని వధించడంపై నిషేధం అమల్లో ఉంది. ఈ చట్టపరమైన అడ్డంకివల్ల కస్తూరి సేకరణ కష్టంగా పరిణమించినట్లు రాజు తెలిపారు. ఆలయ లాంఛనాలు ప్రకారం 12వ శతాబ్దానికి చెందిన దేవతా విగ్రహాలకు కస్తూరిని పూస్తారు. ప్రతియేటా మూడు సందర్భాల్లో ఇలా పూయడం ఆనవాయితీ. ఇంతకు ముందు నేపాల్ రాచ కుటుంబం శ్రీ జగన్నాథ ఆలయానికి కస్తూరిని సమకూర్చేది. 2008 తర్వాత కస్తూరి సరఫరా నేపాల్ నుంచి కష్టంగా పరిణమించింది.



పాలస్తీనాలో తిరిగి ప్రశాంతత

- ఆ దేశ ప్రధాని అబ్బాస్‌తో భేటీ సందర్భంగా మోడీ ఆశాభావం
- పలు కీలక ఒప్పందాలపై సంతకాలు



రమల్లా: ప్రధాని నరేంద్ర మోడీ శనివారం నాడు పాలస్తీనా అధ్యక్షుడు మహ్మూద్ అబ్బాస్‌తో సమావేశం అయ్యారు. పాలస్తీనాలో మోడీ జరుపుతున్న చరిత్రాత్మక పర్యటనలో ఇరు దేశాల మధ్య 50 మిలియన్ డాలర్ల విలువ చేసే ఒప్పందాలు కుదిరాయి. 30 మిలియన్ డాలర్ల ఖర్చుతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం కూడా ఈ ఒప్పందాల్లో ఒకటి. అధ్యక్ష భవన సముదాయం వద్ద అబ్బాస్ ప్రధాని మోడీకి అధికారిక ఉత్సవంలో స్వాగతం పలికారు. రమల్లాలో ఈ సముదాయం ముగతా పేరిట ఉంది. ఇది ఆదేశపు ప్రభుత్వ పీఠం గల సముదాయం. పాలస్తీనాకు అధికారిక పర్యటన జరిపిన తొలి భారత ప్రధాని మోడీ. పాలస్తీనా ప్రజల ప్రయోజనాలకు భారత్ కట్టుబడి ఉందని చర్చల తర్వాత మోడీ అధ్యక్షుడు అబ్బాస్‌కు హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో తిరిగి శాంతి నెలకొనాలని భారత్ కోరుకుంటున్నట్లు మోడీ చెప్పారు. అయితే అది అంత సులభంగా జరిగేది కాదని, అయినప్పటికీ మొక్కవోని దీక్షతో అందుకు ప్రయత్నిస్తామని మోడీ హామీ ఇచ్చారు. పాలస్తీనాలో శాంతి కోసమే భారత నాయకత్వం ఎల్లప్పుడూ కృషి చేసిందని అబ్బాస్ ప్రశంసించారు. స్వతంత్ర దేశం కోర్కెను నెరవేర్చుకొనేందుకు చర్చల పర్వానికి పాలస్తీనా ఎప్పుడు సంసిద్ధమని అబ్బాస్ తెలిపారు. భారత్ అంతర్జాతీయ వాణిని పాలస్తీనా తరపున గట్టిగా వినిపిస్తున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. వ్యూహాత్మక, ఆర్థిక స్థాయిలలో ఇరు దేశాల మధ్య సంబంధాల పటిష్టానికి కృషి పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. బీట్ సాహుర్‌లో 30 మిలియన్ డాలర్ల ఖర్చుతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఇరు దేశాలు కలిసి నిర్మిస్తాయి. అలాగే 5 మిలియన్ డాలర్ల ఖర్చుతో మహిళల సాధికారత కేంద్రాన్ని కూడా నిర్మిస్తారు. విద్యా రంగంలో 5 మిలియన్ డాలర్లు వ్యయం అయ్యే మరి మూడు ఒప్పందాలు కుదిరాయి. ఒక ఒప్పందం కింద రమల్లాలో జాతీయ ప్రింటింగ్ ప్రెస్ నెలకొల్పుతారు. చర్చలకు ముందు ఇరువురు నాయకులు కౌగిలించుకున్నారు. ఇరు దేశాల జాతీయ గీతాలాపనకు గౌరవ సూచకంగా లేచి నిలబడ్డారు. తర్వాత గౌరవ వందనాన్ని అందుకొన్నారు. మోడీకి శుభాకాంక్షలు తెలపడానికి క్యాథలిక్ చర్చ్ అర్చిబిషప్ పౌలాస్ మార్కోజో, అల్ అక్సాస్ మసీదు మత నాయకులుముగతా వద్దకు వచ్చారు. జోర్డాన్ హెలికాప్టర్‌లో అమ్మన్ నుంచి రమల్లా కు మోడీ నేరుగా ప్రయాణించారు. అక్కడ పాలస్తీనా ప్రధాని రామీ హమదల్లా ఘనంగా మోడీకి స్వాగతం పలికారు. మోడీ కాప్టర్ వెంట ఇజ్రాయిల్ వైమానిక దళ హెలికాప్టర్లు ప్రయాణించాయి. ఇది ద్వైపాక్షిక సంబంధాలను గట్టి పరిచే చారిత్రిక సందర్శన అని హెలిపాడ్ వద్ద మోడీ పేర్కొన్నారు. గత ఏడాది ఇజ్రాయిల్‌కు మొట్టమొదటి సారి పర్యటించిన మోడీ రమల్లాలో ప్రయాణించలే దు. అప్పుడు ఆయన పర్యటన కేవలం ఇజ్రాయిల్‌కే పరిమి తం అయింది. అమెరికా అధ్యక్షుడు ఇజ్రాయిల్ రాజధానిగా జెరూసలెంను అధికారికంగా గుర్తిస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో మోడీ పాలస్తీనా పర్యటన జరిగింది. భారత్ సహా పలు దేశాలు అమెరికా చర్యను గుర్తించలేదు.

మోడీకి అత్యున్నత పురస్కారం

'గ్రాండ్ కాలర్ ఆఫ్ ది స్టేట్ ఆఫ్ పాలస్తీన్' పురస్కారంతో ప్రధాని మోడీని శనివారం నాడు పాలస్తీనా అధ్యక్షుడు మెహమూద్ అబ్బాస్ సత్కరించారు. భారత, పాలస్తీనా మధ్య సంబంధాల వృద్ధికి చేసిన సేవలకు గాను ఈ సత్కారం మోడీకి లభించింది. ఇరువురు నాయకుల మధ్య ద్వైపాక్షిక చర్చల అనంతరం ఈ పురస్కారాన్ని అబ్బాస్ ప్రకటించారు. పాలస్తీనాలో అధికారిక పర్యటన జరిపిన తొలి భారత ప్రధాని మోడీ. విదేశీ నేతలు, రాజులు, దేశాధిపతులు వంటి వారికి ఆ దేశం అందించే అత్యున్నత పురస్కారం ఇది. గతంలో సౌదీ అరేబియా రాజు సల్మాన్, బహ్రేన్ రాజు హమద్, చైనాకు చెందిన అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తదితరులకు ఈ అత్యున్నత పురస్కారం ప్రదానం చేశారు. వివేకవంతమైన నాయకత్వ పటిమ, జాతీయ– అంతర్జాతీయ రంగాలలో పేరుప్రఖ్యాతులకు గాను మోడీకి ఈ పురస్కారాన్ని అందించినట్లు ప్రశంసలో పేర్కొన్నారు. భారత, పాలస్తీనా మధ్య చరిత్రాత్మక సంబంధాల వృద్ధికి మోడీ కృషి చేస్తున్నందుకు కూడా ఈ పురస్కారం ప్రకటించారు.



'రాఫెల్' ఓ పెద్ద కుంభకోణం

హాస్పేట (కర్ణాటక) : రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారం దేశంలో ప్రస్తుతం ఓ పెద్ద కుంభకోణమని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీపైనా ఆయన విమర్శలు గుప్పించారు. కర్ణాటకలో నాలుగు రోజుల పర్యటనలో తొలి రోజు బళ్లారి జిల్లాలోని హాస్పేటలో ఆయన 'జనాశీర్వాద్ యాత్ర'ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్రాన్స్‌కు వెళ్లిన మోడీ 'రాఫెల్ డీల్‌ను వ్యక్తిగతం మార్చివేశారని, తానడిగిన మూడు ప్రశ్నలకు మోడీ ఇప్పటి వరకు సమాధానాలు చెప్పలేకపోయారని అన్నారు. ఏ ప్రాతిపదికన మీరు మీ స్నేహితుడికి ఈ కాంట్రాక్టును అప్పగించారు? కొత్త కాంట్రాక్టులో యుద్ధ విమానాల ధర పెరిగిందా? తగ్గిందా? మీరు పారిస్‌లో ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు, గోవాలో రక్షణ మంత్రి చేపలు కొంటున్నప్పుడు భద్రతకు సంబంధించి క్యాబినెట్ కమిటీ నుంచి మీరు అనుమతి తీసుకున్నారా? అని ప్రశ్నలు సంధించారు. మోడీ ప్రభుత్వం శుష్క వాగ్దానాలు చేస్తోందని ధ్వజమెత్తారు. రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వెనుక వీక్షించే అద్దాలతోనే దేశాన్ని నడిపిస్తున్నారని విమర్శించారు. 'మీరు (మోడీ) వాహనాన్ని వెనుక వీక్షించే అద్దాలను చూస్తూ నడుపుతున్నారు. ఇది ప్రమాదాలకు కారణమవుతుంది. దేశాన్ని ఈ విధంగా నడిపించడం సరికాదు' అని రాహుల్ అన్నారు. ఇటీవల పార్లమెంటులో గంటన్నరపాటు జరిగిన ప్రసంగంలో నిరుద్యోగం, గిరిజనులు, దళితులు వంటి ప్రస్తుత సమస్యలు, అంశాలపై మోడీ నోరు మెదపలేదని విమర్శించారు. 'జరిగిపోయిన విషయాలను మాట్లాడడానికి ఈ దేశం మిమ్మల్ని ప్రధానిని చేయలేదు, దేశం కోసం మీ భవిష్యత్ ప్రణాళికలు ఏమిటన్నది దేశం తెలుసుకోవాలనుకుంటోంది' అని అన్నారు. రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నుంచి పాలన గురించి తెలుసుకోవాలని మోడీకి సూచించారు. కర్ణాటక శాసనసభ ఎన్నికలు త్వరలో జరుగుతాయి. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించి, ప్రజలను ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. రోడ్ షోలు, బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు.

రైల్వేలో 13 వేల మంది ఉద్యోగుల తొలగింపు!


న్యూఢిల్లీ : అనధికారికంగా చాలా కాలంగా సెలవుల్లో ఉన్న 13 వేల మంది సిబ్బందిని తొలగించనున్నట్టు భారతీయ రైల్వే తెలిపింది. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వీరిపై ఈ విధమైన చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొంది. సంస్థ పనితీరును పెంపొందించేందుకు, నిజాయతీ, శ్రద్ధతో పనిచేసే ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు రైల్వే శాఖ డ్రైవ్‌ను చేపట్టింది. ఇందులో భాగంగానే అనధికారికంగా సెలవులు పెట్టి విధులకు దూరంగా ఉన్న వారిని ఉద్యోగం నుంచి తొలగించేందుకు సిద్ధమైంది. 'రైల్వేలోని వివిధ డిపార్టుమెంట్లలో చాలా కాలంగా విధులకు గైర్హాజరవుతున్న వారిని గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టాం. దాదాపు 13 లక్షల మంది ఉద్యోగుల్లో 13వేల మంది ఉద్యోగులు చాలా కాలంగా అనధికారికంగా సెలవుల్లో ఉన్నట్టు గుర్తించాం' అని రైల్వే శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. 'ఇలాంటి వారి పేర్లను హాజరుపట్టికలోని ఉద్యోగుల జాబితా నుంచి తొలగించాలని అధికారులు, సూపర్‌వైజర్లందరికీ ఆదేశాలు జారీ చేశాం' అని తెలిపింది.

ఉత్తమ ఉద్యోగులకు బోనస్‌లు, ప్రోత్సాహకాలు

నిజాయతీ, శ్రద్ధతో పనిచేసే ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు బోనస్‌లు, ప్రోత్సాహకాలు, గౌరవ చిహ్నాలు అందించాలని రైల్వే కమిటీ ప్రతిపాదించినట్టు సీనియర్ రైల్వే అధికారులు తెలిపారు. రైల్వేలో పని చేస్తున్న 13 లక్షల మంది ఉద్యోగుల్లో ఉత్తమంగా విధులు నిర్వహించే వారికి రివార్డులు అందనున్నాయి. ఉద్యోగుల ఐదు సంవత్సరాల వార్షిక పనితీరు మదింపు నివేదిక రేటింగ్‌కు బదులుగా చివరి ఏడేళ్లలో ఉత్తమంగా ఉన్న ఐదు సంవత్సరాలను పరిగణలోకి తీసుకుని ప్రోత్సాహకాలు అందించాలని కమిటీ ప్రతిపాదించింది. ఉద్యోగులకు ఉత్తమ నివాస సదుపాయాలు, ఉద్యోగుల తల్లిదండ్రులకు వైద్య, ఉచిత రవాణా సదుపాయాలను కమిటీ తన నివేదికలో ప్రతిపాదించిందని అధికారులు తెలిపారు. అధ్యయనాలను కొనసాగించాలనుకునే ఉద్యోగులకు ఆర్థిక సాయాన్ని కూడా కమిటీ ప్రతిపాదించింది. దిగువ స్థాయి ఉద్యోగులకు బదులుగా గ్రూప్ ఎ, బి అధికారులకు బోనస్‌లు ఇవ్వాలని సూచించింది. లోకో పైలెట్లకు మాదిరిగానే పదేళ్లపాటు ప్రమాదాలు జరగకుండా విధులు నిర్వర్తించిన గ్యాన్‌మెన్, ట్రాక్‌మెన్‌లకు నగదు బహుమతులతో పాటు, గౌరవ చిహ్నాన్ని కూడా అందించాలని కమిటీ సిఫార్సు చేసింది.

కమ్యూనిస్టులకు బిజెపి నేత ప్రశంసలు

భావజాలం ఆధారంగా నడుచుకుంటున్నది వారే



గౌహతి : భావజాలం ఆధారంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నది కేవలం కమ్యూనిస్టు పార్టీలేనని బిజెపి సీనియర్ నేత, ఆ పార్టీ పత్రిక 'ఆర్గనైజర్' ఎడిటర్ శేషాద్రి చారి కొనియాడారు. శనివారం ఓ హిందీ పత్రిక నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్ని పార్టీలు విలువల ఆధారంగా ఎన్నికలను విశ్వసించడం ప్రారంభిస్తే అది సమాజానికి ఎంతో మంచిదని అన్నారు. తాను బిజెపి లేదా ఆర్‌ఎస్‌ఎస్‌లో ఉన్నప్పటికీ భావజాలం ఆధారంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నది కేవలం కమ్యూనిస్టు పార్టీలేనని చెప్పడానికి సంకోచించబోనని అన్నారు. ఇలా ఏ రాజకీయ పార్టీలు చేయలేవవి కూడా ఆయన చెప్పారు. ప్రేమ, యుద్ధం, రాజకీయాల్లో అందరూ పారదర్శకంగా ఎవరు గెలిచారు అనే అడుగుతారని, కుడి వైపా, ఎడమ వైపా అని చూడకుండా రాజకీయాలకు ప్రాతినిధ్యం వహిస్తే, అలాంటి రాజకీయాలు సమాజాన్ని విభజించలేవని అన్నారు.

బిజెపి కుట్ర :వామపక్షాలు

త్రిపురలో నెలకొన్న శాంతి, సామరస్యాలను దెబ్బతీసేందుకు బిజెపి యత్నిస్తోందని అధికార వామపక్ష ఫ్రంట్ విమర్శించింది. శనివారం ఇక్కడ జరిగిన 'మీట్ ది ప్రెస్'లో ఫ్రంట్ కన్వీనర్ బీజన్ ధర్ మాట్లాడుతూ ఈనెల 18న జరిగే శాసనసభ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం, లౌకికవాదం, శాంతి, సౌభాతృత్వాలను పరిరక్షించేందుకు పోరాటం చేస్తున్నదని చెప్పారు. 'మార్పు తేవాలని బిజెపి నినాదాలు చేస్తున్నది, అంటే వివిధ వర్గాలు, గిరిజనులు, గిరిజనేతరుల మధ్య శాంతిని చెడగొట్టడమని అర్థం. ఈ నినాదాలను రాష్ట్ర ప్రజలు స్వీకరించరు' అని ఆయన పేర్కొన్నారు.

సైనిక శిబిరంపై ఉగ్ర దాడి

- ఇద్దరు జవాన్లు మృతి, నలుగురికి గాయాలు
- ఇద్దరు ముష్కరుల కాల్చివేత





జమ్మూ : జమ్మూలోని సుంజ్‌వాన్ సైనిక శిబిరంపై ఉగ్రవాదులు చేసిన దాడిలో ఇద్దరు సైనిక అధికారులు మృతి చెందారు. ఇద్దరు ఉగ్రవాదులను సైనికులు కాల్చిచంపారు. శనివారం ఉదయం జరిగిన ఈ దాడిలో భారత్‌కు చెందిన నలుగురు గాయపడినట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అబ్దుల్ రెహమాన్ వీరి తెలిపారు. సైనిక శిబిరం పక్కన ఉన్న సైనికుల క్వార్టర్స్ నుంచి ఉగ్రవాదులు లోనికి ప్రవేశించారు. క్వార్టర్స్ వద్ద విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో సుబేదార్ మదన్‌లాల్, సుబేదార్ మొహమ్మద్ అష్రఫ్ అమరులైనట్లు ఆయన రాష్ట్ర శాసనసభలో పకటన చేశారు. గాయపడిన వారిలో కల్నల్ ర్యాంక్ అధి కారి ఒకరు ఉన్నారని, హవల్దార్ అబ్దుల్ హమీద్, లాన్స్ నాయక్ బహదూర్ సింగ్, సుబేదార్ చౌదరి కుమార్తె కూడా తీవ్రంగా గాయపడ్డారని సభలో బిజెపి సభ్యులు పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా హోరెత్తిస్తున్న నినాదాల నడుమ ఆయన ఈ విషయాన్ని చెప్పారు. అయితే, ఏ ఉగ్రసంస్థ దాడికి పాల్పడిందనే విషయాన్ని మాత్రం మంత్రి వెల్లడించలేదు. అయితే అధికారులు మాత్రం జైషే మొహమ్మద్ ఉగ్రవాదులు దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో ఎంత మంది పాల్గొన్నారే విషయం ఇంకా తెలియరాలేదని, ఉదయం 4.55 ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికలను గుర్తించామని, ముష్కరుల కోసం గాలిస్తున్నట్లు ఐజిపి ఎస్‌డి సింగ్ విలేకరులకు వెల్లంచారు. పోలీసులు, సైన్యం క్వార్టర్స్‌ను ఆధీనంలోకి తీసుకున్నట్టు చెప్పారు. ముందు జాగ్రత్త చర్యగా జమ్ము నగరంలోని సుంజ్‌వాన్ ప్రాంతంలో క్యాంపునకు దాదాపు 500మీటర్ల దూరంలోని అన్ని పాఠశాలలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు.

జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో ఆందోళన

జమ్మూలోని సుంజ్‌వాన్ సైనిక శిబిరంపై ఉగ్రవాదులు చేసిన దాడిని ఖండిస్తూ సభ్యులు చేసిన నినాదాలతో శనివారం జమ్మూకశ్మీర్ శాసనసభ దద్దరిల్లింది. శనివారం సభ ప్రారంభం కాగానే పార్టీలకు అతీతంగా సభ్యులంతా ఉగ్రదాడిని ఖండించారు. పాకిస్తాన్‌ను వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిజెపి ఎంఎల్‌ఎ రవీందర్ రైనా నేతృత్వంలో ఆ పార్టీ సభ్యులంతా తమ సీట్లలో నుంచి లేచి నిలబడి దాడిని ఖండిస్తూ నినాదాలు చేశారు. ఎన్‌సి సభ్యులు అలీ మహ్మద్ సాగర్, సిపిఐ(ఎం) ఎంఎల్‌ఎ ఎంవై తరిగామి, కాంగ్రెస్ సభ్యులు ఉస్మాన్ మాజిద్‌లు దాడిని ఖండించారు.

ఎంఎల్‌ఎ పాక్ అనుకూల నినాదాలు



నేషనల్ కాన్ఫరెన్స్ సభ్యుడు మహ్మద్ అక్బర్ లోన్ జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో శనివారంనాడు పాక్ అనుకూల నినాదాలు చేసి సంచలనం సృష్టించారు. సుంజ్‌వాన్‌లో జైషే ఉగ్రవాదులు జరిపిన దాడిని బిజెపి సభ్యులు సభలో ప్రస్తావిస్తూ పాక్ వ్యతిరేక నినాదాలు చేశారు. దానికి ప్రతిగా మహ్మద్ అక్బర్ లోన్ 'పాకిస్థాన్ జిందాబాద్' అంటూ నినదించారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. జమ్మూకశ్మీర్ పరిసరాల్లో రోహింగ్యా శరణార్థులు పెరిగిపోతుండటంతోనే సుంజ్‌వాన్ ఘటన చేటుచేసుకున్నట్టు స్పీకర్ కవీందర్ గుప్తా అభిప్రాయపడటంతో ఆయన వ్యాఖ్యలపై విపక్షాలు ఒక్కసారిగా విరుచుకుపడ్డాయి. దీంతో గందరగోళ పరిస్థితుల మధ్య సభ వాయిదా పడింది. అనంతరం మీడియాతో మాట్లాడిన అక్బర్ లోన్ తన పాక్ అనుకూల వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. బిజెపి సభ్యులు పాక్ వ్యతిరేక నినాదాలు చేయడంతో తాను పాక్ అనుకూల నినాదం అందుకున్నట్టు చెప్పారు.



ఆధార్ లేదని గర్భిణీ గెంటివేత

ఆసుపత్రి బయటే ప్రసవం

గుర్‌గ్రామ్ : ఆధార్ కార్డు లేదన్న కారణంతో ఆసుపత్రి సిబ్బంది ఓ గర్భిణీ పట్ల అనుమానుషంగా ప్రవర్తించారు. ప్రసవానికి వచ్చిన ఆమెను లేబర్ వార్డులో చేర్చుకునేందుకు నిరాకరించడంతో ఎమర్జెన్సీ వార్డు బయట ఆమె ప్రసవించింది. ఈ ఘటన గుర్‌గ్రామ్‌లో శుక్రవారం జరిగింది. ఈ ఘటన శనివారం వెలుగులోకి రావడంతో స్పందించిన ప్రధాన వైద్యాధికారి (సిఎంఓ) డా.బికె రాజోర ఘటనకు బాధ్యులైన వైద్యుడు, స్టాఫ్ నర్సును విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు ప్రకటించారు. మున్నీ కేవత్ (25)కు పురిటి నొప్పులు వస్తుండడంతో ఆమె భర్త, ఇతరులు కలిసి ఆమెను గుర్‌గ్రామ్‌లోని సివిల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. 'మేం ఉదయం వెళ్లాం. అక్కడి సిబ్బంది మమ్మల్ని లేబర్ వార్డుకు వెళ్లాలని సూచించారు. వారు ఆధార్ కార్డు కావాలన్నారు. అది ఉంటేనే చేర్చుకుంటామని చెప్పారు' అని అరుణ్ కేవత్ తెలిపారు. ఆధార్ నెంబర్‌ను చెబుతానని, ఆ తర్వాత కార్డు కాపీ ఇస్తానని చెప్పినా వారు వినలేదని ఆయన వెల్లడించారు. దీంతో తాను ఆధార్ కార్డు ప్రింట్ కోసం బయటకు వెళ్లానని, ఈలోగా ఆమెను చేర్చుకోవడానికి అంగీకరించకపోవడంతోపాటు అక్కడి నుంచి వెళ్లిపోవాలని ఆదేశించారని అన్నారు.

Dwaraka (Everyday NewsPapers)



భూమికి చేరువగా తోకచుక్క

వాషింగ్టన్ : ఓ భారీ తోకచుక్క భూమికి సుమారు 64 వేల కిలోమీటర్ల పరిధి నుంచి ప్రయాణించినట్టు నాసా తెలిపింది. 2018 సిబి అని పేరుపెట్టిన తోకచుక్క చంద్రుని కక్ష్యలో ఐదోవంతు కంటే తక్కువ దూరం వరకు వచ్చింది. దీని పరిమాణం ఓ పెద్ద తిమింగలమంత ఉంటుంది. తోకచుక్కలు ఇంత దగ్గరగా రావడం అరుదైన విషయమేనని అంటున్నారు. పైగా వారంరోజుల్లో ఇలాంటి ఖగోళ ఘటనలు జరుగడం ఇది రెండోసారి. ఇవి భూమిని ఢీకొనే ముప్పు అంతగా ఉండదని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఏడాదిలో ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే తోకచుక్కలు భూమికి చేరువగా వస్తాయని నాసా తెలిపింది.

చైనాలో ఘనంగా వసంతోత్సవం

బీజింగ్: చైనాలో కొత్త ఏడాదిని ఆహ్వానిస్తూ ఘనంగా వేడుకలు జరుగుతున్నాయి. వసంత ఉత్సవంగా పిలిచే ఈ సంబరాలు చైనా వ్యాప్తంగా మొదలయ్యాయి. గ్రామాలు, పట్టణాల్లో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో చిన్నాపెద్దా అంతా భాగస్వాములయ్యారు. సంప్రదాయ నృత్యాలు, ఆటలు, కళా ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. రాత్రి సమయంలో విద్యుద్దీప కాంతులతో భవనాలు మెరిసిపోతున్నాయి. ఈ నెల 16న కొత్త ఏడాది సందర్భంగా దుకాణాలన్నీ కిటకిటలాడుతున్నాయి. ఈ నెల 21వ తేదీ వరకు ఈ వేడుకలు జరుగనున్నాయి.

మాల్దీవుల్లో భారతీయుల అరెస్టు

స్వదేశానికి పంపివేత

మాలె: ఒక భారత జాతీయుడు సహ ఇద్దరు విదేశీ జర్నలిస్టులను మాల్దీవుల నుంచి బహిష్కరించారు. వారిరువురూ ఫ్రెంచి వార్తా సంస్థ ఎఎఫ్‌పి జర్నలిస్టులు.వలస నియమాలను ఉల్లంఘించినందుకు వారిద్దరినీ మాల్దీవియన్ పోలీసులు అరెస్టు చేశారు. భారత్‌కు చెందిన మణిశర్మ, బ్రిటన్‌కు చెందిన భారత సంతతి వ్యక్తి రవి పటేల్‌లను ఇమ్మిగ్రేషన్ అధికారులకు పోలీసులు అప్పగించారు. ప్రస్తుతం మాల్దీవులు రాజకీయ కల్లోలాన్ని ఎదుర్కొంటున్నాయి. టూరిస్టు వీసాపై వచ్చిన వారిద్దరూ విలేకరులుగా పని చేయడాన్ని మాల్దీవ్స్ పోలీసులు అభ్యంతరపెడుతున్నారు.

బైసన్ పోలో గ్రౌండ్‌పై ప్రధానికి ఫిర్యాదు

పరిష్కరించాలని రాష్ట్రానికి లేఖ

మన తెలంగాణ / హైదరాబాద్ : రక్షణ శాఖకు చెందిన సికింద్రాబాద్‌లోని బైసన్ పోలో గ్రౌండ్‌ను నూతన సచివాలయం అవసరాల నిమిత్తం కేటాయించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ 'సేవ్ బైసన్ పోలో గ్రౌండ్స్' అనే సంస్థ ప్రధాని కార్యాలయానికి మౌఖికంగా ఫిర్యాదు చేసింది. గతేడాది నవంబరు 6వ తేదీన ఈ సంస్థకు చెందిన గుల్షన్ జి బాంబౌట్‌తో పాటు మరికొద్దిమంది ఫిర్యాదు చేశారని, గ్రౌండ్స్ పరిరక్షణ కోసం విజ్ఞప్తి చేశారని ప్రధాని కార్యాలయం పేర్కొనింది. ఈ అంశంపై తెలంగాణ ప్రభుత్వం తన అభిప్రాయాన్ని పిటిషనర్‌కు ఇవ్వడంతో పాటు కేంద్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో కూడా ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఈ నెల 7వ తేదీన రాసిన లేఖలో ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొంది. మరోవైపున ప్రధాని కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదును సంబంధిత రాష్ట్ర ప్రభుత్వానికి చేరవేసినందున అక్కడే తగిన పరిష్కారం కోసం ప్రయత్నించాలని పేర్కొనడంతో పాటు ఈ ఫిర్యాదును మూసివేస్తున్నట్లు స్పష్టం చేసింది. రాష్ట్ర రోడ్డు రవాణా, రోడ్డు భవనాల శాఖలు పిటిషనర్ ఫిర్యాదుపై స్పందించాలని పిఎంఒ కార్యాలయం స్పష్టం చేసింది.

ఇండోనేషియాలో ఘోర రోడ్డు ప్రమాదం, 27 మంది మృతి

జకర్తా: ఇండోనేషియాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 27 మంది మృతి చెందారు. 17 మంది గాయపడ్డారు. పశ్చిమ జావా ప్రావిన్స్‌లోని సుబాంగ్ ప్రాంతంలో ప్రమాదం చోటు చేసుకుంది. 40 మంది దేశీయ పర్యాటకులతో వేగంగా కొండపైకి వెళ్తున్న బస్సు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి పల్టీలు కొట్టినట్లు పోలీసులు తెలిపారు. బాంటెన్ ప్రావిన్స్‌లోని దక్షిణ టాంగెరాంగ్ నుంచి వేడి నీటి ఊటలను చూసేందుకు బయల్దేరిన దేశీయ పర్యాటకులు ప్రమాదానికి గురయ్యారు. వాహన బ్రేకులు పని చేయకపోవడంతోనే ఘటన జరిగి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఇండోనేషియాలో రైలు, రోడ్డు ప్రమాదాలు జరగడం సర్వసాధారణం. పాత బస్సులు, రైళ్లు నడపడం, వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి.

ప్రజల చూపు ప్రత్యామ్నాయం వైపే



భీమవరం రూరల్: సిపిఎం 25వ రాష్ట్ర మహాసభలు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ప్రారంభమయ్యా యి. పట్టణంలోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో జరుగుతు న్న ఈ మహాసభలకు రాష్ట్ర నలుమూలల నుంచి ఆ పార్టీ ప్రతినిధులు తరలివచ్చారు. ఈ మహాసభలకు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం దేశ ప్రజలంతా ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారని, దీన్ని వామపక్ష పార్టీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ మతోన్మాద శక్తులను అడ్డుకుని ముందుకు సాగాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం సిపిఎం నాయకులు, కార్యకర్తలు పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించారు.

ఎపి ఎన్‌జిఒల మహాధర్నా

విజయవాడ: సిపిఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో శనివారం ఎపి ఎన్‌జిఒలు మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో శాసనమండలి సభ్యుడు బొడ్డు నాగేశ్వరరావు, ఎపి ఎన్‌జిఒల సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సిపిఎస్ విధానం వల్ల ఉద్యోగులకు నష్టం అన్నారు. అలాగే కేంద్రం పరిధిలోని అంశమైనా రాష్ట్రం కూడా చొరవ చూపాలని, సిపిఎస్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని, ఇతర రాష్ట్రాల ఉద్యోగులతో కలిసి కేంద్రంపై ఒత్తిడి తెస్తామని వారు పేర్కొన్నారు.

12 నుంచి జల సంరక్షణ కార్యక్రమం

అమరావతి: ఈ నెల 12 నుంచి జూన్ వరకు రాష్ట్రంలో జల సంరక్షణ కార్యక్రమాలు చేప డుతున్నామని జలవనరుల శాఖ మంత్రి దేవి నేని ఉమామహేశ్వరరావు అన్నారు. కృష్ణా జిల్లా నందివాడ మండలం పుట్టగుంట వద్ద రూ.8.9కోట్లతో నిర్మిస్తున్న అరిపిరాల తారక రామ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ఎమ్మె ల్సీ అర్జునుడుతో కలిసి మంత్రి ఉమ శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల 10వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని మంత్రి వెల్లడించారు. 116 రోజులు జల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా కాలువల్లో పూడికతీత పనులు పెద్ద ఎత్తున చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు, టిడిని నేతలు పాల్గొన్నారు.

ఎఎన్‌యులో హైకోర్టు న్యాయమూర్తుల బృందం పర్యటన

గుంటూరు : ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో శనివారం హైకోర్టు న్యాయమూర్తుల బృందం పర్యటించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగినప్పటికీ ఇం కా న్యాయశాఖ విభజన కాలేదు. ఇప్పటికీ ఆంధ్రపదేశ్ పేరుపైనే న్యాయశాఖ వ్యవహారాలు జరుగుతున్నాయి. కాగా...ఎపి హైకోర్టును ప్రత్యేకంగా ఏర్పాటుచేసేందుకు కేంద్రప్రభుత్వం నిర్ణయించింది. దీనిలో భాగంగా నూతన భవనాలు ఏర్పాటయ్యే వరకు తాత్కాలిక హైకోర్టును ఏర్పాటును ఏఎన్‌యూకు చెందిన భవనాల్లో నిర్వహించాలని నిర్ణయించారు. దీంతో హైకోర్టుకు చెందిన న్యాయమూర్తుల బృందం శనివారం ఎఎన్‌యూకు చేరుకుని భవనాలను పరిశీలించారు. ఈ బృందం వెంట గుంటూరు జిల్లా కలెక్టర్ శశిధర్ ఉన్నారు.

దగ్గరవుతున్న ఉత్తర,దక్షిణాలు



- దక్షిణ కొరియా అధ్యక్షుడిని ఆహ్వానించిన ఉ.కొరియా
- వింటర్ ఒలింపిక్స్ సందర్భంగా చిగురిస్తున్న స్నేహం
- ఉ.కొరియా అధ్యక్షుడి సోదరికి ఘనంగా విందు

సియోల్ : ఉత్తర కొరియా రాజధాని పొంగ్‌యాంగ్‌లో శిఖరాగ్ర సభకు దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జె ఇన్‌ను ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ యున్ శనివారం నాడు ఆహ్వానించారు. కిమ్ సోదరి, ప్రస్తుతం సియోల్‌లో ఉన్న కిమ్ యో జోంగ్ ఈ ఆహ్వానాన్ని జె ఇన్‌కు అందజేశారు. కొరియాల మధ్య శిఖరాగ్ర సభ మూడోసారి త్వరలో జరగనుంది. బ్లూ హౌస్‌లో శనివారం నాడు మూన్, కిమ్ యో జోంగ్ మధ్య విందు సమావేశం జరిగింది. మూన్‌కు సాధ్యమయ్యే తేదీల్లో శిఖరాగ్ర సభ జరుగుతుందని ఆహ్వాన పత్రంలో ఉంది. ఇక శీతాకాల ఒలింపిక్స్ సందర్భంగా దక్షిణ కొరియాలో ఉన్న ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ సోదరి కిమ్ యో జోంగ్‌కు ఆ దేశం విందు ఇచ్చింది. ద.కొరియా అధ్యక్షుడు మూన్ జేఇన్ నేడు కిమ్ యో జోంగ్ సహా తమ దేశానికి వచ్చిన ఉ.కొరియా ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందానికి విందు ఏర్పాటు చేశారు. సియోల్‌లోని అధ్యక్ష నివాసంలో మూన్ వారితో లంచ్ సమయంలో సమావేశమయ్యారు. ఇరు శత్రుదేశాల మధ్య జరిగిన ఈ విందు సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ద.కొరియాలోని ప్యాంగ్‌చాంగ్‌లో నిన్న ప్రారంభమైన శీతాకాల ఒలింపిక్స్ ప్రారంభ వేడుకలకు కిమ్ యో జోంగ్‌తో ఇతర ప్రతినిధులు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య కాస్త స్నేహపూర్వక వాతావరణం నెలకొంది. కిమ్ యో జోంగ్‌తో పాటు ఉ.కొరియా ప్రతినిధుల బృందానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కిమ్ యాంగ్ నామ్ క్రీడల ప్రారంభ వేడుకల్లో విఐపి బాక్స్‌లో కూర్చున్నారు. వారికి కొంత దూరంలో అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ కూర్చున్నారు. ఉ.కొరియా అణ్వస్త్ర క్షిపణి ప్రయోగాల నేపథ్యంలో గత కొంత కాలంగా ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. అయితే ఈ ఒలింపిక్స్ కారణంగా ఇరు దేశాల మధ్య పలు చర్చల అనంతరం ఉ.కొరియా తమ క్రీడాకారులను ద.కొరియాకు పంపించడానికి అంగీకరించింది.

సిద్దిపేటలో క్రికెట్ ఫీవర్

- టి-20 పోటీలకు భారీగా జనం హాజరు
- సినీ నటుడు అఖిల్ అక్కినేని హాజరు

మన తెలంగాణ/సిద్దిపేట ప్రతినిధి : సిద్దిపేటకు క్రికెట్ ఫీవర్ పట్టుకుంది. గత రెండు రోజులుగా సిద్దిపేట మినీ స్టేడియంలో జరుగుతున్న టి – 20 లీగ్ మ్యాచ్‌ల వీక్షణకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరవుతున్నారు. శుక్రవారం మొదటి రోజు భారీ సంఖ్యలో క్రికెట్ క్రీడాభిమానులు హాజరుకాగా రెండవ రోజైన శనివారం మొదటి రోజుకు రెట్టింపు సంఖ్యలో క్రీడాభిమానులు హాజరైనారు. హెచ్‌సిఎ ఆధ్వర్యంలో జి.వెంకటస్వామి మెమోరియల్ టీ ట్వంటీ లీగ్ మ్యాచ్‌ల నిర్వహణకు సిద్దిపేట మినీ స్టేడియం వేదికగా మారిన విషయం విదితమే. శనివారం రంగారెడ్డి జిల్లా తరపున సినీ నటుడు అఖిల్ అక్కినేని ఆడగా, మాజీ రంజీ ఆటగాడు చాముండేశ్వరీనాథ్, దగ్గుబాటి అభిరాంలు హాజరై మూడు మ్యాచ్‌లను వీక్షించారు. సిద్దిపేటకు అఖిల్ అక్కినేని రావడంతో పాటు మ్యాచ్‌ను ఆడుతుండటంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేయగా, రంగారెడ్డి రైజర్స్ జట్టు ఓపెనర్‌గా బరిలోకి దిగిన అఖిల్ కేవలం ఒకే ఒక రన్ చేసి అవుట్ కావడం క్రీడాభిమానులను నిరాశకు గురిచేసింది. జట్టుతో సంబంధం లేకుండా సిద్దిపేట ప్రజలు క్రికెట్ ఆటను పూర్తి స్థాయిలో ఆస్వాదించారు. వికెట్లు పడినపుడు, ఫోర్లు, సిక్సర్లు కొట్టినపుడు గ్రౌండ్ మార్మోగిపోయింది. శనివారం జరిగిన మొదటి మ్యాచ్‌లో రంగారెడ్డి జట్టు నిజామాబాద్ జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన రంగారెడ్డి జట్టు నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. రంగారెడ్డి జట్టు సినీ నటుడు అఖిల్ కేవలం ఒక పరుగు మాత్రమే చేసి అవుటైనాడు. నిజామాబాద్ జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 150 పరుగులు మాత్రమే చేయడంతో రంగారెడ్డి రైజర్స్ జట్టు 13 పరుగులతో విజయం సాధించింది. రెండవ మ్యాచ్ హైదరాబాద్ థండర్ బోల్ట్స్, నల్లగొండ లయన్స్ మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ థండర్ బోల్ట్స్ మూడు పరుగుల ఆధిక్యతతో నల్లగొండ లయన్స్‌పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేయగా నల్లగొండ 7 వికెట్ల నష్టానికి 127 పరుగులు మాత్రమే చేసింది.






విశాఖలో రైల్వే జోన్‌కు ఓకె!

- ఒడిశాను ఒప్పించిన కేంద్రం
- విభజన హామీలపై కొనసాగుతున్న ఎపి ఒత్తిడి



న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ విభజన హామీలపై టిడిపి కేంద్రంపై ఒత్తిడి కొనసాగిస్తోంది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీతో కేంద్రమంత్రి సుజనా చౌదరి, ఎంపి సిఎం రమేష్ శనివారంనాడు భేటీ అయ్యారు. రెవెన్యూ లోటు, రైల్వే జోన్, ఇఎపి ప్రాజెక్టులపై చర్చించారు. నిధుల విడుదలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై అరుజైట్లీ సానుకూలంగా స్పందించారు. సోమవారం ఆయాశాఖల కార్యదర్శులతో సమావేశమై హామీల అమలుకు కృషిచేస్తానని అరుణ్‌జైట్లీ నేతలకు హామీ ఇచ్చారు. మరోవైపు విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేసేందుకు కేంద్రం కసరత్తు ప్రారంభించింది. బిజెపి అధిష్ఠానం, కేంద్ర ప్రభుత్వం చర్చోపచర్చల నేపథ్యంలో రైల్వే జోన్ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభించినట్లుగా తెలుస్తోంది.విశాఖ కేంద్రంగా జోన్ ఏర్పాటుకు ఒడిశా నుంచి ప్రధానంగా అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యనేతలు,కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కేంద్రమంత్రి సుజనాచౌదరి గత రెండు రోజులుగా చర్చలు జరిపారు. విశాఖ రైల్వేజోన్ ఏర్పాటుతో ఒడిశాకు ఎలాంటి ఇబ్బంది రాదని వారికి వివరించినట్టు సమాచారం. అలాగే గుంతకల్లు,గుంటూరు,విజయవాడ డివిజన్లతో పాటు విశాఖ రైల్వే డివిజన్‌తో జోన్ ఏర్పాటుకు నిర్ణయించినట్టు తెలుస్తోంది. వాల్తేరు డివిజన్‌లోని 80శాతం ప్రస్తుత జోన్‌లోనే కొనసాగేలా నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.దీనికి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఒడిశా నేతలు ఒప్పుకొన్నట్టు సమాచారం.

తప్పుడు లెక్కలు చెబితే ఊరుకోవద్దు : చంద్రబాబు



అమరావతి: రాష్ట్ర విభజన హామీలపై ఢిల్లీలో జరిగిన తాజా రాజకీయ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మరోమారు సమీక్షించారు. ఉండవల్లిలోని తన నివాసం నుంచి ఢిల్లీలో కేంద్రమంత్రి సుజనాచౌదరి, ఎంపిలు సిఎం రమేష్ తదితర ముఖ్యనేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అటు తన నివాసంలోనూ ముఖ్యమైన నేతలు, అధికారులతో కూడా తాజా పరిణామాలపై సమీక్ష నిర్వహించారు. విభజన హామీలపై కేంద్రప్రభుత్వం స్పష్టత ఇచ్చేంతవరకూ వేచిచూసే ధోరణి అవలంబించాలని పార్టీ నేతలకు చంద్రబాబు స్పష్టంచేశారు. బిజెపి నేతలు ఎవరైనా విభజన హామీలకు సంబంధించి తప్పుడు లెక్క లు చెబితే దీటుగా స్పందించాలని సీఎం సూచించినట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి మరోమారు ప్రకటన వచ్చేంతవరకూ వేచిచూడాలని నిర్ణయించినట్లు సమాచారం. అలాగే, రాష్ట్రప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబారావును ఢిల్లీకి వెళ్లాల్సిందిగా ముఖ్యమంత్రి సూచించారు.

గుంటూరులో విషాదం

- అప్పుల బాధ భరించలేక ఒకరు ఆత్మహత్యాయత్నం
- విషయం తెలిసి అప్పిచ్చిన వ్యక్తి గుండెపోటుతో మృతి

గుంటూరు: జిల్లాలోని నాదెండ్ల మండలం సంకురాత్రిపాడు గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అనే రైతు శనివారం అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలిసి నాగేశ్వరరావుకు అప్పిచ్చిన రిటైర్డ్ ఉద్యోగి సూర్యనారాయణ గుండెపోటుతో మృతిచెందాడు. నాగేశ్వరరావుకు సూర్యనారాయణ రూ. 8లక్షల వరకు అప్పిచ్చాడు. అయితే... నాగేశ్వరరావు పురుగుల మందు తాగడం, తనిచ్చిన డబ్బులు తనకు తిరిగి వస్తాయో లేదోనన్న ఆందోళనకు గురైన సూర్యనా రాయణ గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో ఆయన కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఓ పక్క డబ్బులు వస్తాయో రావో తెలియక, మరో పక్క ఇంట్లోని వ్యక్తిని కోల్పోయి ఆ కుటుంబ సభ్యులు పడుతున్న బాధ వర్ణణాతీతం

పార్లమెంట్‌లో బిసి ఎంపిలు విఫలం: ఆర్.కృష్ణయ్య



మన తెలంగాణ / హైదరాబాద్/ ముషీరాబాద్ : బిసి కమీషన్‌కు పార్లమెంట్‌లో రాజ్యాంగ బద్ధమైన కల్పించడంలో పార్లమెంట్‌లో 94 మంది బిసి ఎంపిలు, రాజ్యసభలో 42 మంది ఎంపీలు పూర్తిగా విఫలం చెందారని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య విమర్శించారు. హైదరాబాద్ బిసి భవన్‌లో బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై ప్రసంగించారు. ప్రస్తుత పార్లమెంట్‌లోనే బిసి కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పిస్తామని ఇచ్చిన హామీని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి, బిజెపి అమిత్‌షాలు మోసం చేశారని విమర్శించారు. జనాభాలో సగ భాగం ఉన్న బిసిల న్యాయపరమైన డిమాండ్లపై పార్లమెంట్‌లోని 36 రాజకీయ పార్టీలు కూడా మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. బిసిలకు రూ.20 వేల కోట్లతో ప్రత్యేక బిసి సబ్ ప్లాన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బిసి కుల వృత్తులకు 90 శాతం సబ్సిడితో దేశ వ్యాప్తంగా రుణాలు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకం రూపొందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 201819 వార్షిక బడ్జెట్‌ను 24 లక్షల కోట్లతో ప్రవేశపెట్టి బిసిలకు కేవలం 9 వేల కోట్లు మాత్రమే కేటాయించి మోసం చేశారని ధ్వజమెత్తారు. బిసి కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించడం వల్ల ఏ వర్గానికి అన్యాయం జరగదని, అది చాలా చిన్న సమస్య అని అన్నారు. ఎస్సీ,ఎస్టీలకు ఉన్నట్లుగా బిసిలకు కూడా సామాజిక భద్రత యాక్టును ప్రవేశపెట్టాలన్నారు. బిసిల డిమాండ్ల పరిష్కారం కోసం వచ్చే బడ్జెట్ సమావేశాలు జరిగే మార్చి మొదటి వారంలో లక్షలాది మంది బిసిలతో పార్లమెంట్‌ను ముట్టడిస్తామని కృష్ణయ్య హెచ్చరించారు. ఈ సమావేశంలో బిసి సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వేములవాడ మధన్‌మోహన్‌ను జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య ప్రకటించారు. కార్యక్రమంలో తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ, నీల వెంకటేష్, మధన్‌మోహన్, మహత్మాచారి, సి.రాజేందర్, విష్ణుచారి, శ్రీనివాస్‌చారి, రవీంద్రచారి, నవీన్‌చారి, కృష్ణచారి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బిజెపి అధికారంలోకి వస్తే ఫార్మాసిటీ రద్దు

రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మ ణ్



మన తెలంగాణ/ఇబ్రహీంపట్నం టౌన్ : తెలంగాణ రాష్ట్రంలో నిజాంను మించిన నియంతృత్వ పాలన కొనసాగుతోందని తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మ ణ్ అన్నారు. శనివారం శాస్త్రా గార్డెన్‌లో ఓబీసీ జిల్లా అధ్యక్షులు జగదీష్ అధ్యక్షతన జరిగిన మహా ఓబీసీ మోర్చా మహా సంగ్రామ సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరైనారు. ముందుగా ఇబ్రహీంపట్నం అంబేడ్కర్ చౌరస్తా నుండి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వస్తే మన కొలువులు వస్తాయని ఆశించిన తెలంగాణ బిడ్డలకు సర్కార్ మొండి చేయి చూపించిందన్నారు. బారు, బీరు తప్పా మెరుగైన పాలన అడగొద్దనే ధోరణి కనబడుతుందని చెప్పారు. బీసీ ప్రయోజనాలు దెబ్బతీసే విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఓబీసీ మహా సమ్మేళనానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. బిసి విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంటు, ఎస్‌సీ , ఎస్‌టీల మాదిరిగా బీసీలకు సబ్ ప్లాన్, బీసీ ఉపసంఘం నివేదికను బట్టబయలు చేయాలని బిజెపి అసెంబ్లీలో పట్టు పడితే నేటికి బయటపెట్టలేదని తెలిపారు. ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ఫార్మాసిటీని యాచారం మండలంలో నెలకొల్పుతున్నారని దీనితో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని బిజెపి అధికారంలోకి వస్తే ఫార్మాను రద్దు చేస్తామని డాక్టర్ లక్ష్మ ణ్ ప్రకటించారు. ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టీ భూములను ధౌర్జన్యంగా తీసుకోవడం జరుగుతుందని, దీన్ని ఎట్టి పరిస్థితిలో మేము ఒప్పుకోబోమని హెచ్చరించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొత్త అశోక్ గౌడ్, రాష్ట్ర సీనియర్ నేతలు పోరెడ్డి నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Dwaraka (Everyday NewsPapers)

భారత్‌లో చాంపియన్స్ ట్రోఫీ జరగడం అనుమానమే!



దుబాయి: ప్రపంచకప్ తర్వాత అంత ప్రాధాన్యత కలిగిన చాంపియన్స్ ట్రోఫీ భారత్‌లో జరగడంపై అనుమానాలు నెలకొన్నాయి. 2021లో భారత్ ఈ మినీ ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. అయితే ప్రస్తుతం భారత్‌లో అమలులో ఉన్న పన్నుల విధానం దీనికి అవరోధంగా మారింది. ఈ టోర్నమెంట్‌లో భారత్‌లో జరగాలంటే పూర్తిగా పన్ను మినహాయింపు ఇవ్వాలనే మెలికను అంతర్జాతీయ క్రికెట్ మండలి పెట్టింది. అయితే భారత ప్రభుత్వం పన్నుల విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. క్రికెట్ కోసం తమ పంథాను మార్చుకునేందుకు ప్రభుత్వం అంగీకరిస్తుందని ఆశించడం అత్యాశే అవుతోంది. కాగా, పన్నుల మినహాయింపు లేకుంటే మాత్రం భారత్‌లో చాంపియన్స్ ట్రోఫీని నిర్వహించడం తమ వల్ల కాదని ఐసిసి ఇప్పటికే బిసిసిఐ అధికారులకు తేల్చి చెప్పింది. మరోవైపు భారత బోర్డు అధికారులు కూడా పన్ను మినహాయింపు విషయంపై ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారు. కాగా గతంలో భారత్‌లో జరిగిన 2006 చాంపియన్స్ ట్రోఫీకి అప్పటి యూపిఎ ప్రభుత్వం పన్ను మినహాయింపు ఇచ్చింది. అయితే 2016లో జరిగిన ఐసిసి టి–20 ప్రపంచకప్‌కు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఎలాంటి పన్ను మినహాయింపు ఇవ్వలేదు.

అంకిత, కౌర్‌ల గెలుపు

- ఫెడ్ కప్ టెన్నిస్ టోర్నీ



న్యూఢిల్లీ: ఫెడ్ కప్ ఆసియా–ఒసియానా గ్రూప్–1 పోటీల్లో భాగంగా జరిగిన మ్యాచుల్లో భారత క్రీడాకారిణిలు అంకిత రైనా కర్మాన్ కౌర్‌లు విజయం సాధించారు. దీంతో భారత్ ఆసియా ఒసియానా గ్రూప్–1లో తన స్థానాన్ని నిలబెట్టుకుంది. శనివారం ఢిల్లీలో చైనీస్ తైపీతో జరిగిన రెండు సింగిల్స్ మ్యాచ్‌లలోనూ భారత్ జయకేతనం ఎగుర వేసింది. తొలి సింగిల్స్ కౌర్ 7–6, 6–3 తేడాతో లీ పి చీను ఓడించింది. తొలి సెట్‌లో ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైనా కౌర్ జోరును కొనసాగించింది. చివరి వరకు ఆధిక్యాన్ని కనబరుస్తూ సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్‌లో కూడా కౌర్ విజయం సాధించింది. ఈసారి ప్రారంభం నుంచే దూకుడుగా ఆడుతూ ప్రత్యర్థిని హడలెత్తించింది. కళ్లు చెదిరే షాట్లతో చెలరేగిన కౌర్ సునాయాసంగా సెట్ ను గెలిచి భారత్ 1–0 ఆధిక్యాన్ని అందించింది.



చెమటోడ్చిన అంకిత..

రెండో సింగిల్స్‌లో అంకిత రైనా చిరస్మరణీయ విజయాన్ని సాధించింది. చీ యుసుతో జరిగిన హోరాహోరీ పోరులో అం కిత 6–4, 5–7, 6–1తో జయభేరి మోగించింది. తొలి సెట్‌లో అంకిత ఆధిపత్యాన్ని చెలాయించింది. చూడచక్కని షాట్లతో అలరించిన అంకిత ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెట్టింది. చివరి వరకు దూకుడును కనబరుస్తూ 6–4తో సెట్‌ను సొంతం చేసుకుంది. కానీ, రెండో సెట్‌లో సీన్ రివర్స్ అయ్యింది. ఈసారి ప్రత్యర్థి నుంచి అంకితకు గట్టి పోటీ ఎదురైంది. యు సు అద్భు త పోరాట పటిమను కనబరుస్తూ అంకితకు గట్టి పోటీని ఇ చ్చింది. అంకిత ఈ క్రమంలో ఒత్తిడికి గురైంది. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న చైనీస్‌తైపి క్రీడాకారిణి ట్రైబ్రేకర్‌లో సెట్‌ను సొంతం చేసుకుంది. కాగా, కీలకమైన మూడో సెట్‌లో మాత్రం అంకిత మళ్లీ చెలరేగి ఆడింది. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడుతూ లక్ష్యం దిశగా సాగింది. ప్రత్యర్థికి ఏమాత్రం అ వకాశం ఇవ్వకుండా ఆడిన అంకిత రైనా 6–1తో సెట్‌ను గెలిచి మ్యాచ్‌ను దక్కించుకుంది. అంకిత గెలుపుతో ఈ ప్లేఆఫ్ పోరు లో భారత్ 2–0తో తిరుగులేని ఆధిక్యాన్ని సాధించి గ్రూప్–1లో తన స్థానాన్ని నిలబెట్టుకుంది.

రైల్వేస్ జయభేరి

ఆలూర్: విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా శనివారం జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో రైల్వేస్ 35 పరుగుల తేడాతో అస్సాంపై అద్భుత విజయాన్ని అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన రైల్వేస్ కేవలం 161 పరుగులకే కుప్పకూలింది. అవినాష్ యాదవ్ (30), అభిషేక్ యాదవ్ (27), అరింధమ్ ఘోష్ (23) తప్ప మిగతా వారు ఘోరంగా విఫలమయ్యారు. అస్సాం జట్టులో అనుప్ దాస్, జీతుమోని మూడేసి వికెట్లు తీసి రైల్వేస్ ఇన్నింగ్స్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. తర్వాత స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన అస్సాం 126 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని చవిచూసింది. రైల్వేస్ బౌలర్లు అసాధారణ ప్రతిభతో అస్సాంను తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. అస్సాం జట్టులో అమిత్ సిన్హా (39), అబు నెఛిమ్ (26) తప్ప మిగతావారు రైల్వేస్ బౌలర్ల ధాటికి ఎదురు నిలువలేక పోయారు. రైల్వేస్ జట్టులో మిశ్రా అసాధారణ బౌలింగ్‌ను కనబరిచాడు. 21 పరుగులకే ఐదు వికెట్లు తీసి అస్సాంగ్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చాడు. ఠాకూర్ రెండు, అంకిత్ యాదవ్ మూడు వికెట్లు తీసి తమవంతు పాత్ర పోషించారు.



కర్ణాటక, హర్యానా మ్యాచ్ రద్దు...

మరోవైపు భారీ వర్షం కారణంగా గ్రౌండ్ చిత్తడిగా మారడంతో కర్ణాటక–హర్యానా జట్ల మధ్య శనివారం జరిగిన మరో మ్యాచ్ ఒక్క బంతి పడకుండానే రద్దయ్యింది. గ్రౌండ్ బురదమయంగా మారడంతో మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు రఫరీ ప్రకటించాడు.

బరోడా గెలుపు..

పంజాబ్‌తో జరిగిన మరో మ్యాచ్‌లో బరోడా 25 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వర్షం వల్ల మ్యాచ్‌ను 21 ఓవర్లకు కుదించారు. ముందుగా బ్యాటింగ్ చేసిన బరోడా 21 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. విష్ణు సోలంకి విధ్వంసక ఇన్నింగ్స్‌తో బరోడాను ఆదుకున్నాడు. చెలరేగి ఆడిన విష్ణు 8ఫోర్లు, మూడు సిక్సర్లతో 77 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 142 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ యువరాజ్ సింగ్ ఏడు ఫోర్లు, సిక్స్‌తో 51 పరుగులు చేసినా పంజాబ్‌ను గెలిపించలేక పోయాడు.

దక్షిణాఫ్రికాకు ఓదార్పు విజయం

- భారత మహిళలకు తొలి ఓటమి



పొట్చెన్‌రూమ్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో భారత మహిళా జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. శనివారం జరిగిన చివరి వన్డే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఏడు వికెట్ల తేడా తో భారత్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో ఓడినా భారత్ 2–1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత మహిళా జట్టు 240 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా విమెన్స్ జట్టు 49.2 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. క్లిష్టమైన లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికాను డు ప్రీజ్ 90 (నాటౌట్), కెప్టెన్ నికార్క్ 41 (నాటౌట్) అద్భుత బ్యాటింగ్‌తో ఆదుకున్నారు. వీరిద్దరూ భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ జట్టుకు ఓదార్పు విజయాన్ని అందించారు. ఓపెనర్ లిజెల్లి లీ (10) ప్రారంభంలోనే పెవిలియన్ చేరింది. అయితే మరో ఓపెనర్ లౌరా వాల్‌వర్డ్‌ట్ అద్భుత బ్యాటింగ్‌తో జట్టును ఆదుకుంది. ఆమెకు స్టెయిన్ అండగా నిలిచింది. కీలక ఇన్నింగ్స్ ఆడిన లౌరా 4ఫోర్లతో 59 పరుగులు సాధించింది. స్టెయిన్ ఐదు బౌండరీలతో 30 పరుగులు చేసి తనవంతు పాత్ర పోషించింది. వీరిద్దరూ ఔటైనా తర్వాత జట్టును గెలిపించే బాధ్యతను డు ప్రీజ్, నికార్క్ తమపై వేసుకున్నారు. చెలరేగి ఆడిన డుప్రీజ్ ఏడు ఫోర్లతో 111 బంతుల్లోనే అజేయంగా 90 పరుగులు చేసింది. భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగిన డుప్రీజ్ కీలక ఇన్నింగ్స్‌తో జట్టుకు తొలి విజయాన్ని అందించింది. మరోవైపు కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన నికార్క్ ఐదు ఫోర్లతో 41 పరుగులు చేసి జట్టు విజయంలో ముఖ్య భూమికను పోషించింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌ను ఓపెనర్ దీప్తి శర్మ ఆదుకుంది. తొలి రెండు వన్డేల్లో మెరుపులు మెరిపించిన స్మృతి మందన ఈసారి ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరింది. కెప్టెన్ మిథాలీ (4) కూడా నిరాశ పరిచింది. కానీ దీప్తి శర్మ అద్భుత బ్యాటింగ్‌తో జట్టును ఆదుకుంది. ఆమెకు హర్మన్‌ప్రీత్ కౌర్ (25) అండగా నిలిచింది. తర్వాత వచ్చిన వేద కృష్ణమూర్తి కూడా మెరుగైన ఇన్నింగ్స్‌ను ఆడింది. కీలక ఇన్నింగ్స్‌ను ఆడిన వేద 8ఫోర్లతో 56 పరుగులు సాధించింది. మరోవైపు దీప్తి 8 ఫోర్లతో 79 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది.

బంగ్లా చిత్తు.. శ్రీలంకకు సిరీస్



ఢాకా: బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను శ్రీలంక కైవసం చేసుకుంది. ఇక్కడ జరిగిన రెండో టెస్టులో లంక 215 పరుగుల తేడాతో బంగ్లాను చిత్తు చేసి రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 1–0తో దక్కించుకుంది. మూడు రోజుల్లోనే ముగిసిన ఈ మ్యాచ్‌లో బౌలర్లు పూర్తి ఆధిపత్యం చెలాయించారు. 339 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన బంగ్లాదేశ్ కేవలం 123 పరుగులకే కుప్పకూలి ఘోర పరాజయం చవిచూసింది. లంక స్పిన్నర్లు అకిల ధనంజయ, రంగన హెరాత్‌లు అసాధారణ బౌలింగ్‌తో బంగ్లా ఇన్నింగ్స్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. బంగ్లా జట్టులో మెహది హసన్ 38(నాటౌట్) ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. వికెట్ కీపర్ దాస్ (28), ఇమ్రుల్ కైస్ (19), కెప్టెన్ మహ్మదుల్లా (17) తప్ప మిగతావారు కనీసం రెండంకెలా స్కోరును కూడా అందుకోలేక పోయారు. తొలి టెస్టులో అదరగొట్టిన మోమిన్‌నుల్ హక్ ఈ ఇన్నింగ్స్‌లో ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఓపెనర్ తమీమ్ ఇక్బాల్ (4) కూడా నిరాశ పరిచాడు. సీనియర్ ఆటగాడు ముష్ఫికుర్ రహీం (1) కూడా జట్టును ఆదుకోలేక పోయాడు. దీంతో బంగ్లాకు ఘోర పరాజయం తప్పలేదు. లంక బౌలర్లలో హెరాత్ నాలుగు, అకిల ధనంజయ ఐదు వికెట్లు పడగొట్టాడు. ఈ క్రమంలో హెరాత్ కొత్త రికార్డును నెలకొల్పాడు. టెస్టు క్రికెట్‌లో హెరాత్ 400వ వికెట్‌ను సాధించాడు. ఈ సందర్భంగా ఈ ఫీట్‌ను సాధించిన ఐదో బౌలర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఇదిలావుండగా అంతకు ముందు 200/8 ఓవర్‌నైట్ స్కోరుతో శనివారం మూడో రోజు బ్యాటింగ్ కొనసాగించిన లంక 226 పరుగులకు ఆలౌటైంది. రోశన్ షా పది ఫోర్లతో 70 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. రోశన్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది. అంతేగాక సిరీస్‌లో నిలకడగా బ్యాటింగ్ చేయడంతో ప్లేయర్ ఆఫ్‌ది సిరీస్ అవార్డును కూడా దక్కించుకున్నాడు.

అఫ్గాన్ రికార్డు విజయం



షార్జా: జింబాబ్వేతో జరిగిన తొలి వన్డేలో అఫ్గానిస్థాన్ 154 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. వన్డేల్లో అఫ్గాన్‌కు ఇది అతి పెద్ద విజయం కావడం విశేషం. ముందుగా బ్యాటింగ్ చేసిన అఫ్గాన్ 50 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 333 పరుగులు చేసింది. వన్డేల్లో అఫ్గాన్‌కు ఇదే అత్యుత్తమ స్కోరు. ఓపెనర్లు మొహమ్మద్ షెజాద్ (36), ఇన్సానుల్లా జన్నత్ (54) తొలి వికెట్‌కు 90 పరుగులు జోడించి శుభారంభం అందించారు. తర్వాత వచ్చిన రహమత్ షా అద్భుత బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నాడు. చెలరేగి ఆడిన రహమత్ 110 బంతుల్లో 8ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో 114 పరుగులు చేశాడు. నసీర్ జమాల్ (31) తనవంతు పాత్ర పోషించాడు. మరోవైపు విధ్వంసక ఇన్నింగ్స్ ఆడిన నజీబుల్లా జర్డాన్ ఐదు ఫోర్లు, మరో ఐదు సిక్సర్లతో 51 బంతుల్లోనే అజేయంగా 81 పరుగులు చేశాడు. జర్డాన్ చెలరేగి పోవడంతో అఫ్గాన్ స్కోరు 333కి చేరింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే కేవలం 179 పరుగులకే కుప్పకూలింది. అఫ్గాన్ బౌలర్లు అద్భుత ప్రతిభతో ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. జింబాబ్వే జట్టులో సాలోమాన్ (34) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. క్రెగ్ ఎర్విన్ (33), సికందర్ రజా (25) తప్ప మిగతావారు విఫలమయ్యారు. అఫ్గాన్ బౌలర్లలో రషీద్ అద్భుత ప్రతిభను కనబరిచాడు. జింబాబ్వే బౌలర్లను హడలెత్తించిన రషీద్ 4 వికెట్లు పడగొట్టి జింబాబ్వే ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చాడు. ముజీబ్ జర్డాన్‌కు రెండు వికెట్లు లభించాయి.

తీరు మారని రోహిత్



దక్షిణాఫ్రికా టూర్‌లో భారత స్టార్ బ్యాట్స్‌మన్ రోహిత్ శర్మ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. శనివారం జరిగిన నాలుగో వన్డేలోనూ రోహిత్ నిరాశ పరిచాడు. టెస్టుల్లో విఫలమైన రోహిత్ వన్డేల్లోనూ అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాడు. ఒకవైపు సహచర ఓపెనర్ శిఖర్ ధావన్ ఆకాశమే హద్దుగా చెలరేగి పోతుంటే రోహిత్ మాత్రం చెత్త బ్యాటింగ్‌తో నిరాశ పరుస్తున్నాడు. వన్డేల్లో అద్భుత రికార్డు కలిగిన రోహిత్ ఈ సిరీస్‌లో మాత్రం పూర్తిగా విఫలమయ్యాడు. ఆడిన నాలుగు ఇన్నింగ్స్‌లలో కలిపి కనీసం 50 పరుగులు కూడా పూర్తి చేయలేక పోయాడు. సొంత గడ్డపై ప్రత్యర్థి బౌలర్లకు సింహస్వప్నంగా కనిపించే రోహిత్ విదేశి పిచ్‌లపై తాను రాణించలేననే విషయాన్ని మరోసారి నిరూపించాడు. సొంత గడ్డపై మూడు డబుల్ సెంచరీలు కొట్టి అదరగొట్టిన రోహిత్ విదేశాల్లో మాత్రం ఆ జోరును కొనసాగించలేక పోతున్నాడు. ఏ సిరీస్‌లో కూడా అతను రాణించిన సందర్భాలు లేవంటే అతిశయోక్తి లేదు. ఏదో లంక, బంగ్లాదేశ్, విండీస్ పిచ్‌లపై మాత్రమే రోహిత్‌కు కాస్త మంచి రికార్డు ఉంది. ఇక, బౌన్స్‌కు అనుకూలంగా ఉండే దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్‌లలో అతని ప్రదర్శన అంతంత మాత్రమేనని చెప్పొచ్చు. ఈసారి కూడా రోహిత్ తనపై ఉన్న అపవాదును చెరిపించుకోలేక పోయాడు. నాలుగు ఇన్నింగ్స్‌లలో కూడా ప్రత్యర్థి బౌలర్లను సమర్థంగా ఎదుర్కొవడంలో విఫలమయ్యాడు. ముఖ్యంగా రబడా బౌలింగ్‌లో రోహిత్‌కు చుక్కలు కనిపిస్తున్నాడు. మూడో వన్డేలో కూడా అతని బౌలింగ్‌లోనే ఔటైనా రోహిత్ ఈ మ్యాచ్‌లో కూడా అతనికే చిక్కాడు. రోహిత్ వైఫల్యం జట్టుకు ఇబ్బందికరంగా మారింది. ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేయగలిగే సత్తా కలిగిన రోహిత్ ఈ సిరీస్‌లో మాత్రం ఘోర వైఫల్యంతో సతమతమవుతున్నాడు. ఇప్పటికే నాలుగు మ్యాచ్‌లు ఆడిన రోహిత్‌కు మిగిలిన రెండు మ్యాచుల్లో చోటు దక్కడం అనుమానమే.

ధావన్ మెరుపులు

- రాణించిన కోహ్లి, ధోని

భారత్ 289/7, దక్షిణాఫ్రికా 43/1, నాలుగో వన్డేకు వర్షం దెబ్బ

జోహెన్నస్‌బర్గ్: వందో వన్డేలో ఓపెనర్ శిఖర్ ధావన్ శతకంతో చెలరేగడంతో దక్షిణాఫ్రికాతో జరిగిన నాలుగో వన్డేలో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు 7.2 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 43 పరుగులు చేసింది. ఈ సమయంలో వర్షం రావడంతో ఆటను అర్ధాంరతంగా నిలిపివేశారు. రాత్రి 11.30 వరకు కూడా ఆట తిరిగి ప్రారంభం కాలేదు. భారీ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికాకు ఓపెనర్లు మార్‌క్రామ్, హాషిం ఆమ్లా శుభారంభం అందించారు. ధాటిగా ఆడిన కెప్టెన్ మార్‌క్రామ్ 23 బంతుల్లో మూడు ఫోర్లతో 22 పరుగులు చేసి బుమ్రా వేసిన చక్కటి బంతికి వికెట్ల ముందు దొరికి పోయాడు. మరోవైపు ఆమ్లా 21 బంతుల్లో 3 ఫోర్లతో 19 పరుగులు సాధించి అజేయంగా ఉన్నాడు. కాగా, మార్‌క్రామ్ ఔటైనా తర్వాత మళ్లీ ఆట ప్రారంభం కాలేదు. కాగా, దక్షిణాఫ్రికా విజయం సాధించాలంటే మరో 247 పరుగులు చేయాల్సి ఉంది.

ధావన్, కోహ్లి జోరు...

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌కు ప్రారంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ రోహిత్ శర్మ తన పేలవమైన ఫాంను ఈ మ్యాచ్‌లోనూ కొనసాగించాడు. కేవలం ఐదు పరుగులు మాత్రమే చేసి రబడా బౌలింగ్‌లో ఔటయ్యాడు. అయితే తర్వాత వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లి అండతో ధావన్ ఇన్నింగ్స్‌ను కుదుట పరిచాడు. ఇద్దరు దక్షిణాఫ్రికా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ముందుకు సాగారు. కోహ్లి సమన్వయంతో బ్యాటింగ్ చేయగా, ధావన్ మెరుపులు మెరిపించాడు. చూడచక్కని షాట్లతో సఫారీ బౌలర్లను హడలెత్తించాడు. వీరిద్దరి జోరుతో భారత్ మళ్లీ కోలుకుంది. వీరిని ఔట్ చేసేందుకు సౌతాఫ్రికా బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇదే సమయంలో రెండో వికెట్‌కు 50 పరుగులు జోడించారు. కాగా వేగంగా ఆడిన ధావన్ ఐదు ఫోర్లతో అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఆ వెంటనే కోహ్లి కూడా దీన్ని సాధించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన కోహ్లి ఐదు ఫోర్లు, ఒక సిక్స్‌తో అర్ధ సెంచరీ అందుకున్నాడు. అంతేగాక రెండో వికెట్‌కు వంద పరుగుల పార్ట్‌నర్‌షిప్‌ను నమోదు చేశారు. అయితే కుదురుగా ఆడుతున్న కోహ్లి (75; 83 బంతుల్లో 7X4, 1X6)ను మోరిస్ వెనక్కి పంపాడు. దీంతో 158 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.

రికార్డు శతకం...

మరోవైపు శిఖర్ ధావన్ 99 బంతుల్లోనే పది ఫోర్లు, రెండు సిక్సర్లతో సెంచరీని పూర్తి చేశాడు. ఈ క్రమంలో వందో వన్డేలో సెంచరీ సాధించిన తొలి భారత బ్యాట్స్‌మన్‌గా రికార్డు సృష్టించాడు. ధావన్‌కు ఇది వన్డేల్లో 13వ శతకం కావడం విశేషం. అంతేగాక అత్యంత వేగంగా 13 సెంచరీలు సాధించిన రెండో భారత బ్యాట్స్‌మన్‌గా ధావన్ నిలిచాడు. కోహ్లి మాత్రమే ధావన్ కంటే వేగంగా 13 శతకాలు సాధించాడు. కాగా, 105 బంతుల్లో 11 ఫోర్లు, రెండు సిక్సర్లతో 109 పరుగులు చేసిన ధావన్‌ను మోర్కెల్ వెనక్కి పంపాడు. కాగా, చివర్లో ధోని మూడు ఫోర్లు, ఒక సిక్స్‌తో అజేయంగా 42 పరుగులు చేయడంతో భారత స్కోరు 289 పరుగులకు చేరింది.



అంతా గులాబీమయం..



భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య శనివారం జరిగిన నాలుగో వన్డే మ్యాచ్‌లో స్టేడియంలో ఎక్కడ చూసినా గులాబీ వాతావరణం కనిపించింది. క్యాన్సర్ బాధితులకు సంఘీభావంగా సౌతాఫ్రికా ప్రతి ఏడాది పింక్ డ్రెస్‌లో బరిలోకి దిగడం అనవాయితీగా వస్తోంది. ఇప్పటి వరకు ఐదు సార్లు పింక్ దుస్తుల్లో బరిలోకి దిగిన సఫారీ అన్ని మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది. కాగా, శనివారం కూడా అదే లక్ష్యంతో బరిలోకి దిగింది. ఇదిలావుండగా వండరర్స్ స్టేడియం మొత్తం గులాబీ మయంగా మారిపోయింది. దక్షిణాఫ్రికా క్రికెటర్లతో పాటు చాలా మంది అభిమానులు కూడా పింక్ దుస్తుల్లోనే మ్యాచ్‌ను చూసేందుకు తరలివచ్చారు. దీంతో ఎక్కడ చూసిన గులాబీ రంగు వాతావరణం స్పష్టంగా కనిపించింది.

ఆస్ట్రేలియా ఘన విజయం

మెల్‌బోర్న్: ఇంగ్లాండ్‌తో జరిగిన ట్వంటీ–20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ముక్కోణపు టి–20 సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 138 పరుగుల లక్ష్యాన్ని మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఈ టోర్నమెంట్‌లో ఆస్ట్రేలియాకు ఇది హ్యాట్రిక్ విజయం కావడం విశేషం. ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. ఆస్ట్రేలియా బౌలర్లు కచ్చితమైన లైన్ అండ్ లెన్త్‌తో బౌలింగ్ చేస్తూ ఏ దిశలోనూ ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్‌ను కోలుకోనివ్వలేదు. మరోవైపు ఓపెనర్లు జాసన్ రాయ్ (8), అలెక్స్ హెల్స్ (3) నిరాశ పరిచారు. డేవిడ్ మలాన్ (10) కూడా ఆశించిన స్థాయిలో ఆడలేక పోయాడు. కెప్టెన్ జోయ్ బట్లర్ ఒంటరి పోరాటం చేశాడు. 3ఫోర్లతో 46 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కాగా, శామ్ బిల్లింగ్స్ 4 ఫోర్లు, ఒక సిక్స్‌తో వేగంగా 29 పరుగులు సాధించాడు. దీంతో ఇంగ్లాండ్ స్కోరు 137కు చేరింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా 14.3 ఓవర్లలోనే కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్ డేవిడ్ వార్నర్ (2) తొలి ఓవర్‌లోనే పెవిలియన్ చేరాడు. అయితే మరో ఓపెనర్ షార్ట్‌తో కలిసి క్రిస్ లీన్ దూకుడును కొనసాగించాడు. చెలరేగి ఆడిన లీన్ 19 బంతుల్లోనే 4 ఫోర్లు, రెండు సిక్సర్లతో 31 పరుగులు చేశాడు. మాక్స్‌వెల్ కూడా దూకుడుగా ఆడాడు 26 బంతుల్లోనే 3ఫోర్లు, రెండు సిక్స్‌లతో 39 పరుగులు సాధించాడు. ఓపెనర్ షార్ట్ 3ఫోర్లు, ఒక సిక్స్‌తో 36 పరుగులు చేసి అజేయంగా ఉన్నాడు. అరోన్ ఫించ్ విధ్వంసక ఇన్నింగ్స్‌తో మిగిలిన లాంఛనాన్ని పూర్తి చేశాడు. చెలరేగి ఆడిన ఫించ్ ఐదు బంతుల్లోనే రెండు ఫోర్లు, మరో రెండు సిక్స్‌లతో 20 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. దీంతో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. కాగా, బౌలింగ్‌లో రాణించిన రిచర్డ్‌సన్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.

Dwaraka (Everyday NewsPapers)